పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు

నెల్లూరు (సాంస్కృతికం) : ఎన్నికల పోలింగ్ జరిగే ఈ నెల 13వ తేదీన జిల్లాలోని కార్మికులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు యాజమాన్యాలు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వాణిజ్య, వ్యాపార, పారిశ్రామిక సంస్థలు, దుకాణాలు, ఇతర సంస్థలు అర్హులైన కార్మికులందరికీ సెలవు ఇవ్వాలని కోరారు. కార్మికులు సాధారణ, షిఫ్టుల వారీగా పనిచేస్తున్నా ఓటు హక్కు వినియోగించుకునేందుకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలన్నారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారు జరిమానాతోపాటు శిక్షకు బాధ్యులవుతారని హెచ్చరించారు.

'రాజన్న రాజ్యం తీసుకొస్తాం. ఇంటింటా సంతోషాలు నింపుతాం.' ఈ మాటలు చెప్పే వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టారు. రాజన్న రాజ్యం ఏమోగాని కబ్జారాయుళ్లు, అక్రమార్కులు, మోసగాళ్లు ఇలా అధికారం అండతో పేట్రేగిపోయారు. భూములు, మట్టి, ధాన్యం, గ్రావెల్, క్వార్ట్జ్, ముంపు పరిహారాలు.. ఎక్కడ చూసినా కుంభకోణాలు వెలుగుచూశాయి. అధికారుల విచారణలో బట్టబయలైన కొన్ని కుంభకోణాల్లో వైసీపీ నేతల పాత్ర స్పష్టంగా తేలిపోయింది. అయినా ఏ ఒక్కరిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మునుపెన్నడూ లేనివిధంగా అధికార వ్యవస్థ కూడా వైసీపీ నేతల చేతుల్లో ఇరుక్కుపోయింది. బాబోయ్.. ఇక్కడ దోచుకుంటున్నారు పట్టించుకోండి..! అని సామాన్య జనం గగ్గోలు పెట్టినా తమకేమీ వినపడట్లేదు అన్న విధంగా వ్యవస్థ తయారైంది. కాదు కాదు... తయారు చేశారు.

\- నెల్లూరు, ఆంధ్రజ్యోతి

రాజన్న రాజ్యం రాబందుల రాజ్యం



● ధాన్యంలోనూ దోచేశారు!

దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాదంటే ధాన్యానికి మంచి ధర లభించింది కానీ వైసీపీ ప్రభుత్వంలో మొదటి మూడేళ్లు రైతులు నిలువు దోపిడీకి గురయ్యారు. కనీస మద్దతు ధర పుట్టికి రూ.16 వేలకుపైగా ఉండగా మార్కెట్లో రూ.12 వేలకు కూడా కొనేవారు కరువయ్యారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రకరకాల కొర్రీలు వేస్తూ రైతులను వెనక్కు పంపడంతో ఇక తప్పనిసరి పరిస్థితుల్లో బహిరంగ మార్కెట్లో అమ్ముకునే పరిస్థితులు తీసుకొచ్చారు. వైసీపీ నేతలే దళారుల అవతారమెత్తి రైతుకు దక్కాల్సిన మద్దతు ధరను దోచుకున్నారు. 2020, 2021, 2022 సంవత్సరాల్లో ధాన్యం కొనుగోళ్లలో భారీ కుంభకోణమే జరిగింది. రోడ్లు, చెరువులు, రైల్వేలైన్లను కూడా ఈ-క్రాప్‌లో బుకింగ్ చేయించారు. ఆ తర్వాత రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యాన్ని కొని అదే ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయించారు. తద్వారా ఒక్కో పుట్టికి రూ.4 వేల నుంచి 5 వేలు అక్రమంగా సంపాదించారు. 2022లో ధాన్యం కొనుగోళ్లపై విచారణ జరపగా దాదాపు 500 మంది అమ్మిన విక్రయాలు అక్రమమని తేల్చారు. వీరికి ఇవ్వాల్సిన రూ.36 కోట్లను నిలుపుదల చేశారు. ఈ అక్రమార్కులకు సహకరించిన 25 మంది గ్రామ వ్యవసాయ సహాయకులను సస్పెండ్ చేశారు. కానీ ఆ తర్వాత ఆ రూ.36 కోట్ల కోసం ఒక్కరు కూడా ముందుకు రాలేదు. అయితే అధికారులు కూడా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయలేదు. అందుకు ప్రధాన కారణం వారంతా వైసీపీ నాయకులు కావడమేనన్న వాదన ఉంది. ఒక్క 2022లోనే ఇలా ఉంటే అంతకుముందు ఇంకెంత స్థాయిలో రైతులను దోపిడీ చేసి ఉంటారో అర్థం చేసుకోవచ్చు.

వైసీపీ ప్రభుత్వంలో కాసింత ప్రభుత్వ జాగా కనిపిస్తే చాలు దానిపై కబ్జాదారులు వాలిపోతారు. రెవెన్యూ అధికారులను మేనేజ్ చేసుకోవడం, రికార్డులు మార్చుకొని తమపేర్లు ఎక్కించుకోవడం.. వంటి సంఘటనలు అనేకం జరిగాయి. ప్రభుత్వ భూముల నుంచి మొదలైన ఈ కబ్జాల పర్వం పట్టాభూముల వరకు చేరుకుంది. కొందరి భూములను వారికి తెలియకుండానే రికార్డుల్లో నుంచి వారి పేర్లు తొలగించారు. గడిచిన ఐదేళ్లలో ఇటువంటి ఫిర్యాదులు ఉన్నతాధికారులకు కోకొల్లలుగా అందాయి. మర్రిపాడు మండలంలో ఏకంగా ఒక కుటుంబం ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన చోటుచేసుకుంది. పొదలకూరు మండలంలో ఓ తహసీల్దార్ ఇష్టానుసారంగా వైసీపీ నేతలకు అనుకూలంగా రికార్డులు మార్చేశారు. వీటిపై ఫిర్యాదులు అందడంతో ఏసీబీ అధికారులు విచారించి అక్రమాలు నిజమేనని నిగ్గు తేల్చారు. ఆ తహసీల్దార్‌ను సస్పెండ్ చేయడంతోపాటు ఒక్కో గ్రామానికి ఒక్కో తహసీల్దార్‌ను విచారణాధికారిగా నియమించారు. ఈ విచారణలో అనేక అవకతవకలు బయటపడ్డాయి. అయినా చాలా రికార్డుల్లో వైసీపీ నేతల పేర్లు తొలగించలేదు. వెంకటాచలం మండలం కాకుటూరు రెవెన్యూ పరిధిలోని రూ.50 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి రికార్డులను మార్చేసి కొట్టేసేందుకు స్కెచ్ వేశారు. ఈ కుంభకోణంలో వైసీపీ నేతల హస్తం ఉండడంతో వారిని జైలుకు పంపారు. కృష్ణపట్నం పోర్టు భూములు 200 ఎకరాల రికార్డులు మార్చేసి వేరొకరికి అమ్మేశారు. కొన్నాళ్ల తర్వాత దీనిని పోర్టు యాజమాన్యం కనుగొనడంతో అక్రమార్కులు జైలుకెళ్లారు.



● పరిహారంలోనూ స్వాహా


కండలేరు ముంపు ప్రాంతం కింద పెరంకొండ గ్రామానికి పరిహారం మాటున దాదాపు రూ.33 కోట్లకుపైగా స్వాహా చేశారు. టీడీపీ ప్రభుత్వంలో ఈ అక్రమాలకు బ్రేకులు వేయగా, వైసీపీ ప్రభుత్వంలో దర్జాగా బిల్లులు పెట్టుకొని దోచుకున్నారు. దీనిపై జాయింట్ కలెక్టర్ విచారణ జరిపి అక్రమాలు నిజమని తేల్చినా ఇంత వరకు ఒక్కరిపై కూడా చర్యలు తీసు కోలేదు. అలానే కలువాయి మండలం చవటపల్లి రిజర్వాయర్ ముంపు పరిహారం చెల్లింపులో అక్రమాలు జరిగాయని స్వయంగా ఆర్డీవో విచారణలో తేల్చి క్రిమినల్ కేసులు పెట్టినా పోలీసులు ఒక్కరిని కూడా అరెస్టు చేయకపోవడం గమనార్హం. ఇప్పటికీ పరిహారాల మాటున దోపిడీ జరుగుతుండడం కొసమెరుపు.



● మట్టి, గ్రావెల్ మాఫియాలు

గడిచిన ఐదేళ్లలో మట్టి, గ్రావెల్ అన్నవి వైసీపీ నేతలకు అందిన ద్రాక్షగా చెప్పుకోవచ్చు. ఓ వైపు రైల్వే మూడో లైను, మరోవైపు పెద్ద సంఖ్యలో లేఅవుట్లు వేయడంతో మట్టి, గ్రావెల్‌కు డిమాండ్ ఏర్పడింది. దీనిని రెండు చేతులా సొమ్ము చేసుకున్నారు. ఈ కుంభకోణంలోనే రూ.వందల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. కావలి, సర్వేపల్లి నియోజకవర్గాల్లో ఎటు చూసినా భారీ గుంతలే దర్శనమిస్తాయి. రుద్రకోట చెరువు, సర్వేపల్లి రిజర్వాయర్ మట్టి, గ్రావెల్ కుంభకోణాలకు నిలువుటద్దంలా కనిపిస్తాయి. ఈ రెండు చోట్లా రూ.వంద కోట్లకుపైగా ఖనిజం తరలివెళ్లినట్లు అధికారుల విచారణలో తేలింది. కానీ ఏ ఒక్కరిపై కూడా చర్యలు తీసుకోలేదు. సర్వేపల్లి రిజర్వాయర్‌లో అక్రమ తవ్వకాలపై టీడీపీ నేతలు లోకాయుక్తను ఆశ్రయించారు. ఆధారాలన్నీ లోకాయుక్తకు చేరడంతో అక్రమార్కుల మెడకు ఉచ్చు బిగుసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

వైసీపీ ప్రభుత్వంలో ఎన్నెన్నో కుంభ కోణాలు



- ప్రజా సంపదను కొల్లగొట్టిన అక్రమార్కులు
- భూములు, ధాన్యం, మట్టి, క్వార్ట్జ, పరిహారంలో చేతివాటం
- అక్రమాలు నిగ్గు తేలినా.. చర్యలేవీ!?
- అధికార పార్టీ నేతల ఒత్తిళ్లే కారణం



● క్వార్ట్జ రూపంలో భారీ దోపిడీ

క్వార్ట్జ ఖనిజానికి అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ పెరగడంతో జిల్లాలోని వైసీపీ పెద్దలంతా దానిపై పడ్డారు. అప్పటివరకూ వ్యాపారాలు చేసుకుంటున్న వారిని బెదిరించి ఆ వ్యాపారాలు చేజిక్కించుకున్నారు. ఎక్కడపడితే అక్కడ ప్రభుత్వ భూముల్లో ఇష్టానుసారంగా క్వార్ట్జను తవ్వి ఇతర దేశాలకు ఎగుమతి చేశారు. ఒక్క ఈ క్వార్ట్జ రూపంలోనే గడిచిన ఏడాది కాలంలో సుమారు రూ.1000 కోట్లకు పైగా కొల్లగొట్టి ఉంటారని అంచనా. ఎన్నికల కోడ్ ముందు వరకూ ఒక్క అధికారిని కూడా ఈ అక్రమ మైనింగ్ వైపు రానీయలేదు. ఎన్నికల కోడ్ వచ్చాక అధికారులు తనిఖీలు చేసి పెనాల్టీలు విధించారు. ఇప్పటి వరకూ విధించిన పెనాల్టీల ప్రకారమే దాదాపు రూ.400 కోట్ల క్వార్ట్జ ఖనిజాన్ని తరలించి సొమ్ము చేసుకున్నారని స్పష్టమవుతోంది.



వెంకటేశ్వరపురంలోని ప్రధాన పోలింగ్ స్టేషన్‌లో జరుగుతున్న ఏర్పాట్లు

పోలింగ్ ఏర్పాట్లు షురూ!

సార్వత్రిక ఎన్నికల్లో తుది ఘట్టం పోలింగ్ నిర్వహణకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఎంపిక చేసిన ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద చలువ పందిళ్లు, బారీకేడ్లు, మంచినీటి సౌకర్యం, విద్యుద్దీపాలు, కుర్చీలు తదితర ఏర్పాట్లు చేస్తున్నారు. 13న జరిగే పోలింగ్‌కు నెల్లూరు నగరంలో జరుగుతున్న ముమ్మర ఏర్పాట్లను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సిబ్బందికి సూచనలు చేస్తున్నారు.

\- నెల్లూరు (వెంకటేశ్వరపురం)

ఎన్టీఆర్ వచ్చాడ్రోయ్.. పదండ్రా!

'ఎన్టీఆర్ వచ్చాడ్రోయ్... చూద్దాం పదండ్రా' అంటూ జనం పరిగెత్తుకొచ్చారు. కలిగిరి మండలంలో గురువారం జరిగిన ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ ప్రచారంలో ఎన్టీఆర్ వేషధారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. కలిగిరి పంచాయతీలోని జిర్రావారిపాలెంకు చెందిన దారా పురుషోత్తం ఎన్టీఆర్ వీరాభిమాని. ఎన్నికల సమయంలో ఎన్టీఆర్ వేషధారణతో సినిమా పాటలకు హావభావాలు పలికిస్తూ సైకిల్ గుర్తుపై ఓటేసి టీడీపీని గెలిపించాలని కోరడం ఓటర్లను విపరీతంగా ఆకట్టుకుంది. ఈ క్రమంలోనే గురువారం కూడా ఆయన ఎన్టీఆర్ వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నాడు.

\- కలిగిరి



నెల్లూరులో వైసీపీ ప్రైవేటు దండు

- కడప, విశాఖ, ఢిల్లీల నుంచి భారీగా రాక
- లాడ్జీలు, హోటళ్లు, కల్యాణ మండపాల్లో బస
- హడలిపోతున్న నగర వాసులు
- పోలీసులూ... పారా హుషార్!

నెల్లూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరం లో వైసీపీ ప్రైవేటు దండు మోహరించింది. అధికార పార్టీ నాయకుల కోసం ఢిల్లీ, విశాఖ, కడప తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన వారు నగరంలో బస చేశా రు. హోటళ్లు, కల్యాణమండపాలు, చివరికి కాపురాలు ఉన్న అపార్టుమెంట్లలోనూ తిష్ఠవేసి పోలింగ్ రోజు కోసం ఎదు రుచూస్తున్నారు. ఎన్నడూ లేనివిధంగా బయటి ప్రాంతాలకు చెందిన వ్యక్తులు తమ పరిసరాల్లో ఉండ టం పట్ల నగరవాసులు హడలిపోతున్నారు. పోలీ సులు స్పందించి బయటి వ్యక్తులను జిల్లా సరిహద్దులు దాటిం చని పక్షంలో పోలింగ్ రోజున శాంతిభద్రతల సమస్య నెలకొనే ప్రమా దం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల సంద ర్భంగా అక్రమాలు, అరాచకాలు చేయడానికే బయటి ప్రాం తాల నుంచి వ్యక్తులను రప్పించుకున్నట్లు తెలిసింది. ఢిల్లీ, విశాఖ కేంద్రాలుగా చక్రం తిప్పిన వైసీపీ నాయకుడి కోసం వీరిని రప్పించుకున్నట్లు చెబుతున్నారు.

● పోలీసులూ పారాహుషార్

ఎన్నికల ప్రచారాలు, పంపకాలకు పెద్ద ఎత్తున బయ టి ప్రాంతాలకు చెందిన వ్యక్తులు జిల్లాలో తిష్ఠ వేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం 11వ తేదీ సాయంత్రం 6 గంటల తరువాత బయటి ప్రాంతాలకు చెందిన వారం దరినీ జిల్లా సరిహద్దులు దాటించాలి. ఈ క్రమంలో ఇప్పటినుంచే పోలీసులు నిఘా ఉంచని పక్షంలో 11వ తేదీ వీరిని జిల్లా సరిహద్దులు దాటించడం కష్టం అవు తుంది. పోలింగ్ రోజున అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం ఏర్పడుతుంది.

నేడు అక్షయ తృతీయ

- బంగారం కొనుగోలుకు ఎన్నికల కోడ్ గండం

నెల్లూరు (సాంస్కృతికం): అక్షయ తృతీయ శుభప్రదానికి సూచిక. ఈ రోజున లక్ష్మీదేవిని పూజిస్తారు. నేడు ఏదైనా శుభకార్యం చేస్తే శాశ్వతంగా మంచి జరుగుతుందని ప్రజల విశ్వాసం. సాధారణంగా అక్షయ తృతీయ అంటే బంగారు దుకాణాల్లో 15రోజుల ముందు నుంచే రద్దీ ఉంటుంది. ఈ రోజు కాసు బంగారం కొంటే ఏడాది పొడవునా బంగారు కొనుగోలు చేస్తారని స్వర్ణ వ్యాపారులు చెబుతుంటారు. ఇందుకు అనుగుణం అనేకమైన ఆఫర్లు కూడా ప్రకటిస్తారు. దీంతో పలువురు అప్పు చేసి మరీ అక్షయ తృతీయ రోజు బంగారం కొంటుంటారు. అయితే, దేశవ్యా ప్తంగా జరుపుకునే ఈ పండుగకు ఈ ఏడాది ఎన్నికల గండం వచ్చింది. దీంతో బంగారు దుకాణాల వద్ద ఒకప్పటి సందడి కనిపించడం లేదు. ఎన్నికల కోడ్ కారణంగా ఎక్కువ మొత్తంలో బంగారం కొనుగో లుకు డబ్బు తీసుకురావాలంటే జనం భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో కాసులు, గుండ్లు వంటి చిన్న చిన్న వస్తువుల కొనుగోళ్లకే పరిమితమవుతున్నాయి. ఈ పరిస్థితి వ్యాపారులకు నిరాశ కలిగిస్తోంది.

96 శాతం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ గురువారంతో ముగిసింది. ఐదు రోజుల పాటు జరిగిన ఈ ఓటింగ్‌లో ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా సరాసరి 96 శాతం వరకు పోలింగ్ నమోదైంది. ఆత్మకూరులో 95.18 శాతం, సర్వేపల్లిలో 97.62 శాతం, నెల్లూరు సిటీలో 98.28 శాతం పోలింగ్ జరిగింది. నెల్లూరు సిటీలో 2,698 మంది, ఆత్మకూరులో 2,611 మంది, సర్వేపల్లిలో 1,397 మంది, ఉదయగిరిలో 2,493 మంది, కావలిలో 3,235 మంది, నెల్లూరు రూరల్‌లో 4,741 మంది, కోవూరులో 2,838 మంది, కందుకూరులో 1,908 మంది, ఇతర జిల్లాల వారు 2150 మంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారు.

ఎన్నికల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు : కలెక్టర్

నెల్లూరు(క్రైం). మే 9: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరినారాయణన్ పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు 72 గంటల ముందు చేపట్టాల్సిన ఏర్పాట్లు, బందోబస్తు, విస్తరణ ప్రణాళిక అమలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఐజీలు. సీపీలు, ఎస్పీలతో గురువారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుంచి డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తాతో కలిసి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి జిల్లా కలెక్టర్, ఎస్పీలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ క్లుప్తంగా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో వసతులు కల్పించామని, జిల్లాలోని 75 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామని వివరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ముందస్తుగా అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. జిల్లాలోని ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో ఉన్న చేజర్ల మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ఠ బందోబస్తు చేపట్టామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా చర్యలు చేపడుతున్నామని, నాలుగు బీఎస్ఎఫ్, నాలుగు తమిళనాడు ఆర్మ్‌డ్ పోలీసు బృందాలు జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వైవల్ బృందాలు, పోలీసు చెక్‌పోస్టుల ద్వారా ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నామని వివరించారు. జిల్లాలో ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తి పారదర్శకంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీలు

టీడీపీ హయాంలోనే మత్స్యకారుల అభివృద్ధి

బీద రవిచంద్ర



ఇస్కపల్లిపాలెంలో మాట్లాడుతున్న బీద రవిచంద్ర, వేదికపై అభ్యర్థులు వీపీఆర్, కావ్య

అల్లూరు, మే 9 : గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే మత్స్యకారుల అభివృద్ధి జరిగిందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర తెలిపారు. మత్స్యకారుల కోసం తెలుగుదేశం ఎన్నో సంక్షేమ పథకాలు, నిధులు తెచ్చి ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పాటును అందించిందని ఆయన అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి ఇస్కపల్లిలో నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డితో కలసి ఆయన రోడ్‌షో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇస్కపల్లి ప్రజానీకం బ్రహ్మరథం పట్టింది. రవిచంద్ర స్వగ్రామం ఇస్కపల్లిలో అనూహ్య స్పందన లభించింది. అనంతరం ఇస్కపల్లిపాలెం సభలో బీద మాట్లాడుతూ తీరప్రాంతం ఇంకా బాగా అభివృద్ధి చెందాలంటే ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా కావ్య కృష్ణారెడ్డిలను గెలిపించాలని కోరారు. మత్స్యకారుల ఉత్సాహాన్ని చూసి వీపీఆర్, కావ్య స్పందిస్తూ ఇస్కపల్లిలో నిర్వహించిన రోడ్‌షో తమలో మరింత జోష్ నింపిందన్నారు. కాగా ఐదేళ్లుగా తమను పట్టించుకున్న నాథుడు కరువయ్యాడని కొందరు మత్స్యకారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అళహరి సుధాకర్, బీద గిరిధర్, పోలిశెట్టి, పాపనబోయిన రత్తయ్య, గ్రామ కాపులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు ఉదయగిరి

ఓటు వేసిన 51 మంది ఉద్యోగులు

ఉదయగిరి రూరల్: తహసీల్దారు కార్యాలయంలోని పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రంలో గురువారం 51 మంది ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకున్నట్లు ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్‌ప్రేమ్‌కుమార్ తెలిపారు.

వాహనాల తనిఖీ

ఉదయగిరి రూరల్: కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన స్టాటిక్ సర్వే లైన్స్ చెక్‌పోస్టు వద్ద గురువారం రాత్రి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ సహాయ అధికారి నెహ్రూబాబు వాహనాలను తనిఖీ చేశారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు, మద్యం, ఇతరత్రా సామాగ్రి తరలిస్తుంటారని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు

ఈ దారి.. కంకర దారి !



దేవలాలగడ్డ సిమెంట్ రోడ్డు దుస్థితి ఇలా..

ఉదయగిరి రూరల్, మే 9: ఈ చిత్రంలో కనిపిస్తున్న సిమెంట్ రోడ్లు నియోజకవర్గకేంద్రం వీధుల్లోని రోడ్లు కంకరరాళ్లు తేలి, అడుగుకోగుంత ఏర్పడ్డాయి. వాటికి మరమ్మత్తులు చేపట్టకపోవడంతో స్థానికుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. పట్టణంలోని నాగులబావివీధి, కోళ్లవీధి, అగ్రహారం, దేవలాలగడ్డ, సినిమాహాలు వీధి, హరిజనపాళెం, యాదవపాళెం, తుపాన్‌నగర్ యూనియన్‌రోడ్డు ప్రాంతాల్లో గతంలో సిమెంట్ రోడ్లు వేశారు. పనులు చేస్తున్న సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించలేదు. వేసిన కొన్ని నెలలకు కంకరరాళ్లు తేలి గుంతలమయంగా మారాయి. వైసీపీ ప్రభుత్వ పాలనలో ఈ రోడ్లను బాగు చేయాలని అధికారులు ప్రతిపాదనలు పంపినా పాలకులు నిధులు మంజూరుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.



నాగులబావివీధిలో కంకర తేలిన సిమెంట్ రోడ్డు

'పది' పాసయ్యేలా చూడాలి

వింజమూరు, మే 9: పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు పాస్ అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు హెచ్‌ఎంలకు సూచించారు. గురువారం ఉదయగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలలో నియోజకవర్గంలోని ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి రఘురామయ్య, ఎంఈవో మధుసూదన్‌రెడ్డి, హెచ్‌ఎం మాలకొండయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల దాడి

వింజమూరు, మే 9: పట్టణంలోని ఆర్టీసీ రోడ్‌లోని మద్యం షాపుపై ఒంగోలు విజిలెన్స్ సీఐ వెంకట్‌రెడ్డి కలిగిరి సెబ్ అధికారి వై.వెంకటేశ్వర్లు తనిఖీలు నిర్వహించి 96 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. లెక్కల వెంకటేశ్వర్లు, వై.శ్రీనివాసులు, మనోహర్, ఎం. శేఖర్‌రెడ్డి, అలాగే ఒక షాపులో 15 బాటిళ్ల శ్రీనివాసులును, ఇంకొక షాపులో 20 బాటిళ్లను ఎస్.బాలకృష్ణ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

4 శాతం రిజర్వేషన్ రద్దు చేస్తే
తల తీసుకుంటా !
● డ్యాన్స్ మాస్టర్ జానీ



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన రాష్ట్ర నాయకులు, డ్యాన్స్ మాస్టర్ జానీ

ఉదయగిరి రూరల్, మే 9: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ముస్లిం మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లు తీసేస్తారని వైసీపీ నేతలు అసత్యప్రచారాలు చేస్తున్నారని, అది జరిగితే తాను తల తీసేసుకుంటానని, 4శాతం రిజర్వేషన్లను 10శాతానికి పెంచేలా పోరాడతామని జనసేన రాష్ట్ర నాయకుడు, డ్యాన్స్ మాస్టర్ షేక్ జానీ పేర్కొన్నారు. గురువారం రాత్రి ఉదయగిరి బస్టాండ్ సెంటర్‌లో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో 30వేల మంది మహిళలు అదృశ్యమయ్యారన్నారు. యువతను మత్తు పదార్థాలకు బానిసలను చేసిన ఘనత వైసీపీకే దక్కుకతుందన్నారు. పిఠాపురంలో జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టడం తథ్యమన్నారు. రాబోయేది కూటమి ప్రభుత్వమేనన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమే బీజేపీతో పొత్తు పెట్టుకోవడం జరిగిందన్నారు. ఈ ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, మన్నేటి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అధోగతి

● టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి



అనంతసాగరం ప్రచారంలో ఆనం కైవల్యారెడ్డి



సంగం: ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ఆత్మకూరు మే 9: వైసీపీ ఐదేళ్ల పాలనలోనే రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని, ప్రజలపై పన్నులు, అధిక ధరలతో బరువు మోపి బతుకు భారంగా మార్చారని ఆత్మకూరు ఉమ్మడి అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి వాపోయారు. గురువారం ఆయన కరటంపాడు, బోయళ్లచిరువెళ్ల, మహిమలూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందన్నారు. ఈ టీడీపీ మేనిఫెస్టోలో పొందు పరిచిన సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆత్మ కూరు అసెంబ్లీ అభ్యర్థిగా తనను, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాక ర్‌రెడ్డి సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్ర మంలో వేమన రామచంద్రరావు, గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు పాల్గొన్నారు.

అనంతసాగరం: అభివృద్ధితో పాటు సంక్షేమపాలన జరగాలంటే అది టీడీపీతోనే సాధ్యమని ఆనం కుమార్తె కైవల్యారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అనంతసాగరంలో ఓటర్లను కలిసి సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ అధికారంలోకి వచ్చేలా చూడాలని కోరారు. అనంతరం మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి అందనున్న పథకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షురాలు మునగపాటి సునీత, సాగరం ఎంపీటీసీ రాపూరు సుజాతమ్మ పాల్గొన్నారు. అనంతరం మంచాలపల్లిలో గురువారం టీడీపీ సీనియర్ నాయకులు పాతపాటి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులు వేమిరెడ్డి, ఆనంలను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

మర్రిపాడు: కంపసముద్రంలో ఆనం కుమార్తె కైవల్యారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కార్యదర్శి మేకపాటి శాంతికుమారితో కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బ్రహ్మారెడ్డి, జనార్దన్‌నాయుడు, నారాయణ, స్వాతిరెడ్డి ఉన్నారు.

ఏఎస్ పేట: ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలను గెలిపించాలని బీజేపీ నాయకులు గుడిపాడు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేసి పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు చెంచురెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్లు నాయుడు, సంక్రాంత్రి మోహన్, సురేష్ యాదవ్ పాల్గొన్నారు.

సంగం: మండలంలోని పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, గునుపూడిగిరి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. సంగం వైసీపీ నాయకులు కోవూరు షుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ కంచర్ల శ్రీహరి నాయుడు, తరుణవాయి మాజీ ఎంపీటీసీ రమాదేవి భర్త, వైసీపీ నాయకుడు మర్రి రవి చేజర్లలోని పెరుమాళ్లపాడుకు వెళ్లి ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో ఫామ్‌హౌస్‌లో టీడీపీలో చేరారు. ఆనం వారికి పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు. తరుణవాయి అంకమ్మ కాలనీవాసులు 60కుటుంబాలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గువ్వల రమణమ్మ భర్త గువ్వల రమణయ్య, గిరి ఉన్నారు. అలాగే టీడీపీ అభ్యర్థి సోదరుడి కుమారుడు ఆనం రంగ మయూర్‌రెడ్డి దువ్వూరులో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కురుగొండ్ల గెలుపు కోసం ఇంటింటా ప్రచారం



తోపుగుంటలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

కలువాయి, మే 9: టీడీపీ మండల నాయకులు గురువారం తోపుగుంటలో ఇంటింటా ప్రచారం నిర్వహిచారు. టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ అధికారంలోని వస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అధికారంలోని రాగానే సమస్యలను కురుగొండ్ల దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చల్లా రఘురామిరెడ్డి, చల్లా బుజ్జిరెడ్డి, జగదల్ నాయుడు, మాదవ నాయుడు, హరినాయుడు, మోహనరావు పాల్గొన్నారు.

నేడు కలువాయిలో కురుగొండ్ల రోడ్‌షో

శుక్రవారం సాయంత్రం కలువాయిలో సాయంత్రం 5గంటలకు వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ రోడ్‌షో నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షులు గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు తెలిపారు. మండలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఏడు గంటలకే మద్యం దుకాణాల మూత

● ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి

ఉదయగిరి రూరల్, మే 9: ఈ నెల 11వ తేదీ రాత్రి 7నుంచి 13వ తేదీ రాత్రి 7గంటల వరకు మద్యం దుకాణాలకు సీజ్ వేస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ కె.నాగమల్లేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక సెబ్ కార్యాలయంలో మద్యం దుకాణాల సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పరిమితికి మించి మద్యం అమ్మకాలు జరిపినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రేఖారెడ్డి, సెబ్ సీఐ వెంకటరమణమ్మ పాల్గొన్నారు.



మద్యం దుకాణాల సిబ్బందికి సూచనలిస్తున్న నాగమల్లేశ్వరరెడ్డి

ఈ ఎన్నికల్లో టీడీపీదే విజయం

● టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ ● కలిగిరి మండలంలో ప్రచారం

కలిగిరి, మే 9: తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలతో రాష్ట్రంలో అధికార పీఠం కైవసం చేసుకోవడం ఖాయమని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ అన్నారు. గురువారం ఏపీస్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డితో కలిసి తూర్పుదూబగుంట, చినఅన్నలూరు, తెల్లపాడు, వీర్నకొల్లు, నాగసముద్రంలో ప్రచారం నిర్వహించారు. కాకర్లకు టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాకర్ల మాటాడారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించి వలసలు నివారించడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సూపర్‌సిక్స్ పథకాలతో అత్యధికంగా లబ్ధిపొందే మహిళలు ఈ మారు చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకుంటామని చెప్పడం సంతోషకరం అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డిప్రభాకరరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బిజ్జం కృష్ణారెడ్డి, బీవీ రామారావు, తాతయ్య, నరసింహులునాయుడు, సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, నాగిరెడ్డి, వేణు, బుజ్జయ్య, రాంబాబు పాల్గొన్నారు. అలాగే కావలిముస్తాపురంలో కాకర్ల సురేష్ మరదలు సురేఖ ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్ గెలిచిన వెంటనే గ్రామానికి మినరల్ వాటర్‌ప్లాంట్ మంజూరు చేయిస్తామన్నారు.

వింజమూరు: స్థానిక టీడీపీ కార్యాలయంలో వాల్మీకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ పాల్గొని మాట్లా డారు. నియోజకవర్గంలో 500కుటుంబాలు ఉన్నాయని, వారందరూ కలిసి ఉదయగిరి చరిత్రను తిరగరాయగలరని ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ పేర్కొన్నారు. వాల్మీకులందరూ ఐక్యంగా టీడీపీకి మద్దతిచ్చి సైకిల్ గుర్తుకు ఓటు వేయించాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తే వాల్మీకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వరికుంటపాడు మండలం భోగ్యంవారిపల్లికి చెందిన 70 కుటుంబాలు కాకర్ల సురేష్ సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరికీ టీడీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ అరాచకాలను భరించలేక టీడీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. అనంతరం కాకర్ల సురేష్ మాట్లాడారు. 50గడపలు దాటిన ప్రతి గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. మే 13న జరిగే పోలింగ్‌లో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అంతకుముందు కాకర్ల సురేష్‌ను శాలువా పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో వాల్మీకి అల్‌ఇండియా జనరల్ సెక్రటరీ హెచ్‌కె.శివకుమార్, జిల్లా వాల్మీకి ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, ఉదయగిరి వాల్మీకి ప్రెసిడెంట్ చల్లా ప్రసాద్, వెంకటరమణయ్య, శేఖర్, విజయ్‌కుమార్, కొండే రమణయ్య, మట్ల చంద్రశేషయ్య, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



వింజమూరు: వాల్మీకుల ఆత్మీయ సమావేశంలో కాకర్ల సురేష్



కావలిముస్తాపురంలో వృద్ధ దంపతులను ఓటేయమని కోరుతున్న కాకర్ల సురేఖ



కాకర్లకు స్వాగతం పలుకుతున్న కృష్ణారెడ్డిపాలెం మహిళలు

గిరిజనుల ఓట్లు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఓట్లు తొలగింపుపై నిరసన తెలుపుతున్న దళితనేతలు, గిరిజనులు

కావలి, మే 9: కావలి పట్టణం బుడంగుంట గిరిజన కాలనీలో గిరిజనుల ఓట్లు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. ఈ మేరకు దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. అనంతరం కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లి మాట్లాడుతూ కావలి పట్టణంలోని 17వ వార్డులో 35 మంది గిరిజనుల ఓట్లు, బాలక్రిష్ణారెడ్డి నగర్‌లో 70 ఓట్లు తొలగించారన్నారు. ప్రజాస్వామిక దేశంలో 18 ఏళ్లు నిండిన వారందరికీ రాజ్యాంగం ఓటు హక్కు కల్పిస్తుంటే అట్టడుగు వర్గాలకు చెందిన ఓటర్లను బీఎల్వోలు, సచివాలయ సిబ్బంది, వారి పర్యవేక్షకులు కలిసి తొలగించడం అన్యాయమన్నారు. వెంటనే తొలగించిన ఓటర్లను పునరుద్ధరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన నేతలు చౌటూరి వెంకటరత్నం, లక్ష్మయ్య, జడ్డా వాసు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని రెండు చుక్కల దుప్పిలు మృతి



రైలు ఢీకొని మృతి చెందిన చుక్కల దుప్పిలు

బిట్రగుంట, మే 9: బిట్రగుంట రైల్వే స్టేషన్ ఉత్తరం వైపు ఎగువ మార్గంలో గుర్తు తెలియని రైలు ఢీకొని రెండు చుక్కల దుప్పిలు మృతి చెందినట్లు కావలి అటవీ శాఖ సెక్షన్ అధికారి ఆర్.సుమన్ తెలిపారు. గురువారం తెల్లవారు జామున అటవీ ప్రాంతం నుంచి కడనూతల, కోవూరుపల్లి చెరువులకు తాగునీటి కోసం వెళ్లేందుకు రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెంది ఉండవచ్చని పేర్కొన్నారు. బిట్రగుంట రైల్వే పోలీసులు షేక్.బాషా, కే.నాగమలేష్‌ల సమాచారంతో ఘటనా స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. పశు వైద్యాధికారి సీ.రాజు శవ పంచనామ అనంతరం వాటిని దహనం చేసినట్లు తెలిపారు.

సోమశిలలో 7.967 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మే 9: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు గురువారానికి జలాశయంలో 7.967 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

వృద్ధురాలి హత్య కేసు నిందితుల అరెస్ట్

సంగం, మే 9: జండాదిబ్బ సుబ్బమ్మ హత్య కేసులోని ఇద్దరు నిందితులను సంగం పోలీసులు గుర్తించారు. గురువారం వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఆ వివరాల మేరకు.. రెండురోజుల కిందట గ్రామ శివారులోని ఉంటున్న సుబ్బమ్మను ఆమె దగ్గర ఉన్న బంగారు నగలు కోసం గ్రామానికి చెందిన గడ్డం అనీల్, ఆరీఫ్ అనే ఇద్దరు యువకులు చంపి అనుమానంతో తిరుగుతున్నారు. వీరిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం తెలిసింది. వృద్ధురాలి బంగారు సరుడు, కమ్మలు, ఉంగారాన్ని పోలీసులు అప్పగించారు. అనంతరం వారిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. కోవూరు కోర్టు మెజీస్టేట్ వారికి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బంగారంతో పోటీ పడుతున్న పొగాకు

● కిలో రూ.300



వేలానికి వచ్చిన పొగాకు బేళ్లు

కలిగిరి, మే 9: నిత్యం పెరుగుతున్న బంగారం ధరలతో పొగాకు ధరలు పోటీ పడుతున్నాయి. ఈ ఏడాది పొగాకు కిలో రూ.300 పలికి బంగారంగా మారిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది రూ.280 వరకు పలికిన పొగాకు ధర ఈ ఏడాది రూ.230 నుంచి రోజురోజుకు పెరుగుతూ గురువారం కిలో పొగాకు ధర రూ.300 పలికింది. కాగా కలిగిరి పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు మొత్తం 610 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 555 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-37, సీఆర్-8, జంపింగ్ లాట్స్-10 కారణాలతో 55 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.300, కనిష్ఠ ధర రూ.210, సగటు ధర రూ.270.98గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

లారీ బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలు



బోల్తా పడిన లారీ

మనుబోలు, మే 9: లారీ బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలైన సంఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై బద్దెవోలు క్రాస్ రోడ్డు వద్ద గురువారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను తీసుకుని చెన్నై వెళుతున్న లారీ రోడ్డుపై పెట్టిన బారికేడ్లను తప్పించే క్రమంలో అదుపుతప్పి చెక్‌పోస్టు శిబిరంపైకి దూసుకువచ్చి రక్షణగోడకు ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ కార్తీక్‌కు గాయాలయ్యాయి. రోడ్‌సేఫ్టీ వాహనానికి లారీ తగలడంతో వెనుక భాగం ధ్వంసమైంది. అయితే పోలీసులు రోడ్డు పక్కన ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

పాముకాటుతో బీటెక్ విద్యార్థి దుర్మరణం

కలువాయి, మే 9: బాలాజీరావుపేటకు చెందిన బీటెక్ విద్యార్థి పొత్తూరు రోహిత్ (20) గురువారం పాముకాటుతో మరణించాడు. ఉదయం 5గంటలకు ఊరు బయటకు బహిర్భూమికి వెళ్లాడు. అక్కడ అతని చేతిపై పాముకాటు వేసింది. ఈ విషయాన్ని గుర్తించిన రోహిత్ ఇంటికి వచ్చి కుటుంబసభ్యులకు తెలిపాడు. వెంటనే చికిత్స కోసం అతన్ని నెల్లూరుకు తరలిస్తుండగా మార్గమధ్యమంలో మృతి చెందాడు. గూడూరులోని ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజిలో రోహిత్ బీటెక్ రెండో ఏడాది చదువుతున్నాడు. ప్రతి రోజూ గ్రామం నుంచే కాలేజీ బస్సులో గూడురుకు వెళ్లి వస్తుండేవాడు. కుమారుడి మరణంతో తల్లిదండ్రులు పొత్తూరు నాగభూషణం, నిర్మలమ్మలు కన్నీరు మున్నీరుగా విలపిస్తుండటంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

12న జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

నెల్లూరు (విద్య), మే 9 : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12వతేదీ ఆదివారం బుజబుజ నెల్లూరులోని సీఏపీ క్రికెట్ అకాడమీ మైదానంలో జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి డీ నిఖిలేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు అండర్-19 బాలుర జట్టు, మధ్యాహ్నం 3 గంటలకు అండర్-15, 19 బాలికల జట్ల ఎంపిక జరుగుతుందని తెలిపారు. క్రీడాకారులు వైట్ అండ్ వైట్ డ్రస్ కోడ్‌తో, తమ సొంత క్రికెట్ కిట్‌తో, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు ఏసీ స్టేడియంలోని ఎన్‌డీసీఏ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	157
లేయర్ లైవ్	100
స్కిన్ చికెన్	274
స్కిన్‌లెస్	304
లేయర్	170

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6803
వెండి కిలో ధర	రూ. 84,700
వెండి ఒక గ్రాము	రూ. 86.70

కావలి కందుకూరు

ఇంటూరి సౌజన్య విస్తృత ప్రచారం

కందుకూరు, మే 9: మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే చంద్రబాబు పాలన తిరిగి రావాలని కందుకూరు నియోజక వర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య పేర్కొన్నారు. నాగేశ్వరరావు విజయం కోసం ఆమె గురువారం మండలంలోని కంచరగుంట, అనంతసాగరం, కోవూరు గ్రామాలలో విస్తృత ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఓటేస్తేనే సైకో ప్రభుత్వం పోయి మంచి ప్రభుత్వం వస్తుందని, రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

చలివేంద్రం ప్రారంభం

కావలి, మే 9: కావలి పట్టణం ఉదయగిరి రోడ్డులో రహీం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ మానవహక్కుల అవగాహన సంఘం దక్షిణాంధ్ర రీజనల్ చైర్మన్ మహ్మద్ అబ్దుల్ అలీం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రహీం చారిటబుల్ ట్రస్ట్ సభ్యురాలు షబీనా బేగం, స్వచ్ఛందసంస్థల అధ్యక్షుడు ఖాదర్‌బాషా, వివిధస్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఎంవీఎస్ ప్రసాద్‌రావు, సోము శీనయ్య, సోమిశెట్టి బ్రహ్మయ్య, షేక్ ఖాదర్‌బీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కసారి ఆశీర్వదించండి

● మాచవరంలో ఇంటూరి ఇంటింటి ప్రచారం ● టీడీపీ గూటికి ఏఎంసీ మాజీ చైర్మన్ తల్లపనేని



కందుకూరు : ఆనందపురంలో ఇంటూరి, దివి శివరాంల ప్రచారం

కందుకూరు, మే 9: ఈ ఎన్నికల్లో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, ఎంపీగా వేమరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఒక్కసారి ఆశీర్వదించాలని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. గురువారం మండలంలోని మాచవరంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా మానుగుంట ఆదినారాయణరెడ్డి ఎస్టీ కాలనీ, అయ్యలరెడ్డి కొండ, కొండకింద ఎస్టీ కాలనీ, ఎస్సీ కాలనీలలో ప్రచారం పూర్తి చేసిన నాగేశ్వరరావు అనంతరం గ్రామంలో వీధివీధిన స్థానికులతో కలిసి నడుస్తూ ప్రచారం చేశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల దృష్ట్యా మాచవరం ఓటర్లు ఈ విడత తెలుగుదేశం పార్టీకి మద్దతు పలకాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యేగా గెలుపుకు సహకరిస్తే సొంత ఊరిలాగా భావించి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు సాదినేని మాల్యాద్రి, సూరం చిరంజీవిరెడ్డి, యడ్ల అశోక్‌రెడ్డి, యడ్ల బ్రహ్మరెడ్డి, బత్తిన జయచంద్రారెడ్డి, కాకుటూరి శ్రీనివాసులురెడ్డి, సూరం శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గూటికి ఏఎంసీ మాజీ చైర్మన్ తల్లపనేని

కందుకూరు మాజీ ఏఎంసీ చైర్మన్ తల్లపనేని వెంకటేశ్వర్లు తిరిగి టీడీపీ గూటికి చేరారు. పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీ కార్యకర్తగా ఎదిగిన వెంకటేశ్వర్లు గత ఎన్నికలకు ముందు వైసీపీకి మద్దతు పలికారు. అయితే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం సమక్షంలో తెలుగుదేశం పార్టీకి మద్దతు ప్రకటించారు. తల్లపనేనికి మద్దతుగా గ్రామానికి చెందిన దామచర్ల బ్రహ్మయ్య, తల్లపనేని అయ్యపనాయుడు, నారాయణరావు, మనోజ్‌కుమార్, మందలపు మల్లికార్జున, ఇంటూరి బాలకృష్ణ, వెంకటరావులతో పాటు ఎస్సీ, ఎస్టీ కాలనీలకు చెందిన 100 కుటుంబాల వారు పార్టీలో చేరారు. అనంతరం ఆనందపురం, అనంతరం వార్డు పరిధిలోని శామీరపాలెం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎస్సీ కాలనీకి చెందిన కసుకుర్తి శ్రీహరి, మణికే శ్రీనివాసులు తదితరులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, తల్లపనేని రవీంద్ర, సుబ్బారావు, గోపి, నరసింహారావు, రాము, కొచ్చర్ల మాధవరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గనిగుంట గ్రామంలో టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి తెలుగుదేశం పార్టీ సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ రాబోయే ఎన్నికల్లో గ్రామస్తులంతా ఐక్యంగా టీడీపీ విజయానికి పాటుపడటం ద్వారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావటమే లక్ష్యంగా పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుళ్లా వెంకట కృష్ణారావు, దామచర్ల శ్రీనివాసులు, కొండమూరి సురేష్, బత్తిన కోటేశ్వరరావు, వడ్డిపల్లి నరసింహారావు, కొండమూరి చెంచయ్య, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

మా నాన్న లోకల్.. గెలిపించండి

మా నాన్న లోకల్.. రెండేళ్ల నుంచి ఆయన కందుకూరులో అందిస్తున్న సేవా కార్యక్రమాలను మీరంతా చూస్తున్నారు.. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటువేసి మానాన్నను గెలిపిస్తే మీకు నిరంతరం అందుబాటులో ఉండి సేవ చేస్తాడంటూ ఇంటూరి నాగేశ్వరరావు కుమారుడు సందీప్ కందుకూరులో ప్రచారం నిర్వహిస్తున్నారు. పట్టణంలోని పెద్దబజారులో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూరగాయల మార్కెట్ సెంటర్‌లో ఉన్న అన్నా క్యాంటీన్ వద్ద సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. సాయంత్రం గుడ్లూరు మండలంలోని మోచర్ల, తెట్టు, ఏలూరుపాడులోనూ ప్రచారం నిర్వహించారు.



కందుకూరు అన్నా క్యాంటీన్ వద్ద సందీప్ సెల్ఫీ ఛాలెంజ్



లింగసముద్రం : బడేవారిపాలెంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు



కందుకూరు : టీడీపీలో చేరిన తల్లపనేని వెంకటేశ్వర్లు, తదితరులు

రాళ్లపాడు వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరిక

లింగసముద్రం : మండలంలోని పెంట్రాల పంచాయతీ రాళ్లపాడుకు చెందిన పలువురు వైసీపీని వీడి గురువారం ఉదయం వలేటివారిపాలెం మండలంలోని బడేవారిపాలెం గ్రామంలో కందుకూరు కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు స్వగృహంలో టీడీపీలో చేరారు. మండల తెలుగు రైతు అధ్యక్షుడు మద్దెల రామారావు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన చాగం చినహాజరత్‌రెడ్డి, పొడపాటి వెంకటేశ్వర్లు, ప్రతాప్, గొల్లపల్లి కిషణ్, మక్కెన మస్తాన్, మద్దెల వెంకట రమణయ్య, మద్దెల రామకృష్ణయ్య, నూకతోటి మాలకొండయ్య, షేక్ నాగూర్‌బాషా, షేక్ బామల్ల, బాసం నరసింహం కుటుంబాలు టీడీపీలో చేరగా నాగేశ్వరరావు వారికి పసుపు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థినైన తనకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉన్నం వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

'కావలి' ఓటర్లు.. ఎన్నికల సైన్యం

కావలి, మే 9 : కావలి అసెంబ్లీ నియోజకవర్గంలో 2,38,553 ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 1,17,063, మహిళలు 1,21,462 ఉన్నారు. వీరికి 314 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 91 పోలింగ్ కేంద్రాలను క్రిటికల్ కేంద్రాలుగా గుర్తించి ప్రతి క్రిటికల్ పోలింగ్ కేంద్రానికి ఒక మైక్రో అబ్జర్వర్‌ను నియమించారు. 314 పోలింగ్ కేంద్రాలకు 314 మంది ప్రొసైడింగ్ ఆఫీసర్స్‌ను, 1,570 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. నియోజవర్గాన్ని 39 రూట్లుగా విభజించి 39 సెక్టోరల్ ఆఫీసర్లును నియమించారు.

ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	థర్డ్‌జండర్స్	మొత్తం
కావలిపట్టణం	40,415	42,809	15	83,239
కావలి రూరల్	21,578	21,444	6	43,028
బోగోలు	19,256	19,978	3	39,237
దగదర్తి	14,976	15,434	1	30,411
అల్లూరుపట్టణం	10,691	11,462	1	22,154
అల్లూరు రూరల్	10,147	10335	2	20,484
మొత్తం	1,17,063	1,21,462	28	2,38,553

క్రిష్టియన్‌పేట రోడ్డులో రాకపోకలకు నరకమే!

● నడి రోడ్డుపై వాహనాల నిలుపుదల

● మామూళ్ల మత్తులో పట్టించుకోని పోలీసులు

కావలి రూరల్, మే 9: కావలి పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ నుంచి క్రిష్టియన్‌పేటకు వెళ్లే రోడ్డులో రాకపోకలకు నిత్యం నరకమేనని వాహన చోదకులు, ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా బ్రిడ్జిని ఆనుకుని ఉన్న ఆ మార్గంలో వైద్యశాలలు ఉండడంతో నిత్యం ఆ మార్గం వాహనాలతో, వైద్యశాలలకు వెళ్లే రోగులతో రద్దీగా ఉంటుంది. కానీ అక్కడ ఉన్న చికెన్ దుకాణాలకు వచ్చే వారు రోడ్డు పైనే వాహనాలు నిలపడంతో పాటు కోళ్ల వాహనాలు, వ్యర్థాలను తరలించే వాహనాలు రోడ్డుపైనే ఉంచడంతో వాహనదారులు తరచూ ఇబ్బందులు పడాల్సివస్తుందన్నారు. ఈ విషయం నిత్యం పోలీసుల కంటికి కనిపిస్తున్నా మామూళ్ల మత్తులో పట్టించుకోవడం లేదని స్థానికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు.



రోడ్డుకు అడ్డుగా నిలిపిన వాహనాలు

టీడీపీకి మద్దతుగా ప్రొఫెషనల్ వింగ్ సభ్యుల ప్రచారం



పోలినేనిపాలెంలో ప్రచారం చేస్తున్న ప్రొఫెషనల్ వింగ్ సభ్యులు

వలేటివారిపాలెం, మే 9: మండలంలోని మాలకొండ, అయ్యవారిపల్లె, పోలినేనిపాలెం అత్తింటివారిపాలెం గ్రామాలలో ప్రొఫెషనల్ వింగ్ సభ్యులు టీడీపీ అభ్యర్థులు ఇంటూరి నాగేశ్వరరావు, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల తరపున గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో చిన్నారులు మేము సైతం అంటూ అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెషనల్ వింగ్ సభ్యులు పువ్వాడి మౌనిక, ఘట్టమనేని అఖిల, మందలపు బ్రహ్మనాయుడు, చల్లా మల్లేష్, చెన్నారెడ్డి, మహేంద్ర, మహేష్, కంచర్ల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

నాగులవెల్లటూరులో ఉద్రిక్తత

చేజర్ల, మే 9 : మండలంలోని నాగులవెల్లటూరులో గురువారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. గ్రామంలోని వైసీపీకి చెందిన ఓ వర్గం మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు సమక్షంలో టీడీపీలో చేరేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి కొమ్మి లక్ష్మయ్యనాయుడుతో కలిసి గురువారం టీడీపీలో చేరుతున్న వారి వద్దకు వెళ్లారు. అయితే, మరో వర్గం వారు తొలుత తమ వద్దకు రాలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఘర్షణకు దిగారు. దీంతో ఇరువర్గాలు బాహాబాహీకి దిగడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ప్రభాకర్ అక్కడకు చేరుకోగా గ్రామం లోపలకు రానీయకుండా మహిళలు అడ్డుకున్నారు. అనంతరం డీఎస్పీ కోటారెడ్డి, సీఐ రవినాయక్ గ్రామానికి చేరుకుని పరిస్థితి అదుపులోకి తెచ్చారు. గ్రామంలో ప్రత్యేక బలగాలతో గస్తీ ఏర్పాటు చేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి : వంటేరు



జలదంకి, మే 9: విధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిలోపెట్టి అభివృద్ధిని పరుగులు తీయించాలంటే ఒక్క చంద్రబాబునాయుడు వల్లే సాధ్యమవుతుందని కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అన్నవరం, బీకే అగ్రహారం గ్రామాల్లో గురువారం ఆయన ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి, ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌లకు సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు, వాటివల్ల కలిగే లబ్ధిని వివరించారు. ఈ ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ సతీమణి ప్రవీణ, టీడీపీ నాయకులు పూనూరు భాస్కరరెడ్డి, కే.మాధవరెడ్డి, వల్లెపు ఏడుకొండలు, స్వర్ణా కొండపనాయుడు, బీజేపీ నాయకులు వడ్డె శ్రీనాథ్ రెడ్డి, కంచర్ల శరత్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం అయితేనే యువతకు భవిత

● అల్లూరులో బీద, వేమిరెడ్డి, కావ్యల రోడ్‌షో ● జనసంద్రమైన పట్టణ వీధులు

అల్లూరు, మే 9 : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని టీడీపీ నేతలు స్పష్టం చేశారు. గురువారం అల్లూరు పట్టణంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిలు రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో ఎన్నడూ చూడని విధంగా అల్లూరు పట్టణ వీధులు జనసంద్రమయ్యాయి. ఎటు చూసినా పసుపు జెండాలు, యువత కేరింతలతో రోడ్‌షో దద్దరిల్లింది. దాదాపు 3 వేల మంది పాల్గొనగా అభిమానులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా ప్రధాన రహదారిలోని మౌలాలి దర్గాలో ప్రత్యేక ఫాతెహా నిర్వహించిన అనంతరం కావలి రోడ్డులో పేటస్థలంలోకి ప్రవేశించిన రోడ్‌షో అక్కడి నుంచి పోలేరమ్మ ఆలయానికి చేరుకొకు అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాను మండలంలోని ఇందుపూరుకు చెందిన వ్యక్తినైనప్పటికీ అల్లూరులోనే ఎక్కువ కాలం గడిపానన్నారు. గడిచిన ఐదేళ్లు కావలి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మన్నెమాల సుకుమార్‌రెడ్డిలు దోచుకోవడమే లక్ష్యంగా కంకణం కట్టుకున్నారన్నారు. వైసీపీ పాలనలో రాజుపాలెం-ఇస్కపల్లి రోడ్డు పూర్తిగా ధ్వంసమైందన్నారు.



అల్లూరులో జనసందోహం నడుమ రోడ్‌షో నిర్వహిస్తున్న బీద రవిచంద్ర, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావ్య కృష్ణారెడ్డి



అల్లూరులో గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

అల్లూరు చెరువులో చేపలన్నీ తినేశారు : బీద

గిరిజనులకు చెందాల్సిన అల్లూరు చెరువులోని మత్స్య సంపదను గిరిజనుల నోర్లు కొట్టి వైసీపీ నాయకులు తినేశారని బీద రవిచంద్ర ఆరోపించారు. చెరువులోని మత్స్య సంపదపై వైసీపీ డేగ కన్నేసి వారి నోర్లు కొట్టి జేబులు నింపుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వస్తే అల్లూరు చెరువుపై రూ.కోటి నిధులు వెచ్చించి మత్స్య సంపదను ఉత్పత్తి చేసి గిరిజనులకు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క కాలువ, చెరువు కానీ తవ్వింది లేదన్నారు. రైతుల కోసం ఒక్క పని చేయలేదన్నారు. కావలి అభివృద్ధి నిరోధకుడైన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ఓడించాలని కోరారు.

మన భూముల పత్రాలపై ఆయన ఫొటో ఏంటి : కావ్య

భూముల రీ సర్వే పేరుతో రాళ్లపై, పాస్‌పుస్తకాలపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అతని ఫొటో వేసుకున్నాడని విమర్శించారు. మన భూ హక్కు ప్రతాలపై ఆయన ఫొటోలు ఎందుకని ప్రశ్నించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను, నూతన రిజిస్ట్రేషన్ చట్టాన్ని తీసుకొచ్చి రైతులను ముంచేందుకు చూస్తున్నాడన్నారు. అల్లూరు నగర పంచాయతీని రద్దు చేయించి మళ్లీ అల్లూరు, నార్తుమోపూరు, సింగపేట గ్రామ పంచాయతీలుగా మార్పు చేస్తానన్నారు. ప్రతీ ఒక్కరూ ఆలోచనతో కూటమి అభ్యర్థులమైన ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, వేమిరెడ్డి కోటారెడ్డి, జనసేన కావలి ఇన్‌చార్జి అళహరి సుధాకర్, వాకాటి బినీత్‌రెడ్డి, కార్తీక్ శర్మ, రఫీమాలిక్, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, మేడా శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకన్నా దారుణంగా పట్టణాలు

కావలి : ఎమ్మెల్యే ఐదేళ్ల పాలనలో అరాచకాలు తప్ప అభివృద్ధి లేదని, పల్లెలకన్నా పట్టణ ప్రాంతాలు దారుణంగా ఉన్నాయని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దగుమాటి వెంకట(కావ్య)క్రిష్ణారెడ్డి తెలిపారు. కావలి పట్టణం 16వ వార్డులో కూటమి అభ్యర్థులతో కలిసి గురువారం ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ వార్డులోని వినాయకనగర్, బాలక్రిష్ణారెడ్డినగర్‌లలో కనీస వసతులు లేకుండా ఘోరంగా ఉన్నాయన్నారు. ఎమ్మెల్యేకి సంపాదనపై మోజు తప్ప అభివృద్ధిపై ధ్యాస లేదన్నారు. ఆయన కమిషన్లకు కక్కుర్తి పడి అభివృద్ధిని అడ్డుకున్నారన్నారు. ప్రతాప్‌రెడ్డిని మరొకసారి గెలిపిస్తే కావలిలో ఇంకేమీ మిగలదన్నారు.



కావలి 16వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కావ్య క్రిష్ణారెడ్డి



టీడీపీ అభ్యర్థుల ర్యాలీలో ఉత్సాహంగా మహిళలు

ఆంధ్రజ్యోతి
జన కేతనం
శుక్రవారం 10 మే 2024

ఆంధ్రజ్యోతి సిత్రాలు

అక్కా.. ఈ తమ్ముడికే ఓటెయ్!



కలిగిరిలో మహిళలతో కరచాలనం చేస్తూ ఓటు అభ్యర్థిస్తున్న ఉదయగిరి అభ్యర్థి కాకర్ల సురేష్

కుర్రకారు జోష్



అల్లూరులో టీడీపీ ప్రచారంలో యువకుల ఉత్సాహం

దిష్టి పోవాలా.. మా నేతలు గెలవాలా!



అల్లూరులో టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి, కావ్యలతోపాటు బీద రవిచంద్ర ఉన్న వాహనానికి దిష్టి తీస్తున్న ఓ కార్యకర్త

జగమంత కుటుంబం నాది !



టీడీపీలో చేరిన వారితో నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ఏం తాతా..చేయికి ఏమైంది ?



మర్రిపాడులో వృద్ధుడిని పలకరిస్తున్న ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం కుమార్తె కైవల్యారెడ్డి, పక్కన నాయకురాలు శాంతాకుమారి

ఇదిగో..ఇక్కడే సైకిల్ గుర్తు.. ఈ బటన్ నొక్కాలి!



నెల్లూరు నగరంలో నమూనా ఈవీఎం యంత్రాన్ని చూపిస్తూ ఓటు వేయాలని కోరుతున్న టీడీపీ నేత వినోద్ కుమార్



నెల్లూరులో ఆందోళన చేస్తున్న న్యాయవాదులు (ఫైల్)

ఘోషిస్తున్నా

చెవికెక్కదే..!

ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో సామాన్యులకు ఉరే!

ప్రభుత్వం దయాదాక్షిణ్యాలపై భూ యాజమాన్య హక్కు

నల్లచట్టంపై పెల్లుబికుతున్న ఆగ్రహం

అయినా అమలుకే జగన్ అడుగులు

ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో ప్రజలను తమ చేతిలో కీలుబొమ్మలుగా మార్చేందుకు వైఎస్. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అతిపెద్ద కుట్రకు తెర తీసింది. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా, ప్రజల హక్కులను హరించేలా ఎలాంటి చర్చ లేకుండా తీసుకొచ్చిన ఈ చీకటి చట్టంపై అన్నివర్గాల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. గతనెల 9న రాష్ట్రంలోని 16 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో తక్షణం ల్యాండ్ టైటిలింగ్ యాక్టు నిబంధనలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. అంటే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు అమలులోకి వచ్చేసినట్లే. ఈ చట్టాన్ని నిలిపివేయాలని భూ యజమానులు ఘోషిస్తున్నా.. న్యాయవాదులు నిరసనలు వ్యక్తం చేస్తున్నా... ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నా... జగన్ మాత్రం వెనుకడుగు వేయడం లేదు. ఈ చట్టాన్ని ఎక్కడా అమలు చేయటం లేదని హైకోర్టుకు సైతం ప్రభుత్వం తప్పుడు సమాచారం ఇచ్చింది.

- కందుకూరు/ నెల్లూరు (లీగల్)

ఆశాభావంతో ఉన్నాం..



ల్యాండ్ టైటిలింగ్ ఆఫీసర్ అంటున్నారే... కానీ అతని క్వాలిఫికేషన్ ఏమిటి, ఎంత పరిధికి ఒక టైటిలింగ్ అధికారి ఉంటాడన్నది ప్రభుత్వం చెప్పటంలేదు. అంటే టైటిలింగ్ అధికారులుగా తమ చెప్పుచేతుల్లో ఉండేవారిని నియమించుకునే ప్రమాదం లేకపోలేదు. కేంద్రం తెచ్చిన చట్టమైతే అనుమతించేందుకు కేంద్రం ఇప్పటికి మూడుసార్లు ఎందుకు తిరస్కరించింది. టీడీపీ అధికారంలోకి వస్తే ఈ చట్టాన్ని రద్దుచేస్తామని చంద్రబాబు ప్రకటించినందున ఆశాభావంతో ఉన్నాం.

- కేవీ లక్ష్మీనారాయణ, సీనియర్ న్యాయవాది, కందుకూరు

విస్తృత చర్చ జరగాలి..



ఏదైనా చట్టాన్ని ప్రవేశపెట్టేముందు విస్తృత చర్చ జరగాలి. ప్రజాభిప్రాయ సేకరణ జరగాలి. వచ్చే అభ్యంతరాలపై మరింత లోతుగా అధ్యయనం చేసి మార్పులు చేర్పులు చేశాకే చట్టరూపం ఇవ్వాలి. ఇదేమీ జరగకుండా ఈ నల్లచట్టం తెచ్చారు. ఈ చట్టాన్ని రద్దుచేయాలి.

- సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు, కందుకూరు బార్ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు

తక్షణం రద్దు చేయాలి



ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను తీసుకువచ్చి, భూవివాదాలను సివిల్ కోర్టుల పరిధి నుంచి రెవెన్యూ యంత్రాంగానికి అప్పగించడమంటే ప్రజలకు అన్యాయం చేయడమే అవుతుంది. ఈ చట్టం అమలైతే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఈ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి.

- పెళ్ళకూరు చంద్రికాదేవి, న్యాయవాది, నెల్లూరు

గ్రామాల్లో కక్షలు పెరుగుతాయి



ఈ చట్టం అమలైతే గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాలు పెరిగిపోతాయి. ప్రశాంత వాతావరణంలోని గ్రామసీమలు నిత్యం రావణ కాష్టంలా మారుతాయి. ఈ చట్టం వల్ల పాలకులకు ఉపయోగమే తప్ప ప్రజలకు ఉపయోగం లేదు. ఏ పార్టీ అధికారంలో ఉంటే అ పార్టీ కనుసన్నల్లో ప్రజలు ఉండాల్సి వస్తుంది. తక్షణమే ఈ చట్టాన్ని రద్దు చేయాలి.

- యస్‌కె. యజ్దాని, న్యాయవాది, నెల్లూరు

గ్రామాల్లో చిచ్చురేపుతుంది..



ఈ చట్టం గ్రామాల్లోని చిన్న, సన్నకారు రైతుల్లో చిచ్చు రేపుతుంది. ఏళ్ల తరబడి ప్రశాంతంగా జీవిస్తున్న రైతుల మధ్య ఈ చట్టం అగాథం ఏర్పడుతుంది. ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉంటే వారికి అనుకూలంగా మారుతుంది. ఎవరికి పలుకుబడి ఉంటే వారే భూములపై అధిపత్యం కొనసాగిస్తారు. ఈ చట్టాన్ని తక్షణం రద్దు చేయాలి.

- మద్దిబోయిన సుందరయ్య యాదవ్, నెల్లూరు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

రైతుకు ఉరే..



ల్యాండ్ టైటిలింగ్ యాక్టు వస్తే రైతుకు ఉరే. అనాదిగా భూమినే నమ్ముకుని జీవిస్తున్న మాలాంటి కుటుంబాలకు ఈ చట్టం గురించి వింటుంటేనే ఆందోళనగా ఉంది. పెట్టుబడికి, కుటుంబ అవసరాలకు అప్పు కావాలన్నా, బిడ్డల పెళ్లిళ్ల చేయాలన్నా మాకు భరోసా ఇచ్చేది భూమి మాత్రమే. ఆ భూమిపైనే హక్కులు ప్రశ్నార్థకమైతే ఇక మా పరిస్థితి ఏమిటి ?

- అమ్మనబ్రోలు ప్రసాదరావు, రైతు, కొల్లూరుపాడు బీసీ కాలనీ, ఉలవపాడు మండలం

దుర్మార్గమైన చట్టం



ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ దుర్మార్గమైన చట్టం. ఇది అమల్లోకి వస్తే సామాన్యులు తమ భూసమస్యలను నివృత్తి చేసుకునేలోపే వారి జీవిత కాలం ముగుస్తుంది. ప్రజలకు ఇది ఏ మాత్రం క్షేమదాయకమైన చట్టం కాదు. దీని రద్దు కోసం న్యాయవాదులు మూడు నెలలపాటు ఉద్యమం చేశారు. అనాడు ప్రజలకు ఇది అర్థం కాలేదు. ఇప్పటికైనా ప్రజలు ఈ చట్టాన్ని అర్థం చేసుకోవాలి. ధరణి పోర్టల్ కేసీఆర్ కొంప ముంచింది. ల్యాండ్ టైటిల్ యాక్టు జగన్ నడ్డివిరిచేస్తోంది.

- వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, న్యాయవాది, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్, నెల్లూరు

ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలి



ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై న్యాయవాదులు అరు నెలలపాటు సమ్మె చేశారు. ఈ సమస్యపై రైతులకు, ప్రజలకు అవగాహన లేదు. ఎన్నికల సమయంలో ఈ యాక్ట్‌పై విస్తృత చర్చ జరుగు తుంది. దీనివల్ల కలిగే నష్టాల ను ప్రజలు గుర్తిస్తున్నారు. ఈ యాక్ట్‌లోని వాస్తవాలను ప్రజలు తెలుసుకోవాలి.

- నావూరు శ్రీధర్, మాజీ బార్ అసోసియేషన్ కార్యదర్శి

ఎన్నికల వేళ.. ఆర్టీసీ ఫుల్

రైట్.. రైట్



ఈ నెల 13న జరగనున్న పోలింగ్‌లో ఓట్లు వేసేందుకు వచ్చేవారితో ఇప్పటికే బస్సులన్నీ ఫుల్ అయ్యాయి. వలసవాసులు ముందుగానే రిజర్వేషన్లు చేయించుకున్నారు. ఉదయగిరి డిపో నుంచి బెంగళూరు, హైదరాబాదు, చెన్నై, విజయవాడ, ఆర్మూర్, కోరుట్ల తదితర ప్రాంతాలకు బస్సులు నడుపుతున్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ అధికారులు ఈ ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులను కూడా నడుపుతున్నారు. అయితే ఆయా మార్గాల్లో తిరిగే బస్సులకు రిజర్వేషన్లు ఫుల్ అవడంతో ప్రయాణికులు అయోమయంలో పడ్డారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇప్పటికే వారితో సంప్రదింపులు జరిపి, వారు వచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. రిజర్వేషన్లు చేసుకొన్న వారి సంగతి అటుంచితే రిజర్వేషన్లు చేయించుకోని వారికి ఆయా పార్టీల నాయకులు ప్రత్యేక వాహనం ఏర్పాటు చేయడంతోపాటు రానుపోను ఖర్చులు, భోజనాలు సమకూర్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.


● ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీ

ఎన్నికల నేపథ్యంలో ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు భారీస్థాయిలో దోచుకునేందుకు రెడీ అయ్యారు. సాధారణ టికెట్ కంటే ప్రయాణికుల నుంచి మూడింతలు వసూలు చేసేందుకు వారు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

- ఉదయగిరి రూరల్

టెండర్ ఓటు అంటే ?

ఒక్కోసారి ఓటు వేయడానికి వచ్చేసరికి మీ ఓటు వేసేశారు అని ఎన్నికల సిబ్బంది చెబుతారు. అంటే ఆ ఓటు ఇంకెవరో వేసి వెళ్ళిపోయారన్నమాట. ఇటువంటి సమయంలో ఓటరు తన హక్కును వినియోగించుకోవడానికి తన ఓటు తనే వేస్తానని పట్టుబట్టవచ్చు. ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయచ్చు. వాస్తవంగా ఓటు వేయలేదని నిర్ధారణకు వస్తే ఈవీఎం ద్వారా కాకుండా బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం ఇస్తారు. ఈ ప్రక్రియనే టెండర్డ్ ఓటు అంటారు. ఇందుకోసం ప్రతి పోలింగ్ బూత్‌లో 20 చొప్పున బ్యాలెట్ పేపర్లు అందుబాటులో ఉంచుతారు. ఇవి బ్యాలెట్ యూనిట్ పైన అమర్చిన వాటిలాగే ఉంటాయి. ఈ బ్యాలెట్‌ను తీసుకుని ఓటరు కంపార్టుమెంట్‌లోకి వెళ్ళి ఓటు వేసి ఆ పత్రాలు కవర్‌లో పెట్టి ప్రిసైడింగ్ అధికారికి అందజేస్తారు. ఆ బ్యాలెట్ పత్రం వెనుక ఇంక్(సిరా)తో టెండర్డ్ బ్యాలెట్ అని రాస్తారు. దీనిని లెక్కింపులో పరిగణనకు తీసుకుంటారు.



- నెల్లూరు

ఓటు వేయడం బాధ్యత

యువగళం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం నాకు కల్పించిన ఓటు హక్కును నేను మొదటి సారిగా ఈ ఎన్నికల్లో సద్వినియోగం చేసుకోబోతున్నా. ఓటు వినియోగించుకోవడం పౌరుడిగా నా బాధ్యత. ఎవరికి ఓటు వేయాలనేది నేను ముందుగానే నిర్ణయించుకున్నా. యువతతో నిండిన నా రాష్ట్రాన్ని ముందుకు నడిపించగలిగే సత్తా ఉన్న నాయకుడికే ఓటు వేస్తా. ఎన్ని పనులున్నా ఆ రోజు ఓటు వేస్తా.

- అడపాల మణికంఠ, కోలగట్ల, సంగం మండలం

బూత్‌లోనే ఓటేస్తా..!



నా వయసు 95 ఏళ్ల. అయినా సరే తగ్గేదేలే.... అంటుంది ఈ బామ్మ. ఈ సారి ఎన్నికల్లో కూడా తాను పోలింగ్ బూత్‌కు వెళ్లే ఓటేస్తానంటుంది ఈమే. ఇంటి వద్దే ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తామని అధికారులు తెలియచేసినా, తాను మాత్రం పోలింగ్‌బూత్‌కి వెళ్లి ఓటు వేస్తేనే తృప్తి కలుగుతుందని ఆమె తెలిపింది. అంతేకాక ఈ సారి ఎన్నికల్లో చంద్రబాబుకి ఓటేసి ఒకేసారి రూ.4వేలు పింఛన్ తీసుకుంటానని ఆమె చెప్పడం కొసమెరుపు.

- వంగపాటి సుబ్బమ్మ, పాతనాపురం, కలిగిరి మండలం

సెందరబాబొస్తే... బస్సుల్లో చాజ్జీలు లేవంటే !

ఎటెటా

ఏందిమే... శివమ్మా.. మన ఆడోళ్లకి బస్సులో చార్జీ లేదంటగదమే... నిజమేనా..?

అవునే కుమారి... మొన్నామధ్య మన ఊళ్లో తెలుగుదేశంపార్టీ ఆయన సెప్తే ఇదెంతవరకు నిజమోలే.. అనుకున్నామే... సెందరబాబు నిన్న టీవీలో సెప్తుంటే సూశా... ఆర్టీసీ బసులో ఆడోళ్లకి చార్జీ ఉండదంట... అంతే కాదుమే... ఇంకా సేలా మన ఆడోళ్లకి మంచి మంచి పథకాలు పెట్టాడుమే...

ఏంటేంటియిమే.. అయ్యా... 19ఏళ్లు వచ్చి 59ఏళ్లు దాటని ఆడోళ్లకు నెలకి పదేనొందల రూపాయలు డబ్బులిస్తాడంట... అంతేకాకుండా ఏమి డబ్బులు కట్టకుండా ఫ్రీగా సంవచ్చరానికి వంటొండుకునేదానికి మూడు సిలిండర్లు ఇస్తాడంటమే...

ఏంది ఏడాదికి మూడు సిలిండర్లా..! అబ్బో ... మూడు సిలిండర్లే... ఐతే నాకు సంవత్సరమంతా సరిపోతాయిమే... ఒక సిలిండరు నాకు నాలుగు నెలలు వస్తదిమే... అయితే మన వయసోళ్లకి నెలకి పదేనొందలు, మూడు సిలిండర్లు...

అంతేకాదుమే కుమారి... జగను అమ్మఒడి ఇయ్యిలా అది ఇంటికి ఒక్క పిల్లోడికే కదా ఇచ్చిందా... సెందర బాబు వస్తే ఇంట్లో ఇద్దరు పిల్లలు సదువుకుంటుంటే ఇద్దరికీ పదిహేనువేల చొప్పున ముప్పైవేలు ఇస్తాడంటమే...

ఓ అట్నా శివమ్మా...



నీకు తెల్దంటమే కుమారి...

తెలీదే శివమ్మా.. మంచిమంచియే సెప్పినాడే సెందరబాబు మన పేదోళ్లకి...

అంతే కాదుమే పింఛిను కూడా ముసలోళ్లకి నెలకి నాలుగేలు... కన్ను, కాలు లేని ఇకలాంగులకి నెలకి ఆరేలు అంటమే...

పాపం పోనీలేమే ముసలోళ్లకి... కన్ను,కాలు లేనోళ్లకి పెంచాల్లేమే... అన్ని రేట్లు పెరిగి ముసలిపాయాన కొడుకులు సూడక కూలికి పోలేక పింఛినుతోనే బతికుతా ఉండారు... వాళ్లకి సెందరబాబు పింఛిను పెంచి మంచి పనిసేసాడుమే... ఐతే మనం తప్పకుండా సెందరబాబుకే ఓటేద్దామ్మే...

- జలదంకి

ఆటోవాలాల సంబరం

ఉపాధి దొరికింది

ఎన్నికల సమయంలో ప్రధాన పార్టీలన్నీ ప్రచారం కోసం రకరకాల వాహనాలను సిద్ధం చేసుకుంటాయి. మండల పరిధిలో ఒక్కొక్క పార్టీకి కనీసం నాలుగు ఆటోలు, పోటీచేసే అభ్యర్థుల ఫొటోలు, పార్టీ గుర్తులతో ప్రచారవాహనాలుగా మారి, గ్రామగ్రామాన ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు తిరుగుతున్నాయి. దీంతో ఆటోవాలాలు తాము అభిమానిస్తున్న పార్టీకి తమ వాహనం ద్వారా ప్రచారం చేసిన సంతృప్తితోపాటు రోజుకు రూ.2వేలు అద్దెరూపంలో వస్తున్నదని సంబరపడిపోతున్నారు.

- కలిగిరి



కోవూరు సర్వేపల్లి

అధ్వానంగా మత్స్యకార గ్రామాల రోడ్లు

వాహన చోదకుల అవస్థలు


ముత్యాలతోపుపాలెం రోడ్డుపై గుంతలు

తోటపల్లిగూడూరు, మే 9: మండలంలోని మత్స్యకార గ్రామాలకు వెళ్లే రోడ్లు గత పది సంవత్సరాల నుంచి మరమ్మతులకు నోచుకోకపోవడంతో అధ్వానంగా మారి ప్రయాణం నరకంగా మారిందని గ్రామస్థులు, వాహన చోదకులు వాపోతున్నారు. తోటపల్లిగూడూరు మండలం కోడూరు పంచాయతీ పాతపాలెం, రవీంద్ర పాలెం, ముత్యాలతోపు పాలెం, కోడూరు బీచ్‌రోడ్డు, వెంకన్నపాలెం రోడ్డు అధ్వానంగా మారి అవస్థలు పడుతున్నా అటు పాలకులు గాని, ఇటు అధికారులు గాని పట్టించుకున్న పాపాన పోలేదని, అంతేకాకుండా వైసీపీ నాయకుల అండదండలతో మత్స్యకార గ్రామాల నుంచి మట్టి తరలిస్తుండడంతో రోడ్లు గుంతలమయం అవుతున్నాయని గ్రామస్థులు పలుమార్లు వాహనాలను కూడా అడ్డుకున్నారు. దీంతో ఆ గ్రామ వైసీపీ కీలక నేతలు రోడ్లు వేసిచ్చే బాధ్యత మాది అని హామీ కూడా ఇచ్చారు. చివరికి గంప మట్టి కూడా వేసిన దాఖలాలు లేవని, ఈ రోడ్డుపై ప్రయాణం అత్యంత ప్రమాదంగా మారడంతో వాహన చోదకులు ఎదుర్కొంటున్న అవస్థలు వర్ణనాతీతం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గ్రావెల్ మాఫియాతో మండలాన్ని భ్రష్టు పట్టించారు..

- మంత్రి కాకాణిపై సోమిరెడ్డి మండిపాటు


వెంకటాచలం : సోమిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన కురిచెర్లపాడు మాజీ సర్పంచి రామకృష్ణమనాయుడు

వెంకటాచలం, మే 9: వైసీపీ ఐదేళ్ల పాలనలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గ్రావెల్ మాఫియాతో పెత్తనం చేయించి వెంకటాచలం మండలాన్ని భ్రష్టు పట్టించారని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వేదాయపాలెంలోని ఆయన కార్యాలయంలో గురువారం మండలంలోని కురిచెర్లపాడు మాజీ సర్పంచ్ రామకృష్ణమనాయుడు, కంటేపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత రేంజ్ ఆఫీసర్ మహమ్మద్ నాజీముద్దీన్, వెంకటాచలం గ్రామానికి చెందిన యూట్యూబర్ చంటిలతో సహా కురిచెర్లపాడు, కంటేపల్లి, గొలగమూడి, వెంకటాచలం గ్రామాల నుంచి 63 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈసందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ 13న జరిగే ఎన్నికల్లో కాకాణి కబంధ హస్తాల నుంచి సర్వేపల్లిని కాపాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల టీడీపీ నాయకులున్నారు.

దౌర్జన్యాలకు పాల్పడిన వారిని విడిచిపెట్టేది లేదు..

మండలంలోని కసుమూరు గ్రామంలో సర్వేపల్లి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సారథ్యంలో మండల నాయకత్వం ఆధ్వర్యంలో గురువారం రాత్రి భారీ ర్యాలీ నిర్వహించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కాకాణి చేసిన అవినీతి, అక్రమాలు, అక్రమ కేసులు, భూ కుంభకోణాలు, మైనింగ్ దోపిడీ, వైసీపీ నేత మండల వెంకట శేషయ్య చేసిన దౌర్జన్యాలు, అరాచకాలపై సోమిరెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. టీడీపీ అధికారంలోకి రాగానే దౌర్జన్యాలు, అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఏ ఒక్కరినీ విడిచిపెట్టే ప్రసక్తేలేదని హెచ్చరించారు. తొలుత మండలంలోని ఇడిమేపల్లి, జంగాలపల్లి, రామదాసుకండ్రిగ, నాయుడుపాళెం గ్రామాల్లో సోమిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సురేంద్రరెడ్డి, సురేష్‌నాయుడు, రాజాయాదవ్, నాగేంద్రప్రసాద్, శ్రీనివాసులునాయుడు, మండలంలోని టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కసుమూరు ర్యాలీలో మాట్లాడుతున్న సోమిరెడ్డి

● **తోటపల్లిగూడూరు:** సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని గెలిపిస్తే సర్వేపల్లి అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తారని కుమార్తె సోమిరెడ్డి సింధు పేర్కొన్నారు. మండలంలోని వెంకన్నపాలెం గిరిజన దళిత కాలనీలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీకుమార్‌రెడ్డి, చింత సీతారామయ్య, సుమను పాల్గొన్నారు.

● మండలంలోని ముంగరదొరువు, చింతోపు, మండపం, కొత్తపాలెం, పంచాయతీలో టీడీపీ నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తాండ్ర మునికృష్ణ, గోపి, శ్రీహరి, పైనం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● **మనుబోలు:** సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని గెలిపించాలంటూ కోడలు శృతిరెడ్డి కట్టువపల్లి గ్రామంలో టీడీపీ నాయకులు నందగోపాల్‌రెడ్డి, మహేంద్ర, విజయభాస్కర్‌రెడ్డి, శేషారెడ్డి, మల్లి ఆధ్వర్యంలో గురువారం ప్రచారం చేశారు. అలాగే మడమనూరు, కాగితాలపూరు గ్రామాల్లో పర్యటించారు. కాగా వెంకన్నపాళంలో అడపాలశివకుమార్‌రెడ్డి, హనుమంతనాయుడు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో డమ్మీ ఈవిఎంలపై ఓటర్లకు అవగాహన కల్పించారు.

టీడీపీ యువత ఇంటింటి ప్రచారం

పొదలకూరు: మండలంలోని డేగపూడి, రాజుపాలెంలో గురువారం టీడీపీ యువత, నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ కరపత్రాలను పంచి ఈవీఎంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో సర్వేపల్లి నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఓటు వేయాలంటే ఈవీఎం వరుస సంఖ్యలో రెండో నెంబరుపై నొక్కాలని, బీజేపీ బలపరిచిన తిరుపతి పార్లమెంటు అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌కి ఓటు వేయాలంటే 4వ నెంబరు బటన్‌పై నొక్కాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంటా మల్లికార్జున్‌యాదవ్, పుచ్చకాయల గోపాల్‌నాయుడు, ముదులూరు పరందం రాజు, దాసరి రాజు, తదితరులున్నారు

నాగులవెల్లటూరులో ఉద్రిక్తత

- ప్రచారంలో ఇరువర్గాల ఘర్షణ

చేజర్ల, మే 9 : మండలంలోని నాగులవెల్లటూరులో గురువారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. గ్రామంలోని వైసీపీకి చెందిన ఓవర్గం మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు సమక్షంలో టీడీపీలో చేరేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి కొమ్మి లక్ష్మయ్యనాయుడుతో కలిసి గురువారం టీడీపీలో చేరుతున్న వారి వద్దకు వెళ్లారు. అయితే, మరో వర్గం వారు తొలుత తమ వద్దకు రాలేదంటూ ఘర్షణకు దిగారు. దీంతో ఇరువర్గాలు బాహాబాహీకి దిగడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రభాకర్ అక్కడకు చేరుకోగా గ్రామం లోపలకు రానీయకుండా మహిళలు అడ్డుకున్నారు. డీఎస్పీ కోటారెడ్డి, సీఐ రవి నాయక్ గ్రామానికి చేరుకుని పరిస్థితి అదుపులోకి తెచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గస్తీ ఏర్పాటు చేశారు.

ఓటరు స్లిప్పులు అందక
సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు


ఒక ప్రాంతంలో కూర్చుని ఓటరు స్లిప్పులు ఇస్తున్న బీఎల్వోలు

బుచ్చిరెడ్డిపాళెం, మే 9: ఈనెల 13న జరగబోయే ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటరు స్లిప్పుల కోసం సచివాలయాల చుట్టూ ఓటర్లు ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. స్లిప్పుల పంపిణీకి 8వ తేదీతో గడువు ముగియగా దాన్ని గురువారం వరకు పొడిగించారు. అయినా బీఎల్వోలు బుచ్చి పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఓటరు స్లిప్పుల పంపిణీలో తీవ్ర జాప్యం చేస్తున్నారనే విమర్శలు వున్నాయి. మరికొంతమంది ఓటరు స్లిప్పుల కోసం సచివాలయాలకు వెళ్తే బీఎల్వోలు లేరని చెబుతున్నారు. ఈ విషయంపై బీఎల్వో సుప్రజను వివరణ కోరగా స్లిప్పులు ఇచ్చేందుకు ఇళ్లవద్దకెళ్లినప్పుడు ఇంట్లో లేనివారు సచివాలయానికి వచ్చి తీసుకోవాలని చెప్తుండడం గమనార్హం. కాగా, సచివాలయాల వద్దకు స్లిప్పుల కోసం వెళ్ళినా బీఎల్వోలు వుండడంలేదని ఓటర్లు వాపోతున్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఫ్రీ సీట్లు

నెల్లూరు (విద్య), మే 9 : ప్రాథమిక విద్యాహక్కు చట్టం కింద ప్రతి ప్రైవేట్ పాఠశాలలో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు 25 శాతం సీట్లు కేటాయించామని, దీనికి జిల్లాలో 893 మంది విద్యార్థులు ఎంపికయ్యారని డీఈవో రామారావు ఓ ప్రకటనలో పేర్కొన్నా రు. ఉచిత ప్రవేశాల కోసం లాటరీ విధానంలో ఎంపికైన విద్యార్థులు తాము కోరుకున్న పాఠశాలల్లో శుక్రవారంలోపు అడ్మిషన్ పొందాలని, ఈ ప్రవేశాలను ఏదైనా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం తిరస్కరించినా, ఫీజు చెల్లించమని కోరినా జిల్లా విద్యా శాఖకు ఫిర్యాదు చేయాలని కోరారు.

కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో బాబుతోనే సంపూర్ణాభివృద్ధి

- కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం అశ్విత్‌నారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం

మనుబోలు, మే 9: కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో బాబు ఉంటేనే సంపూర్ణాభివృద్ధి జరుగుతుందని కర్నాటక మాజీ డిప్యూటీ సీఎం అశ్విత్‌నారాయణ అన్నారు. గురువారం మనుబోలులో నియోజకవర్గంలోని ఐదు మండలాల బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులు మాత్రమే ఉందని, టీడీపీ నాయకులను కలుపుకుని ప్రచారం ముమ్మరం చేయాలన్నారు. ఇంటింటా కరపత్రాల ప్రచారం, డమ్మీ ఈవిఎంతో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేంద్రరెడ్డి, వంశీధర్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, రవీంద్రరెడ్డి, బోలా శ్రీనువాసులు, వాసిరెడ్డి రామిరెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం


సోమిరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నూనె మల్లికార్జున్‌యాదవ్

వెంకటాచలం, మే 9: ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని జనసేన పార్టీ నేత నూనె మల్లికార్జున్‌యాదవ్ తెలిపారు. గురువారం ఆయన సర్వేపల్లి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీరెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రావణ రాజ్యం పోయి రామరాజ్యం రావాలంటే ప్రజలందరూ ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుందర్‌రామిరెడ్డి, వేటూరి రవికుమార్, కారంపొడి కృష్ణరెడ్డి, గునుకుల కిషోర్, బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, వాణిభవానీ, పవన్‌యాదవ్, కిషోర్, తదితరులున్నారు.

జొన్నవాడ పీహెచ్‌సీ తనిఖీ


జొన్నవాడ ప్రభుత్వాసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న ఖాదర్‌వలి

బుచ్చిరెడ్డిపాళెం, మే 9: మండలంలోని జొన్నవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టీబీ, లెప్రసీ, అధికారి డాక్టర్ ఎస్‌కే ఖాదర్‌వలీ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆసుపత్రిలో నిర్వహించిన గర్భిణుల పరీక్షా కార్యక్రమాన్ని పర్యవేక్షించి వారికి ఆరోగ్యంపై పలు సూచనలు, పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈనెల 16 నుంచి జరగబోయే అడల్ట్ బీసీజి వ్యాక్సినేషన్‌పై సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఆయనతో పాటు వైద్యాధికారి డాక్టర్ అహ్మద్‌బాబు, సూపర్‌వైజర్లు, సిబ్బంది వున్నారు.

ఐదోరోజు 18 ఓట్లు పోల్

వెంకటాచలం, మే 9 : సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి ఐదో రోజైన గురువారం 18 మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ రూపంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొలి నాలుగు రోజుల్లో 1379 ఓట్లు పోల్ కాగా ఐదో రోజు 18 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 1431 ఓట్లకు గాను ఐదు రోజులకు కలిపి 1397 పోల్ కాగా, మిగిలిన 34 ఓట్లు పోల్ కావాల్సి ఉందని ఎన్నికల అధికారులు తెలిపారు.

గ్రామీణాభివృద్ధి జరగాలంటే చంద్రబాబును సీఎం చేయాలి !

- కోవూరు టీడీపీ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

విడవలూరు, మే 9: రాష్ట్రంలో గ్రామీణ అభివృద్ధి జరగాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని కోవూరు ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. మండలంలోని ముదివర్తి, అన్నారెడ్డిపాలెం, విడవలూరు గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని కాలనీల్లో పర్యటించి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ప్రజలతో మమేకమై ఈవీఎం నమూనాను చూపుతూ సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను కోరారు. అనంతరం ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో ఏప్రాంతానికి వెళ్లినా అంతర్గత రోడ్లు, మురికి కాలువలు, శ్మశాన వాటికలకు దారులు కూడా లేవని, అదేవిధంగా అనేక పంచాయతీల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గడిచిన ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం పంచాయతీలకు విడుదలయ్యే కేంద్ర ప్రభుత్వ నిధులను దారి మళ్లించి గ్రామీణాభివృద్ధిని సర్వనాశనం చేసిందన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. ముదివర్తిలో ఇల్లులేని నిరుపేదలకు స్థలాలను కేటాయిస్తామన్నారు. అదేవిధంగా పెన్నా ఇసుకను ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. తాగునీటికి ఇబ్బందులు పడుతులున్న కాలనీలో తాగునీటి సమస్యను తీరుస్తామన్నారు. విడవలూరు మండలంలో టీడీపీ హయాంలో జాన్‌పేటలో నిర్మించిన వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా ఉందని, దాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అదేవిధంగా మలిదేవి డ్రైన్‌పై ఉన్న బ్రిడ్జిని వంతెనను నిర్మిస్తామన్నారు. పలు కాలనీల్లో మురికి కాలువలు నిర్మించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, తనను గెలిపించాలని ఆమె కోరారు. ఎన్నికల్లో గెలుపొందగానే ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణచైతన్య, పాశం శ్రీహరిరెడ్డి, ఎస్‌కె రఫీ, సింహాద్రి అయ్యప్ప, ఎస్‌కె ఇమామ్‌బాషా, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, మల్లేశ్వరి, చెముకుల శ్రీనివాసులు, పొన్నలూరు పురందర్‌రెడ్డి, సత్యంరెడ్డి, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


ముదివర్తిలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్థులు


విడవలూరు ప్రచారంలో మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కోవూరులో టీడీపీ నేతల ముమ్మర ప్రచారం

కోవూరు : ఎన్నికల ప్రచారం రెండురోజుల్లో ముగుస్తుండటంతో టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు గ్రామాల్లో ప్రచారం ముమ్మరం చేశారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి నమూనా బ్యాలెట్లతో ప్రచారం చేపట్టారు. స్థానిక కోనేటి కయ్యలు, శాంతినగర్, పీఆర్‌ఆర్ కాలనీల్లో టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, జెట్టి రాజగోపాలరెడ్డి పచ్చిపాల విజయసాయిరెడ్డి, పంతంగి రామారావు నాయకత్వంలో ప్రచారం చేశారు. ఇనమడుగు, జమ్మిపాళెం గ్రామాల్లో చేనేత కార్మికసంఘం నాయకులు గుత్తికొండ వెంకయ్య నాయకత్వంలో, గౌడ సంఘం నాయకులు దాసరి విజయకుమార్, దాసరి రమేష్, అన్నం వెంకటేశ్వర్లు, దాసరి శ్రీనివాసులు, బండ్ల సుధీర్ నాయకత్వంలో వేర్వేరుగా ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి వేమిరెడ్డి దంపతుల్ని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. నమూనా బ్యాలెట్‌ను చూపుతూ ఓటర్లను అప్రమత్తంగా వ్యవహరించాల్సిందిగా కోరారు.


కోవూరు : ఇనమడుగులో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

గిరిజనుల ఓట్లు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి


ఓట్లు తొలగింపుపై నిరసన తెలుపుతున్న దళిత నేతలు, గిరిజనులు

కావలి, మే 9: కావలి పట్టణం బుడంగుంట గిరిజన కాలనీలో గిరిజనుల ఓట్లు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి డిమాండ్ చేశారు. ఈ మేరకు దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. అనంతరం కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లి మాట్లాడుతూ కావలి పట్టణంలోని 17వ వార్డులో 35 మంది గిరిజనుల ఓట్లు, బాలక్రిష్ణారెడ్డి నగర్‌లో 70 ఓట్లు తొలగించారన్నారు. ప్రజాస్వామిక దేశంలో 18 ఏళ్లు నిండిన వారందరికీ రాజ్యాంగం ఓటు హక్కు కల్పిస్తుంటే అట్టడుగు వర్గాలకు చెందిన ఓటర్లను బీఎల్వోలు, సచివాలయ సిబ్బంది, వారి పర్యవేక్షకులు కలిసి తొలగించడం అన్యాయమన్నారు. వెంటనే తొలగించిన ఓటర్లను పునరుద్ధరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన నేతలు చౌటూరి వెంకటరత్నం, లక్ష్మయ్య, జడ్డా వాసు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని రెండు చుక్కల దుప్పిలు మృతి


రైలు ఢీకొని మృతి చెందిన చుక్కల దుప్పిలు

బిట్రగుంట, మే 9: బిట్రగుంట రైల్వే స్టేషన్ ఉత్తరం వైపు ఎగువ మార్గంలో గుర్తు తెలియని రైలు ఢీకొని రెండు చుక్కల దుప్పిలు మృతి చెందినట్లు కావలి అటవీ శాఖ సెక్షన్ అధికారి ఆర్. సుమన్ తెలిపారు. గురువారం తెల్లవారు జామున అటవీ ప్రాంతం నుంచి కడనూతల, కోవూరుపల్లి చెరువులకు తాగునీటి కోసం వెళ్లేందుకు రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెంది ఉండవచ్చని పేర్కొన్నారు. బిట్రగుంట రైల్వే పోలీసులు షేక్.బాషా, కే.నాగమలేష్‌ల సమాచారంతో ఘటనా స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. పశు వైద్యాధికారి సీ.రాజు శవ పంచనామ అనంతరం వాటిని దహనం చేసినట్లు తెలిపారు.

సోమశిలలో 7.967 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మే 9: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు గురువారానికి జలాశయంలో 7.967 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

వృద్ధురాలి హత్య కేసు నిందితుల అరెస్ట్

సంగం, మే 9: జండాదిబ్బ సుబ్బమ్మ హత్య కేసులోని ఇద్దరు నిందితులను సంగం పోలీసులు గుర్తించారు. గురువారం వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఆ వివరాల మేరకు.. రెండురోజుల కిందట గ్రామ శివారులోని ఉంటున్న సుబ్బమ్మను ఆమె దగ్గర ఉన్న బంగారు నగలు కోసం గ్రామానికి చెందిన గడ్డం అనీల్, ఆరీఫ్ అనే ఇద్దరు యువకులు చంపి అనుమానంతో తిరుగుతున్నారు. వీరిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం తెలి సింది. వృద్ధురాలి బంగారు సరుడు, కమ్మలు, ఉంగారాన్ని పోలీసులు అప్పగించారు. అనంతరం వారిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. కోవూరు కోర్టు మెజిస్టేట్ వారికి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బంగారంతో పోటీ పడుతున్న పొగాకు

- కిలో రూ.300


వేలానికి వచ్చిన పొగాకు బేళ్లు

కలిగిరి, మే 9: నిత్యం పెరుగుతున్న బంగారం ధరలతో పొగాకు ధరలు పోటీ పడుతున్నాయి. ఈ ఏడాది పొగాకు కిలో రూ.300 పలికి బంగారంగా మారిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది రూ.280 వరకు పలికిన పొగాకు ధర ఈ ఏడాది రూ.230 నుంచి రోజురోజుకు పెరుగుతూ గురువారం కిలో పొగాకు ధర రూ.300 పలికింది. కాగా కలిగిరి పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు మొత్తం 610 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 555 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-37, సీఆర్-8, జంపింగ్ లాట్స్-10 కారణాలతో 55 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.300, కనిష్ఠ ధర రూ.210, సగటు ధర రూ.270.98గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

లారీ బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలు


బోల్తా పడిన లారీ

మనుబోలు, మే 9: లారీ బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలైన సంఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై బద్దెవోలు క్రాస్ రోడ్డు వద్ద గురువారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను తీసుకుని చెన్నై వెళుతున్న లారీ రోడ్డుపై పెట్టిన బారికేడ్లను తప్పించే క్రమంలో అదుపుతప్పి చెక్‌పోస్టు శిబిరంపైకి దూసుకువచ్చి రక్షణగోడకు ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ కార్తీక్‌కు గాయాలయ్యాయి. రోడ్‌సేఫ్టీ వాహనానికి లారీ తగలడంతో వెనుక భాగం ధ్వంసమైంది. అయితే పోలీసులు రోడ్డు పక్కన ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

పాముకాటుతో బీటెక్ విద్యార్థి దుర్మరణం

కలువాయి, మే 9: బాలాజీరావుపేటకు చెందిన బీటెక్ విద్యార్థి పొత్తూరు రోహిత్ (20) గురువారం పాముకాటుతో మరణించాడు. ఉదయం 5గంటలకు ఊరు బయటకు బహిర్భూమికి వెళ్లాడు. అక్కడ అతని చేతిపై పాముకాటు వేసింది. ఈ విషయాన్ని గుర్తించిన రోహిత్ ఇంటికి వచ్చి కుటుంబసభ్యులకు తెలిపాడు. వెంటనే చికిత్స కోసం అతన్ని నెల్లూరుకు తరలిస్తుండగా మార్గమధ్యమంలో మృతి చెందాడు. గూడూరులోని ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజీలో రోహిత్ బీటెక్ రెండో ఏడాది చదువుతున్నాడు. ప్రతి రోజూ గ్రామం నుంచే కాలేజీ బస్సులో గూడురుకు వెళ్లి వస్తుండేవాడు. కుమారుడి మరణంతో తల్లిదండ్రులు పొత్తూరు నాగభూషణం, నిర్మలమ్మలు కన్నీరు మున్నీరుగా విలపిస్తుండటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

12న జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

నెల్లూరు (విద్య), మే 9 : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12వతేదీ ఆదివారం బుజబుజ నెల్లూరులోని సీఏపీ క్రికెట్ అకాడమీ మైదానంలో జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి డీ నిఖిలేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు అండర్-19 బాలుర జట్టు, మధ్యాహ్నం 3 గంటలకు అండర్-15, 19 బాలికల జట్ల ఎంపిక జరుగుతుందని తెలిపారు. క్రీడాకారులు వైట్ అండ్ వైట్ డ్రస్ కోడ్‌తో, తమ సొంత క్రికెట్ కిట్‌తో, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు ఏసీ స్టేడియంలోని ఎన్‌డీసీఏ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	157
లేయర్ లైవ్	100
స్కిన్ చికెన్	274
స్కిన్‌లెస్	304
లేయర్	170

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6803
వెండి కిలో ధర	రూ. 84,700
వెండి ఒక గ్రాము	రూ. 86.70

ఎన్నికల పర్వం

మహిళలకు పింక్ పోలింగ్ స్టేషన్



నెల్లూరు నగర నియోజకవర్గంలోని మహిళా ఓటర్ల కోసం ఎన్నికల అధికారులు పింక్ కలర్‌లో ఉండే పోలింగ్ స్టేషన్ను ఏర్పాటు చేశారు. సుబేదార్‌పేటలోని 30వ నెంబరు పోలింగ్ స్టేషనుకు పింక్ పోలింగ్ కేంద్రంగా నామకరణం చేశారు. ఎన్నికల సంఘం ప్రచారాలతోపాటు పోలింగ్ స్టేషన్ బయట, లోపల పింక్ కలర్‌తో రంగులు వేసి ఆకర్షణీయంగా తయారు చేశారు. ఇక్కడ మహిళలు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. ఈ కేంద్రాన్ని గురువారం సిటీ ఆర్వో వికాస్ మర్మత్ పరిశీలించి సౌకర్యాలపై ఆరా తీశారు. సిటీలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సెక్టార్ అధికారులు పరిశీలించి, అక్కడి లోపాలు, అసౌకర్యాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

\- నెల్లూరు(సిటీ)

కార్పొరేషన్ ఉద్యోగుల స్వామి భక్తి

- నరసరావుపేట వైసీపీ ఎంపీ అభ్యర్థి అనిల్‌కు మద్దతుగా ప్రచారం
- ఐదుగురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఔట్
- విధుల నుంచి తొలగిస్తూ కమిషనర్ ఉత్తర్వులు

నెల్లూరు (సిటీ), మే 9 : నెల్లూరు నగరపాలక సంస్థలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ స్వామిభక్తిని చాటుకున్నారు. నగర ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ (వైసీపీ) నరసరావుపేట ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్నారు. కార్పొరేషన్‌లోని ఆరోగ్య విభాగంలో పని చేస్తున్న డీ ద్వారకాభాయ్, షేక్ మహితాజ్, సమీలా, షబీహా, ఎస్ మంజులలు ఇటీవల నరసారావుపేటకు వెళ్లి అనిల్‌కు సంఘీభావం తెలిపారు. అంతటితో ఆగక ఇంటింటా ప్రచారం చేసి అనిల్‌తోపాటు మంత్రి అంబటి రాంబాబుతో కలిసి ఫొటోలు దిగారు. వీటిని సోషల్ మీడియాలో పెట్టడంతో అవికాస్త వైరల్ అయ్యాయి. అంతేగాక కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్‌కు ఫిర్యాదులు అందడంతో విచారణ చేపట్టిన ఆయన వారందరిని విధుల నుంచి తొలగిస్తూ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు నిబంధనలు అతిక్రమించకూడదని ఎన్నికల సంఘం పదేపదే హెచ్చరిస్తున్నా పట్టించుకోని వైసీపీ అనుకూల ఉద్యోగుల ఇలా విధులకు దూరమవడం చర్చనీయాంశంగా మారింది.

పోస్టల్ బ్యాలెట్‌తో రిటన్ గిఫ్టు

నెల్లూరు(హరనాథపురం), మే 9 : ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగులకు వైసీపీ ప్రభుత్వం ఒకటో తేదీన జీతాలు, పీఆర్‌సీ బకాయిలు, డీఆర్ బకాయిలు ఇచ్చిన పాపాన పోలేదని, అందుకే ఎన్నికల విధులు కేటాయించిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా రిటన్ గిఫ్టుగా వైసీపీకి వ్యతిరేకంగా ఓటు వేశారని ఏపీ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 13న జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి వ్యతిరేకంగా ఓటు వేసి ఎన్‌డీఏ కూటమిని గెలిపించుకుంటామని తెలిపారు. తద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగులు వారికి రావాల్సిన రాయితీలను సాధించుకుంటారన్నారు.

ఎన్నికల విధుల్లోని ఆశాలకు అలవెన్స్ ఇవ్వాలి

- డీఎంహెచ్‌వోకు యూనియన్ వినతి


డీఎంహెచ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

నెల్లూరు (వైద్యం), మే 9 : ఎన్నికల విధులు నిర్వహించే ఆశా కార్యకర్తలకు అలవెన్స్ ఇవ్వాలని ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో డీఆర్వోకు, డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్యకు వినతిపత్రం అందించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ ఎన్నికల విధుల నిర్వహించే ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం ఉద్యోగులకు ఇస్తున్నట్లు అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు రమాదేవి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

చంద్రబాబు దెబ్బకు జగన్‌లో వణుకు

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి


టీడీపీకి ఓటెయ్యాలని కోరుతున్న కోటంరెడ్డి

నెల్లూరు (వైద్యం), మే 9 : నిన్న.. మొన్నటి వరకు మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి చంద్రబాబు దెబ్బతో వణుకు పుడుతోందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం ఎన్టీఆర్ నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ కూటమి అధికారం లోకి రాగానే సీఎం జగన్ అక్రమాస్తుల కేసులో జైలుకు వెళ్లటం ఖాయమన్నారు. సిటీ నుంచి పొంగూరు నారాయణను గెలిపించాలని ఓటర్లను కోరారు.

కూటమి ప్రభుత్వంతో అన్ని వర్గాలకు న్యాయం : వినోద్

నెల్లూరు (విద్య), మే 9 : టీడీపీ కూటమి ప్రభుత్వంతో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని ఆ పార్టీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తెలిపారు. నగరంలోని 47వ డివిజన్‌లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, బటన్ నొక్కుడు కార్యక్రమాలతో అభివృద్ధిని మరిచిన ప్రభుత్వం, అడ్డగోలుగా పన్నులు, అధిక ధరలు, జరిమానాలతో వేధించిందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నగర ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఓటింగ్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు.

నారాయణ, వీపీఆర్ గెలుపుతో అభివృద్ధి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 9: సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులైన పొంగూరు నారాయణ, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపిస్తే నగరంలో అభివృద్ధి పనులు జరుగుతాయని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్ తెలిపారు. నగరంలోని 8వ డివిజన్ స్టోన్‌హౌస్‌పేట, ఉస్మాన్‌సాహెబ్ పేట, తడికల బజార్, రేబాలవీధి ప్రాంతాల్లో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గూడూరు శ్రీధర్‌రెడ్డి, జనసేన నాయకులు కృష్ణారెడ్డి, గుర్రం కిషోర్, శ్రీపతి రాము, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎన్‌డీఏ కూటమి పార్టీల నాయకులు

వేదగిరిపై బ్రహ్మోత్సవాలు

- 16 నుంచి వార్షిక ఉత్సవాలు ప్రారంభం
- 21న బంగారు గరుడసేవ, 22న కల్యాణం

నెల్లూరురూరల్, మే 9 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో ఒక్కటైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు 16వ తేదీ నుంచి జరగనున్నాయి. అదేరోజున అంకురార్పణతో ఉత్సవాలను మొదలపెట్టనున్న ఆలయ అర్చక, అధికారులు వైభవోపేతంగా వేడుకలను నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. 21న బంగారు గరుడ వాహనం, 22న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీవారి కల్యాణం, 23న నరసింహపురంలో రథోత్సవం, 26న పుష్పయాగం, ఏకాంతసేవతో వేడుకలు ముగియనున్నాయి. ఈ క్రతువులను ఘనంగా నిర్వహించేందుకు దేవదాయ శాఖ భారీగా ఏర్పాట్లు చేస్తోంది. నెల్లూరు నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసులు, వేదగిరిపై వేసవితాపానికి ప్రత్యామ్నాయంగా చలువ పందిళ్లు, మంచినీటి సౌలభ్యం, భక్తుల వసతి, వాహన పార్కింగ్, అత్యవసర సర్వీసుల వంటి సౌకర్యాలు మెరుగ్గా సమకూర్చుతున్నారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకుని విస్తృత ఏర్పాట్లు చేస్తున్న ఆలయ ఈవో గిరికృష్ణ తెలిపారు. వేసవి తాపం భక్తులపై పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.


బ్రహ్మోత్సవ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ఆర్డీవో మలోల, అర్చకులు

విజయవంతం చేద్దాం : ఆర్డీవో

లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని విజయవంతం చేయాలని నెల్లూరు ఆర్డీవో మలోలా సూచించారు. గురువారం నెల్లూరులోని తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. తరలివచ్చే భక్తులకు తగ్గట్టు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఉత్సవాలు జరిగే రోజుల్లో చుట్టుపక్కల మద్యం అందుబాటులో లేకుండా చేయాలని ఆదేశించారు. వేసవి నేపథ్యంలో కొండ మీద తాగునీటి సౌకర్యం విరివిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో గిరికృష్ణ, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.


వేదగిరి క్షేత్రంలోని ఉపాలయాలకు రంగులు వేస్తున్న కార్మికులు

చరిత్ర సృష్టించబోతున్నాం..!

- ఎన్నికల ప్రచారాల్లో టీడీపీ రూరల్ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి


మాట్లాడుతున్న రూరల్ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి, పక్కనే ఏవీఆర్

నెల్లూరు రూరల్, మే 9 : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో చరిత్ర సృష్టించబోయే మెజార్టీని సాధించబోతున్నామని రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారాల్లో భాగంగా గురువారం కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీ, సౌత్‌రాజు పాళెం, కోడూరుపాడు ప్రాంతాల్లో రోడ్ షోలు, ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో వార్ వన్‌సైడ్ అయిందన్నారు. తనను రూరల్ ప్రజలు ఎమ్మెల్యేను చేసినప్పట్నుంచి ఇంట్లో కంటే ఎక్కువ సమయం నియోజకవర్గంలోనే ఉన్నానన్నారు. ప్రజలే కుటుంబంగా భావించి నిత్యం అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో తనలాగా పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండే ఎమ్మెల్యే మరొకరు ఉండకపోవచ్చని చెప్పారు. తనకు ప్రత్యర్థిగా పోటీలో ఉన్న వైసీపీ అభ్యర్థిది మూడు నెలలకు ఒకసారి ప్రజలను పలకరించే తత్వమని, కరోనా వంటి కష్టకాలంలోనూ ఆయన అందుబాటులో లేకపోగా, కనీసం ప్రజలను ఫోన్‌లో కూడా పలకరించలేదని విమర్శించారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజలను ఆలోచింప చేస్తున్నాయన్నారు. అనంతరం నెల్లూరులోని ఆయన కార్యాలయంలో 24వ డివిజన్ వైసీపీ నాయకుడు కాటూరు శ్రీధర్‌రెడ్డి, ఆయన మిత్రబృందాన్ని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి, సీనియర్ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, అరవ శ్రీను, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.


కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆత్మీయ సమావేశానికి హాజరైన స్థానికులు

చికిత్స పొందుతూ తల్లి మృతి

- కుమారుడి దాడితో తీవ్రగాయాలు

నెల్లూరు(క్రైం), మే 9: నవమాసాలు మోసి, కని పెంచిన కొడుకే ఆ తల్లి పాలిట యముడయ్యాడు. నగరంలోని పుత్తాఎస్టేట్‌కు చెందిన ఇందిరకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు గిరికి వివాహమై బీవీ నగర్‌లో ఉంటుండగా, ఇందిర చిన్నకుమారుడు హరితో కలిసి నివసిస్తోంది. హరి మద్యానికి బానిసయ్యాడు. గత నెల 29వ తేదీ రాత్రి మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని తల్లిని అడిగాడు. ఆమె తన వద్ద లేవని చెప్పడంతో విచక్షణా రహితంగా కత్తితో తల్లిపై దాడి చేశాడు. దీంతో ఆమె వెన్నుపూసకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పెద్ద కుమారుడు గిరి అక్కడికి చేరుకుని గాయాలతో ఉన్న తల్లిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు వైద్యశాలకు తరలించాడు. గిరి ఫిర్యాదుతో చిన్నబజారు పోలీసులు నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున ఇందిర మృతి చెందింది. దీంతో హత్యాయత్నం కేసును హత్య కేసుగా మార్పు చేసినట్లు చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు.

నేదురుమల్లి జనార్దన్‌రెడ్డికి నివాళి

నెల్లూరు (వైద్యం), మే 9 : మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి 10వ వర్ధంతిని గురువారం నగరంలోని ఇందిరాభవన్‌లో నిర్వహించారు. పీసీసీ సభ్యుడు బాలసుధాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు జనార్దన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలకు వస్త్రదానం చేశారు. పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి కొప్పుల రాజు మాట్లాడుతూ తనకు నేదురుమల్లితో ఎంతో అనుబంధం ఉందన్నారు. ఆయన రెవెన్యూ మంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వ భూముల సంరక్షణకు కృషి చేశామని చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ తాను నేదురుమల్లిని గురువుగా భావించి ఆయన ఆశయాల సాధనకు కృషి చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏటూరి శ్రీనివాసులురెడ్డి, గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


నేదురుమల్లికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే
చట్టపరమైన చర్యలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు (వైద్యం), మే 9 : స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య హెచ్చరించారు. గురువారం నగరంలోని అపోలో ఆసుపత్రిలో స్కానింగ్ సెంటర్, ఏఆర్‌టీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. వైద్యులతో సమావేశం నిర్వహించారు. స్కానింగ్ సెంటర్లలో నిబంధనలు పాటించాలన్నారు. అవసరమైతే తప్ప స్కానింగ్ విషయాలు బయట పెట్టరాదన్నారు. దీన్ని అతిక్రమించే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ పీసీపీఎన్‌డీటీ చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని కోరారు. అలాగే ఏఆర్‌టీ కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలతోపాటు వైద్య నిపుణులు, నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. దీనికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తనిఖీ బృందంలోని డాక్టర్ గీతాలక్ష్మి, అపోలో హెల్త్ డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్‌సతీష్, డెమో శ్రీనివాసరావు, డిప్యూటీ డెమో కనకరత్నం, కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమిని ఆదరించండి

- కాంగ్రెస్ పార్టీ జాతీయ, రాష్ట్ర నేతలు

నెల్లూరు (వైద్యం), మే 9 : దేశంలో ఇండియా కూటమి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని, ప్రస్తుత ఎన్నికల్లో ఆ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ జాతీయ, రాష్ట్ర నేతలు పిలుపునిచ్చారు. గురువారం నెల్లూరు నర్తకి సెంటర్‌లో దళిత ఆత్మగౌరవ సభ జరిగింది. కాంగ్రెస్ ఎస్సీ విభాగం జాతీయ చైర్మన్ రాజేష్ లిలోథియా మాట్లాడుతూ కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వచ్చేందుకు అందరూ కృషి చేయాలన్నారు. తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ని ప్రధానిని చేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ నేత అద్దంకి దయాకర్, నెల్లూరు ఎంపీ అభ్యర్థి కొప్పుల రాజు, రాజస్థాన్‌కు చెందిన శంకర్‌యాదవ్, కర్ణాటకకు చెందిన ధరమ్‌సేన్, కేంద్ర ఎస్సీ కమిషన్ మాజీ సభ్యురాలు కమలమ్మ, డాక్టర్ పల్లంరెడ్డి యశోదర పాల్గొన్నారు.

న్యాయవాదుల బార్‌లో ప్రచారం

నెల్లూరు (లీగల్), మే 9 : కాంగ్రెస్ పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి కొప్పుల రాజు, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఫయాజ్, నెల్లూరు సిటీ సీపీఎం అభ్యర్థి మూలం రమేష్ గురువారం మధ్యాహ్నం నెల్లూరు న్యాయవాదుల బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులను కలిసి ఓటు అభ్యర్థించారు. రాజు మాట్లాడుతూ తాను జిల్లా కలెక్టర్‌గా చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. తమను గెలిపిస్తే ప్రజా సమస్యలు పరిష్కరించి వారికి సేవ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సుభానీ, డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్ రెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై

సాయం చేసే వీపీఆర్ కావాలా..
దోచుకునే విజయసాయిరెడ్డి కావాలా?

- సొంతూరుకూ నీరివ్వలేని వ్యక్తి ఆయన
- సాయిరెడ్డితో ముస్లింలు అప్రమత్తంగా ఉండాలి
- డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్

నెల్లూరు (వ్యవసాయం/క్రైం), మే 9 : పది మందికి సాయం చేసే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (వీపీఆర్) కావాలా... రాజ్యసభ సభ్యుడిగా ఉన్నా సొంత గ్రామానికి కూడా ఏమీ చేయని విజయసాయిరెడ్డి కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని తెలుగుదేశం పార్టీ నేత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ అన్నారు. నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విజయసాయి రెడ్డి సొంత గ్రామమైన తాళ్లపూడి గ్రామస్థులు మంచినీళ్లు తాగుతున్నారంటే అది వీపీఆర్ వల్లేనని చెప్పారు. సొంతూరుకి కనీసం తాగునీరు కూడా ఇవ్వని సాయిరెడ్డి నెల్లూరును అభివృద్ధి చేస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. విశాఖలో సాయిరెడ్డి భూకబ్జాలు చేశారని, అదే వీపీఆర్ నెల్లూరులో కులమతాలకు అతీతంగా సేవ చేస్తున్నారని తెలిపారు. సాయిరెడ్డి తనను రౌడీషీటర్ అన్నారని తనపై ఎలాంటి కేసులే లేవని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ వద్ద కూడా సాయిరెడ్డి హడావిడి చేశారని ఆరోపించారు. 'నారాయణ అనుచరుడు వేమిరెడ్డి పటాభిరామిరెడ్డికి పోలింగ్ కేంద్రాల వద్ద ఏం పని, అధికారులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారు. ఫిర్యాదులు చేస్తున్నా చర్యలు తీసుకోవడం లేదంటూ విజయసాయి ఆరోపణలు చేశారన్నారు. అయితే, సీఎం తర్వాత ఆ స్థాయి అని చెప్పుకునే విజయసాయి వంటి వారు మాట్లాడే ముందు నిజానిజాలు ఏమిటో తెలుసుకోవాలని హితవు పలికారు. స్వతంత్ర అభ్యర్థి రవికుమార్‌కు పట్టాభి చీఫ్ ఎలక్షన్ ఏజెంట్‌గా ఉన్నారని, ఆయన ఏ చోటకు అయినా వెళ్లొచ్చనే కనీస పరిజ్ఞానం లేకుండా సాయిరెడ్డి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇక ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్‌భగత్‌ను కలిసిన సాయిరెడ్డి వైసీపీ పార్లమెంటరీ నేతగా ముస్లిం పెద్దలను మాత్రం కలవలేదని విమర్శించారు. ఎన్నికలు రావడంతో ముస్లింలపై ప్రేమ ఒలకబోస్తున్నారని, ముస్లింలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.



విలేకరులతో రూప్‌కుమార్

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), మే 9 : నగరంలోని కొండాయపాళెం గేటు వద్ద గురువారం రైలు ఢీ కొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 60 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడని, మృతదేహంపై బ్లూ కలర్‌పై బ్రౌన్ కలర్ డిజైన్ ఫుల్ హ్యాండ్స్ షర్టు, బ్లూ కలర్ కాటన్ షార్ట్ ఉన్నాయని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ హరిచందన కోరారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం, నగదు చోరీ

నెల్లూరు(క్రైం), మే 9: ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నగరంలోని పోస్టల్‌కాలనీ ఆరో వీధిలో మీనాకుమారి నివాసం ఉంటున్నారు. ఆమె తన సోదరి సంధ్యతో కలిసి ఇటీవల రాపూరు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు మీనాకుమారి ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలోని రూ.50 వేల నగదు, 8 సవర్ల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. గురువారం ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు యజమానికి ఫోన్‌చేసి సమాచారం అందించారు. ఆమె ఇంటికి చేరుకుని పరిశీలించారు. చోరీ ఘటనపై దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు.



పెండింగ్‌లో ఫినిషింగ్ పనులు

● వెంకటగిరి పట్టణంలో 1824 టిడ్కో ఇళ్ళు మంజూరయ్యాయి. అందులో 1156 ఇళ్ళను పూర్తి చేసి ఈ ఏడాది జనవరిలో లబ్ధిదారులకు కేటాయించారు. ప్రస్తుతం లబ్ధిదారులు ఆ ఇళ్ళలోనే నివాసముంటున్నారు. మిగిలిన 668 ఇళ్ళకు సంబంధించిన నిర్మాణ పనులు వివిధ దశల్లో వున్నాయి. కొన్ని పునాదుల వద్ద, మరికొన్ని పూర్తయి ఫినిషింగ్ పనులు పెండింగులో వున్నాయి. లబ్ధిదారులు నివాసముంటున్న భవనాల వద్ద కనీసం రోడ్డు సదుపాయం గానీ, పారిశుధ్య నిర్వహణ గానీ చేపట్టడం లేదు. అధ్వానకర పరిస్థితుల నడుమ లబ్ధిదారులు నివాసముంటున్నారు.

పునాదుల వద్దే ఆగిపోయిన నిర్మాణాలు



నిర్వహణ లేక అధ్వానంగా వున్న ఇళ్ళు



గూడూరులో ఇళ్ల నడుమ పిచ్చిమొక్కలు

టిడ్కో ఇళ్ళకు జగన్ గ్రహణం

●తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని లబ్ధిదారులకు ఏర్పేడు మండలం వికృతమాల వద్ద 1800 టిడ్కో ఇళ్ళు నిర్మాణమయ్యాయి. 2018లోనే లబ్ధిదారులకు కేటాయించినా అప్పట్లో లబ్ధిదారులు నివాసం వుండడానికి రాలేదు. 2019 ఆగస్టులో ఇళ్ళను స్వాధీనం చేసుకుని కాపురాలు వచ్చినా మౌలిక సదుపాయాలు లేక తిరిగి తిరుపతికి వెళ్ళిపోయారు. ప్రస్తుతం 300 కుటుంబాలు మాత్రమే నివాసముంటున్నాయి. పారిశుధ్య నిర్వహణ లేదు. తాగునీటి పైపు లైను మరమ్మతులకు గురైంది.లబ్ధిదారులు చందాలు వేసుకుని నిర్వహణ పనులు చేసుకుంటున్నారు. బస్సు సదుపాయం లేదు. సాయంత్రమైతే గంజాయి, మందుబాబులు ఖాళీగా వున్న సముదాయాల్లోకి చేరుకుని భయానక వాతావరణం సృష్టిస్తున్నారు.



నిర్వహణ లేని డ్రైనేజీ కాలువ



మరమ్మతులకు గురైన తాగునీటి పైపు లైన్



లబ్ధిదారులు నివాసం లేక ఇళ్ళలో ఊడిపోయిన తలుపులు

తిరుపతి, మే 9 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబుపై కక్షతో ఆయన హయాంలో శ్రీకారం చుట్టిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం పాడుపెట్టింది.పట్టణ పేదలకు పక్కా ఇళ్ల అందించాలన్న లక్ష్యంతో గత తెలుగు దేశం ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించారు.జగన్ సర్కారు వచ్చాక మిగిలినవాటికి గ్రహణం పట్టింది. ఎక్కడి నిర్మాణాలను అక్కడ ఆపేసింది. 90 శాతం పనులు జరిగిన నిర్మాణాలను కూడా పూర్తి చేయకుండా గాలికి వదిలేసింది. దీంతో చాలా చోట్ల టిడ్కో ఇళ్ల సముదాయాలు ముళ్ల చెట్ల పొదలతో నిండిపోయాయి.తిరుపతి కార్పొరేషన్, వెంకటగిరి, గూడూరు, సూళ్ళూరుపేట, నాయుడుపేట, శ్రీకాళహస్తి, పుత్తూరు పట్టణాల్లో ఎక్కడా పూర్తిస్థాయిలో టిడ్కో ఇళ్ళ నిర్మాణం పూర్తి కాలేదు. ఒకటి రెండు చోట్ల దాదాపు పూర్తయినా లబ్ధిదారులకు ఇళ్ళు కేటాయించలేదు. అరకొరగా కాపురాలకు చేరిన లబ్ధిదారులు సైతం మౌలిక సదుపాయాలు లేక ఇళ్ళు ఖాళీ చేస్తున్నారు.

●గూడూరులో 5120 టిడ్కో గృహాలు నిర్మించగా వాటిలో 2800 గృహాలను మాత్రమే లబ్ధిదారులకు స్వాధీనం చేశారు. అయితే టిడ్కో ఇళ్ళ సముదాయాలకు తాగునీటి సరఫరా లేదు. ట్యాంకర్లు వచ్చినపుడు నీరు పట్టుకోవాల్సి వస్తోంది. పారిశుధ్య నిర్వహణ కూడా లేదు. భవనాల నడుమ పిచ్చిమొక్కలు పెరిగిపోయి అడవిని తలపిస్తున్నాయి. విషసర్పాల బెడద కూడా అధికంగా వుంది. దీంతో 2800 కుటుంబాల్లో 1200కుటుంబాలు టిడ్కో ఇళ్ళను విడిచిపెట్టి వెళ్ళిపోయాయి. ఇపుడు 1600 కుటుంబాలు మాత్రమే సమస్యలతో సహవాసం చేస్తూ అగచాట్లు పడుతున్నాయి. నివాసం లేని మిగిలిన ఇళ్ళు నిర్వహణ లేక తలుపులకు చెదలుపట్టి ఊడిపోతున్నాయి.

ట్యాంకరు నుంచీ నీరు పట్టుకుంటున్న లబ్ధిదారులు →





●నాయుడుపేట పట్టణంలో 2064 టిడ్కో ఇళ్ళు నిర్మాణమయ్యాయి. 60 శాతం ఇళ్ళ నిర్మాణం పూర్తయింది. టైల్స్, విద్యుదీకరణ, ప్లంబింగ్, తాగునీటి పైప్‌లైన్ పనులు, అంతర్గత రోడ్లు, డ్రైయినేజీ పనులు పెండింగులో వున్నాయి. ఇళ్ళు ఎవరికీ ఇంకా కేటాయించలేదు.

●సూళ్ళూరుపేట పట్టణంలో 1632 టిడ్కో ఇళ్ళు నిర్మిస్తున్నారు. 70 శాతం పనులు పూర్తయ్యాయి. లబ్ధిదారులకు ఇంకా కేటాయించలేదు. కొన్ని బ్లాకులు పునాదుల వద్దే ఆగిపోయాయి.

●శ్రీకాళహస్తి పట్టణంలో 6109 టిడ్కో ఇళ్ళు నిర్మాణమయ్యాయి. కానీ లబ్ధిదారులకు కేటాయించలేదు. ఇళ్ళన్నీ నిర్వహణ లేక దెబ్బ తింటున్నాయి. తలుపులు, కిటికీలు దెబ్బతిన్నాయి.

లబ్ధిదారులకు కేటాయించని ఇళ్ళ దుస్థితి →

20వేల ఓటరు స్లిప్పుల గల్లంతు?

● విచారణకు ఆదేశించిన కలెక్టర్

తిరుపతి(నేరవిభాగం), మే 9 : తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన 20వేల ఓటరు స్లిప్పులు గురువారం గల్లంతైనట్లు సమాచారం.తిరుపతి ఎన్నికల రిటర్నింగ్ అధికారి అదితిసింగ్ ఈ విషయాన్ని జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేయడంతో అంతర్గత విచారణకు ఆదేశించారు. ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమం బుధవారం ముగిసింది.పంపిణీ కాకుండా మిగిలిన ఓటరు స్లిప్పులను రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో బీఎల్వోలు సమర్పించాలి. ఇలా సమర్పించిన 60 వేల ఓటరు స్లిప్పుల్లో 20వేల దాకా గల్లంతైనట్లు తెలియడంతో అప్రమత్తమైన రిటర్నింగ్ అధికారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు.ఈ విషయమై తిరుపతి అర్బన్ తహసిల్దార్ నారాయణరెడ్డిని వివరణ కోరగా 20 వేల ఓటరు స్లిప్పులు గల్లంతు కాలేదని, ఓ బీఎల్వో వద్ద వున్న 70 ఓటరు స్లిప్పులను గుర్తు తెలియని వ్యక్తులు బయట పారేశారన్నారు.వాటిని తిరిగి తెచ్చి భద్రపరిచారన్నారు.

56వేల ఓటర్ స్లిప్పులను బయటపెట్టాలి

ఆరణి శ్రీనివాసులు డిమాండ్

తిరుపతి, మే 9 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో పంపిణీ చేయకుండా వెనక్కి వచ్చిన 56వేల ఓటర్ స్లిప్పులను వెంటనే బహిర్గతం చేయాలని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మార్చినెలలో ప్రస్తుత ఆర్వోనే కార్పొరేషన్ కమిషనర్‌గా, ఇదే బీఎల్వోలు పనిచేశారని గుర్తుచేశారు. కేవలం వైసీపీకి అధికారులు కొమ్ముకాయడం వల్లే 56వేల ఓటర్ స్లిప్పులు వెనక్కి వచ్చాయని మండిపడ్డారు. వెనక్కి వచ్చినవన్నీ దొంగ ఓటర్లవేనని, ఆ లిస్టును బహిరంగ పరచాలని కోరారు. ఎన్నికల సంఘం ఫిబ్రవరి, మార్చిలోపు దొంగ ఓట్ల తొలగింపునకు అవకాశం ఇచ్చినా అధికారులు ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. దేశంలోనే 16 అత్యంత సమస్యాత్మక నియోజకవర్గాల్లో ఒకటిగా ఉన్న తిరుపతిలో గత ఎన్నికల్లోనే 174 పోలింగ్ కేంద్రాల్లో బలగాలను నియమిస్తే, ప్రస్తుతం కేవలం 40 కేంద్రాల్లోనే బలగాలను ఏర్పాటు చేయడం వైసీపీకి మేలు చేయడానికేనని ఆరోపించారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు స్పందించి, తిరుపతిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాలను మోహరింపజేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు పుత్తూరుకు జగన్

పుత్తూరు అర్బన్, మే 9: సీఎం జగన్ శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు పుత్తూరులో నిర్వహించనున్న ఎన్నికల ప్రచార సభకు హాజరు కానున్నారు. పట్టణంలోని కాపువీధి జంక్షన్ వద్ద సభ జరిగే ప్రదేశాన్ని ఎస్పీ విక్రమ్ పాటిల్ గురువారం పరిశీలించి పలు సూచనలు చేశారు.ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద జగన్ దిగేందుకు వీలుగా హెలిప్యాడ్ నిర్మిస్తున్నారు.జగన్ సభ విజయంతం చేసేందుకు నగరి నుంచే కాకుండా సత్యవేడు, జీడీ నెల్లూరు నియోజకవర్గాల నుంచి కూడా వైసీపీ నేతలు జనసమీకరణ చేస్తున్నట్లు తెలిసింది.

రేపు చిత్తూరులో చంద్రబాబు సభ

చిత్తూరు సిటీ, మే 9: చిత్తూరులో శనివారం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఎన్నికల ప్రచార సభ ఉంటుందని ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు మెసానికల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ఈ సభ ఏర్పాట్లను ఆ పార్టీ నేతలు పర్యవేక్షిస్తున్నారు.


ముగిసిన పోస్టల్ బ్యాలెట్

● ఓటు హక్కు వినియోగించుకున్న 17,774 మంది ఓటర్లు

తిరుపతి(కలెక్టరేట్), మే 9: ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు, అత్యవసర సేవల్లో ఉన్నవారు గడిచిన ఐదు రోజులకుగాను 17,774మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం 17,867మంది దరఖాస్తు చేసుకోగా 17,774మంది వినియోగించడంతో 99.45శాతం ఓటింగ్ నమోదైనట్లు జిల్లా అధికారులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం వరకు ఏడు నియోజకవర్గాలో పోస్టల్ బ్యాలెట్ కొనసాగింది. చివరి రోజున 249మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇతర జిల్లాలో ఓటు హక్కు కలిగి జిల్లాలో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న 5,458మందికిగాను 4,352మంది గురువారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. హోం ఓటింగ్ రెండ్రోజుల కిందట వరకు 1,077 ఓటు హక్కు వినియోగించుకున్నారు. 85ఏళ్ల దాటి వృద్ధులు, పోలింగ్ కేంద్రాలకు రాలేని దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటు వినియోగించుకునేందుకు ఈనెల 12వ తేదీ గడువు పొడగించినట్లు జిల్లా అధికారులు తెలిపారు.

ఆర్.కృష్ణయ్యపై రాయితో దాడి

● వీపుపై తగిలి కమిలిన చర్మం



రాయిని చూపిస్తున్న కృష్ణయ్య (ఇన్‌సెట్‌లో) కమిలిన చర్మం

ఏర్పేడు, మే 9 : బీసీ నేత, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యపై గుర్తు తెలియని వ్యక్తి రాయి విసిరిన ఘటన ఏర్పేడులో గురువారం రాత్రి జరిగింది.వైసీపీ తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. రోడ్‌షోలో భాగంగా వాహనంపై నించుని ప్రసంగిస్తుండగా వెనుకవైపు నుంచీ చీకట్లో గుర్తు తెలియని వ్యక్తి విసిరిన రాయి కృష్ణయ్యకు వీపుపై తాకి స్వల్పంగా కమిలింది. దీంతో కృష్ణయ్య తనకు తగిలిన రాయిని ప్రజలకు చూపిస్తూ ప్రజల కోసమే పుట్టిన తనపై దాడి సమంజసం కాదని, ఇది పిరికిపంద చర్య అని అన్నారు.అనంతరం ప్రచారం ముగించి శ్రీకాళహస్తి వెళ్ళారు. ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాక అక్కడే మీడియా సమావేశంలో మాట్లాడారు.ఇది తనపై జరిగిన దాడి కాదని,బీసీలపై జరిగిన దాడి అని కృష్ణయ్య పేర్కొన్నారు.ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి మాట్లాడుతూ కృష్ణయ్యకు తగిలిన రాయి తర్వాత తన పొట్టకు తగిలిందన్నారు.ఇదంతా టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి పనే అని ఆయన ఆరోపించారు.అయితే బీసీలను రెచ్చగొట్టేందుకు వైసీపీ నేతలు కావాలనే కుట్రపూరితంగా రాయి దాడి డ్రామా ఆడించారని టీడీపీ వర్గీయులు ఆరోపిస్తున్నారు.



మద్యం దుకాణాలు కిటకిట

పాకాల, మే 9 : ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలు మందుబాబులతో కిటకిటలాడుతున్నాయి. పాకాల మండలంలో ఉదయం దుకాణం తెరవక ముందే మద్యం కొనుగోలుకు దుకాణాల ముందు పడిగాపులు పడుతున్నారు. ఉదయం 11 గంటలకు విక్రయాలు ప్రారంభించి రెండు మూడు గంటల్లోనే టార్గెట్ అమ్మకాలు పూర్తి కావడంతో సిబ్బంది దుకాణాలు మూసేస్తున్నారు. దీంతో బ్లాక్‌లో అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. మద్యానికి ఏర్పడిన డిమాండుతో ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది కొంతమంది అధిక ధరలకు బ్లాక్‌లో విక్రయించి దండుకుంటున్నారు.ఓ కేస్ మద్యానికి 500-1000రూపాయల వరకు అధిక ధరకు అమ్ముకుంటున్నారు.పోలింగు తేదీ దగ్గరపడుతుండడంతో రాజకీయ నాయకులు ఓటుకు క్వార్టర్ బాటిల్‌తో పాటు కేజీ చికెన్ పంపిణీ చేస్తుండడంతో చికెన్ దుకాణాల్లో కోళ్ల ఖాళీ అయిపోతున్నాయి.

మద్యం... వైసీపీపరం

పుత్తూరు అర్బన్, మే 9: నగరి నియోజకవర్గ పరిధిలోని మద్యం దుకాణాలు స్టాక్ లేక బోసిపోతున్నాయి.కొన్నిచోట్ల మద్యం షాపుల్లో పనిచేసే సిబ్బందిని లోబర్చుకున్న అధికార పార్టీ నాయకులు దుకాణం తెరిచిన వెంటనే స్టాక్ తీసుకెళ్లిపోతున్నారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా గతేడాది ఇదేరోజు సాగించిన విక్రయాలకు సమానమైన మద్యాన్ని మాత్రమే దుకాణాల్లో విక్రయించాలి.ఎన్నికల సీజన్ కావడంతో మద్యానికి విపరీతమైన డిమాండ్ నెలకొంది. గత ఏడాది విక్రయాల ఆధారంగానే స్టాక్ సరఫరా చేస్తుండడం, వైసీపీ నేతల హస్తలాఘవంతో మద్యం దుకాణాలు తెరిచిన వెంటనే మూతపడుతున్నాయి.

చీప్ లిక్కర్‌కు డిమాండ్

● స్టాకు లేక వెలవెలబోతున్న దుకాణాలు

తిరుపతి(నేరవిభాగం), మే 9: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు మూడ్రోజులే సమయం ఉండటంతో మద్యం దుకాణాలు కళకళలాడుతున్నాయి. ప్రధానంగా చీప్ లిక్కర్ కోసం మందుబాబులు ఎగబడుతున్నారు. జిల్లాలోని రెండు ఎక్సైజ్ డివిజన్ల పరిధిలో దాదాపు 253 మద్యం షాపులున్నాయి. వీటి ద్వారా రోజుకు రూ.3.5 లక్షల వరకు వ్యాపారం జరుగుతోంది. ప్రస్తుతం చీప్ లిక్కర్ బ్రాండ్లు ఉన్న షాపులు మాత్రం కిటకిటలాడుతున్నాయి.మరోవైపు తిరుపతితోపాటు నాయుడుపేట, గూడూరు, శ్రీకాళహస్తి, సత్యవేడు తదితర ప్రాంతాల్లో అవసరమైన బ్రాండెడ్ మద్యం లేకపోవడం, స్టాకులో కోత ఉండటంతో చాలాచోట్ల దుకాణాలు వెలవెలపోతున్నాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే తిరుపతిలోని సత్యనారాయణపురం, దేవేంద్ర థియేటర్ రోడ్డు, శ్మశానం సర్కిల్, రాజీవ్ గాంధీ కాలనీ, జీవకోన, డీబీఆర్ రోడ్డు వద్ద ఉన్న దుకాణాల్లో స్టాకు లేక గురువారం మధ్యాహ్నం 11గంటలనుంచే బోసిపోయాయి. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు తిరుపతిలోని మొత్తం దుకాణాల్లో కేవలం రూ.లక్ష వ్యాపారం కూడా జరగలేదని తెలిసింది.

మూడ్రోజుల సెలవుతో సప్లై కంట్రోల్ చేశాం

ఎన్నికల ఆంక్షలు ఉండడంతో ఈనెల 11 సాయంత్రం 5 గంటల నుంచి 13 సాయంత్రం 5 గంటల వరకు జిల్లాలోని అన్ని బార్లు, ప్రభుత్వ మద్యం దుకాణాలు మూసి వేస్తున్నాం. దీంతోపాటు షాపులన్నీ తాత్కాలిక భవనాల్లో ఉండటం వల్ల ఎన్నికల్లో అనుకోని ఘటనలు జరిగితే ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే సప్లై కంట్రోల్ చేశాం. గత ఏడాది మేలో విక్రయించిన స్టాకు కంటే 10 శాతానికి మించి విక్రయాలు జరగకూడదన్న ఆంక్షలతో దుకాణాల్లో స్టాకు అయిపోయి, వెలవెల పోతున్నాయి.

- జానకిరాం,ఎక్సైజ్ సూపరింటెండెంట్

ఆంధ్రజ్యోతి **సిత్రాలు**

అక్కా.. ఈ తమ్ముడికే ఓటెయ్!



కలిగిరిలో మహిళలతో కరచాలనం చేస్తూ ఓటు అభ్యర్థిస్తున్న ఉదయగిరి అభ్యర్థి కాకర్ల సురేష్

కుర్రకారు జోష్



అల్లూరులో టీడీపీ ప్రచారంలో యువకుల ఉత్సాహం

దిష్టి పోవాలా.. మా నేతలు గెలవాలా!



అల్లూరులో టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి, కావ్యలతోపాటు బీద రవిచంద్ర ఉన్న వాహనానికి దిష్టి తీస్తున్న ఓ కార్యకర్త

జగమంత కుటుంబం నాది !



టీడీపీలో చేరిన వారితో నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ఏం తాతా..చేయికి ఏమైంది ?



మర్రిపాడులో వృద్ధుడిని పలకరిస్తున్న ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం కుమార్తె కైవల్యారెడ్డి. పక్కన నాయకురాలు శాంతాకుమారి

ఇదిగో..ఇక్కడే సైకిల్ గుర్తు.. ఈ బటన్ నొక్కాలి!



నెల్లూరు నగరంలో నమూనా ఈవీఎం యంత్రాన్ని చూపిస్తూ ఓటు వేయాలని కోరుతున్న టీడీపీ నేత వినోద్ కుమార్



నెల్లూరులో ఆందోళన చేస్తున్న న్యాయవాదులు (ఫైల్)

ప్రభుత్వం దయాదాక్షిణ్యాలపై భూ యాజమాన్య హక్కు

నల్లచట్టంపై పెల్లుబికుతున్న ఆగ్రహం

అయినా అమలుకే జగన్ అడుగులు

ఘోషిస్తున్నా

చెవికెక్కదే..!

ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో సామాన్యులకు ఉరే!

ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో ప్రజలను తమ చేతిలో కీలుబొమ్మలుగా మార్చేందుకు వైఎస్. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అతిపెద్ద కుట్రకు తెర తీసింది. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా, ప్రజల హక్కులను హరించేలా ఎలాంటి చర్చ లేకుండా తీసుకొచ్చిన ఈ చీకటి చట్టంపై అన్నివ ర్గాల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. గతనెల 9న రాష్ట్రంలోని 16 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో తక్షణం ల్యాండ్ టైటిలింగ్ యాక్టు నిబంధనలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. అంటే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు అమలులోకి వచ్చేసినట్లే. ఈ చట్టాన్ని నిలిపివేయాలని భూ యజమానులు ఘోషిస్తున్నా.. న్యాయవాదులు నిరసనలు వ్యక్తం చేస్తున్నా... ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నా... జగన్ మాత్రం వెనుకడుగు వేయడం లేదు. ఈ చట్టాన్ని ఎక్కడా అమలు చేయటం లేదని హైకోర్టుకు సైతం ప్రభుత్వం తప్పుడు సమాచారం ఇచ్చింది.

- కందుకూరు/ నెల్లూరు (లీగల్)

ఆశాభావంతో ఉన్నాం..



ల్యాండ్ టైటిలింగ్ ఆఫీసర్ అంటున్నారే... కానీ అతని క్వాలిఫికేషన్ ఏమిటి, ఎంత పరిధికి ఒక టైటిలింగ్ అధికారి ఉంటాడన్నది ప్రభుత్వం చెప్పటంలేదు. అంటే టైటిలింగ్ అధికారులుగా తమ చెప్పుచేతుల్లో ఉండేవారిని నియమించుకునే ప్రమాదం లేకపోలేదు. కేంద్రం తెచ్చిన చట్టమైతే అనుమ తించేందుకు కేంద్రం ఇప్పటికి మూడుసార్లు ఎందుకు తిరస్కరించింది. టీడీపీ అధికారంలోకి వస్తే ఈ చట్టాన్ని రద్దుచేస్తామని చంద్రబాబు ప్రకటించినందున ఆశాభావంతో ఉన్నాం.

- కేవీ లక్ష్మీనారాయణ, సీనియర్ న్యాయవాది, కందుకూరు

విస్తృత చర్చ జరగాలి..



ఏదైనా చట్టాన్ని ప్రవేశపెట్టేముందు విస్తృత చర్చ జరగాలి. ప్రజాభిప్రాయ సేకరణ జరగాలి. వచ్చే అభ్యంతరాలపై మరింత లోతుగా అధ్యయనం చేసి మార్పులు చేర్పులు చేశాకే చట్టరూపం ఇవ్వాలి. ఇదేమీ జరగకుండా ఈ నల్లచట్టం తెచ్చారు. ఈ చట్టాన్ని రద్దుచేయాలి.

- సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు, కందుకూరు బార్ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు

తక్షణం రద్దు చేయాలి



ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను తీసుకువచ్చి, భూవివాదాలను సివిల్ కోర్టుల పరిధి నుంచి రెవెన్యూ యంత్రాంగానికి అప్పగించడమంటే ప్రజలకు అన్యాయం చేయడమే అవుతుంది. ఈ చట్టం అమలైతే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఈ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి.

- పెళ్ళకూరు చంద్రికాదేవి, న్యాయవాది, నెల్లూరు

గ్రామాల్లో కక్షలు పెరుగుతాయి



ఈ చట్టం అమలైతే గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాలు పెరిగిపోతాయి. ప్రశాంత వాతావరణంలోని గ్రామసీమలు నిత్యం రావణ కాష్టంలా మారుతాయి. ఈ చట్టం వల్ల పాలకులకు ఉపయోగమే తప్ప ప్రజలకు ఉపయోగం లేదు. ఏ పార్టీ అధికారంలో ఉంటే అ పార్టీ కనుసన్నల్లో ప్రజలు ఉండాల్సి వస్తుంది. తక్షణమే ఈ చట్టాన్ని రద్దు చేయాలి.

- యస్‌కె. యజ్దాని, న్యాయవాది, నెల్లూరు

గ్రామాల్లో చిచ్చురేపుతుంది..



ఈ చట్టం గ్రామాల్లోని చిన్న, సన్నకారు రైతుల్లో చిచ్చు రేపుతుంది. ఏళ్ల తరబడి ప్రశాంతంగా జీవిస్తున్న రైతుల మధ్య ఈ చట్టం అగాథం ఏర్పడుతుంది. ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉంటే వారికి అనుకూలంగా మారుతుంది. ఎవరికి పలుకుబడి ఉంటే వారే భూములపై అధిపత్యం కొనసాగిస్తారు. ఈ చట్టాన్ని తక్షణం రద్దు చేయాలి.

- మద్దిబోయిన సుందరయ్య యాదవ్, నెల్లూరు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

రైతుకు ఉరే..



ల్యాండ్ టైటిలింగ్ యాక్టు వస్తే రైతుకు ఉరే. అనాదిగా భూమినే నమ్ముకుని జీవిస్తున్న మాలాంటి కుటుంబాలకు ఈ చట్టం గురించి వింటుంటేనే ఆందోళనగా ఉంది. పెట్టుబడికి, కుటుంబ అవసరాలకు అప్పు కావాలన్నా, బిడ్డల పెళ్లిళ్ల చేయాలన్నా మాకు భరోసా ఇచ్చేది భూమి మాత్రమే. ఆ భూమిపైనే హక్కులు ప్రశ్నార్థకమైతే ఇక మా పరిస్థితి ఏమిటి ?

- అమ్మనబ్రోలు ప్రసాదరావు, రైతు, కొల్లూరుపాడు బీసీ కాలనీ, ఉలవపాడు మండలం

దుర్మార్గమైన చట్టం



ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ దుర్మార్గమైన చట్టం. ఇది అమల్లోకి వస్తే సామాన్యులు తమ భూసమస్యలను నివృత్తి చేసుకునేలోపే వారి జీవిత కాలం ముగుస్తుంది. ప్రజలకు ఇది ఏ మాత్రం క్షేమదాయకమైన చట్టం కాదు. దీని రద్దు కోసం న్యాయవాదులు మూడు నెలలపాటు ఉద్యమం చేశారు. అనాడు ప్రజలకు ఇది అర్థం కాలేదు. ఇప్పటికైనా ప్రజలు ఈ చట్టాన్ని అర్థం చేసుకోవాలి. ధరణి పోర్టల్ కేసీఆర్ కొంప ముంచింది. ల్యాండ్ టైటిల్ యాక్టు జగన్ నడ్డివిరిచేస్తోంది.

- వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, న్యాయవాది, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్, నెల్లూరు

ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలి



ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై న్యాయవాదులు అరు నెలలపాటు సమ్మె చేశారు. ఈ సమస్యపై రైతులకు, ప్రజలకు అవగాహన లేదు. ఎన్నికల సమయంలో ఈ యాక్ట్‌పై విస్తృత చర్చ జరుగు తుంది. దీనివల్ల కలిగే నష్టాల ను ప్రజలు గుర్తిస్తున్నారు. ఈ యాక్ట్‌లోని వాస్తవాలను ప్రజలు తెలుసుకోవాలి.

- నాపూరు శ్రీధర్, మాజీ బార్ అసోసియేషన్ కార్యదర్శి

ఎన్నికల వేళ.. ఆర్టీసీ ఫుల్

రైట్.. రైట్



ఈ నెల 13న జరగనున్న పోలింగ్‌లో ఓట్లు వేసేందుకు వచ్చేవారితో ఇప్పటికే బస్సులన్నీ ఫుల్ అయ్యాయి. వలసవాసులు ముందుగానే రిజర్వేషన్లు చేయించుకున్నారు. ఉదయగిరి డిపో నుంచి బెంగళూరు, హైదరాబాదు, చెన్నై, విజయవాడ, ఆర్మూర్, కోరుట్ల తదితర ప్రాంతాలకు బస్సులు నడుపుతున్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ అధికారులు ఈ ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులను కూడా నడుపుతున్నారు. అయితే ఆయా మార్గాల్లో తిరిగే బస్సులకు రిజర్వేషన్లు ఫుల్ అవడంతో ప్రయాణికులు అయోమయంలో పడ్డారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇప్పటికే వారితో సంప్ర దింపులు జరిపి, వారు వచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. రిజర్వేషన్లు చేసుకొన్న వారి సంగతి అటుంచితే రిజర్వేషన్లు చేయించుకోని వారికి ఆయా పార్టీల నాయకులు ప్రత్యేక వాహనం ఏర్పాటు చేయడంతోపాటు రానుపోను ఖర్చులు, భోజనాలు సమకూర్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.


● ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీ

ఎన్నికల నేపథ్యంలో ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు భారీస్థాయిలో దోచుకునేందుకు రెడీ అయ్యారు. సాధారణ టికెట్ కంటే ప్రయాణికుల నుంచి మూడింతలు వసూలు చేసేందుకు వారు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

- ఉదయగిరి రూరల్

టెండర్ ఓటు అంటే ?

ఒక్కోసారి ఓటు వేయడానికి వచ్చేసరికి మీ ఓటు వేసేశారు అని ఎన్నికల సిబ్బంది చెబుతారు. అంటే ఆ ఓటు ఇంకెవరో వేసి వెళ్ళిపోయారన్నమాట. ఇటువంటి సమయంలో ఓటరు తన హక్కును వినియోగించుకోవడానికి తన ఓటు తనే వేస్తానని పట్టుబట్టవచ్చు. ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయచ్చు. వాస్తవంగా ఓటు వేయలేదని నిర్ధారణకు వస్తే ఈవీఎం ద్వారా కాకుండా బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం ఇస్తారు. ఈ ప్రక్రియనే టెండర్డ్ ఓటు అంటారు. ఇందుకోసం ప్రతి పోలింగ్ బూత్‌లో 20 చొప్పున బ్యాలెట్ పేపర్లు అందుబాటులో ఉంచుతారు. ఇవి బ్యాలెట్ యూనిట్ పైన అమర్చిన వాటిలాగే ఉంటాయి. ఈ బ్యాలెట్‌ను తీసుకుని ఓటరు కంపార్టుమెంట్‌లోకి వెళ్ళి ఓటు వేసి ఆ పత్రాలు కవర్‌లో పెట్టి ప్రిసైడింగ్ అధికారికి అందజేస్తారు. ఆ బ్యాలెట్ పత్రం వెనుక ఇంక్(సిరా)తో టెండర్డ్ బ్యాలెట్ అని రాస్తారు. దీనిని లెక్కింపులో పరిగణనకు తీసుకుంటారు.



- నెల్లూరు

ఓటు వేయడం బాధ్యత

యువగళం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం నాకు కల్పించిన ఓటు హక్కును నేను మొదటి సారిగా ఈ ఎన్నికల్లో సద్వినియోగం చేసుకోబోతున్నా. ఓటు వినియోగించుకోవడం పౌరుడిగా నా బాధ్యత. ఎవరికి ఓటు వేయాలనేది నేను ముందుగానే నిర్ణయించుకున్నా. యువతతో నిండిన నా రాష్ట్రాన్ని ముందుకు నడిపించగలిగే సత్తా ఉన్న నాయకుడికే ఓటు వేస్తా. ఎన్ని పనులున్నా ఆ రోజు ఓటు వేస్తా.

- అడపాల మణికంఠ, కోలగట్ల, సంగం మండలం

బూత్‌లోనే ఓటేస్తా..!



నా వయసు 95 ఏళ్లు. అయినా సరే తగ్గేదేలే.... అంటుంది ఈ బామ్మ. ఈ సారి ఎన్నికల్లో కూడా తాను పోలింగ్ బూత్‌కు వెళ్లే ఓటేస్తానంటుంది ఈమే. ఇంటి వద్దే ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తామని అధికారులు తెలియచేసినా, తాను మాత్రం పోలింగ్‌బూత్‌కి వెళ్లి ఓటు వేస్తేనే తృప్తి కలుగుతుందని ఆమె తెలిపింది. అంతేకాక ఈ సారి ఎన్నికల్లో చంద్రబాబుకి ఓటేసి ఒకేసారి రూ.4వేలు పింఛన్ తీసుకుంటానని ఆమె చెప్పడం కొసమెరుపు.

- వంగపాటి సుబ్బమ్మ, పాతనాపురం, కలిగిరి మండలం

సెందరబాబొస్తే... బస్సుల్లో చాజ్జీలు రేవంటే !



ఏందిమే... శివమ్మా.. మన ఆడోళ్లకి బస్సులో చార్జీ లేదంటగదమే... నిజమేనా..?

అవునే కుమారి... మొన్నామధ్య మన ఊళ్లో తెలుగుదేశంపార్టీ ఆయన సెప్తే ఇదెంతవరకు నిజమోలే.. అనుకున్నామే... సెందరబాబు నిన్న టీవీలో సెప్తుంటే సూశా... ఆర్టీసీ బసులో ఆడోళ్లకి చార్జీ ఉండదంట... అంతే కాదుమే... ఇంకా సేలా మన ఆడోళ్లకి మంచి మంచి పథకాలు పెట్టాడుమే...

ఏంటేంటియిమే.. అయ్యా... 19ఏళ్లు వచ్చి 59ఏళ్లు దాటని ఆడోళ్లకు నెలకి పదేనొందల రూపాయలు డబ్బులిస్తాడంట... అంతేకాకుండా ఏమి డబ్బులు కట్టకుండా ఫ్రీగా సంవచ్చరానికి వంటొండుకునేదానికి మూడు సిలిండర్లు ఇస్తాడంటమే...

ఏంది ఏడాదికి మూడు సిలిండర్లా..! అబ్బో ... మూడు సిలిండర్లే... ఐతే నాకు సంవత్సరమంతా సరిపోతాయిమే... ఒక సిలిండరు నాకు నాలుగు నెలలు వస్తదిమే... అయితే మన వయసోళ్లకి నెలకి పదేనొందలు, మూడు సిలిండర్లు...

అంతేకాదుమే కుమారి... జగను అమ్మఒడి ఇయ్యిలా అది ఇంటికి ఒక్క పిల్లోడికే కదా ఇచ్చిందా... సెందర బాబు వస్తే ఇంట్లో ఇద్దరు పిల్లలు సదువుకుంటుంటే ఇద్దరికీ పదిహేనువేల చొప్పున ముప్పైవేలు ఇస్తాడంటమే...

ఓ అట్నా శివమ్మా...



నీకు తెల్దంటమే కుమారి...

తెలీదే శివమ్మా... మంచిమంచియే సెప్పినాడే సెందరబాబు మన పేదోళ్లకి...

అంతే కాదుమే పింఛిను కూడా ముసలోళ్లకి నెలకి నాలుగేలు... కన్ను, కాలు లేని ఇకలాంగులకి నెలకి ఆరేలు అంటమే...

పాపం పోనీలేమే ముసలోళ్లకి... కన్ను,కాలు లేనోళ్లకి పెంచాల్లేమే... అన్ని రేట్లు పెరిగి ముసలిపాయాన కొడుకులు సూడక కూలికి పోలేక పింఛినుతోనే బతికుతా ఉండారు... వాళ్లకి సెందర బాబు పింఛిను పెంచి మంచి పనిసేసాడుమే... ఐతే మనం తప్పకుండా సెందరబాబుకే ఓటేద్దామ్మే...

- జలదంకి

ఆటోవాలాల సంబరం

ఉపాధి దొరికింది !


ఎన్నికల సమయంలో ప్రధాన పార్టీలన్నీ ప్రచారం కోసం రకరకాల వాహనాలను సిద్ధం చేసుకుంటాయి. మండల పరిధిలో ఒక్కొక్క పార్టీకి కనీసం నాలుగు ఆటోలు, పోటీచేసే అభ్యర్థుల ఫొటోలు, పార్టీ గుర్తులతో ప్రచారవాహనాలుగా మారి, గ్రామగ్రామాన ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు తిరుగుతున్నాయి. దీంతో ఆటోవాలాలు తాము అభిమానిస్తున్న పార్టీకి తమ వాహనం ద్వారా ప్రచారం చేసిన సంతృప్తితోపాటు రోజుకు రూ.2వేలు అద్దెరూపంలో వస్తున్నదని సంబరపడిపోతున్నారు.

- కలిగిరి



7 ఆంధ్రజ్యోతి
తిరుపతి
జన కేతనం
www.andhrajyothy.com
శుక్రవారం 10 మే 2024

? మీ అబ్బాయికి ఓటెందుకెయ్యాలి భూమనా



అరాచక ముఠాల అడ్డాగా తిరుపతి

సందర్భానికి తగిన వస్త్రధారణ.. ఖణేల్‌మని మోగే గొంతు.. మాటల్లో మానవీయత.. తరచూ పుస్తకాల ప్రస్తావన.. పదేపదే గుర్తు చేసే ఎమర్జెన్సీ జైలు జీవితం.. మిలిటెంట్ ఉద్యమాల నేపథ్యం.. మఠాధిపతులకు పాద నమస్కారాలు.. విభిన్నమైన నాయకుడిగా తిరుపతి ప్రజలకు చిరపరిచితుడు భూమన కరుణాకరరెడ్డి. వైఎస్ రాజారెడ్డిని గుర్తు చేసుకుంటూ.. గురువుగా రాజశేఖర్‌రెడ్డి అండతో ఎదుగుతూ.. జగన్‌రెడ్డికి విధేయంగా ఉంటూ రాజకీయాలను బ్యాలెన్స్ చేసుకుంటున్న ఈయన.. వారసత్వ రాజకీయాలమీద నమ్మకం లేదంటూనే, తన కుమారుడు భూమన అభినయరెడ్డిని తిరుపతి శాసనసభ ఎన్నికల్లో పోటీకి దించారు. కొడుకును గెలిపించే బాధ్యత మొత్తం తన భుజాలమీద వేసుకుని ప్రచారంలో మునిగితేలుతున్నారు. అభివృద్ధి కావాలంటే అభినయ్‌కే ఓటేయాలని చెబుతున్నారు. ఇంతకీ ఈ ఐదేళ్లలో తిరుపతిలో జరిగిన అభివృద్ధి ఏమిటి...? ఆ అభివృద్ధిపై పరచుకున్న అనుమానపు నీడల్లో నిజానిజాలేమిటి.. అనే చర్చ ఎన్నికల వేళ తిరుపతి నగరంలో విస్తృతంగా జరుగుతోంది. విపక్షాలు చేస్తున్న ఆరోపణలు, విమర్శలు, సంధిస్తున్న ప్రశ్నలు, ప్రజల్లో వినిపిస్తున్న సందేహాలు.. ఇవి..

గంజాయివనం
ఎవరు కారకులు?

గతంలో భూమన కరుణాకర్‌రెడ్డి తిరుపతిని మద్యరహిత నగరంగా ప్రకటించాలంటూ మోకాటి లోతు నీళ్లలో నిరసన ప్రకటించారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సంగతే ఎత్తలేదు. ఎమ్మెల్యే అయ్యాక తిరుపతిలో గంజాయి విపరీతంగా పెరిగిపోయిందంటూ వీడియో కెమెరాలు వెంటబెట్టుకుని నగర శివార్లలో పాడుబడ్డ భవనాలు, రైలు పట్టాల వెంట పరుగులు తీసి హడావుడి చేశారు. ఆతర్వాత దాన్నీ ఆయన పట్టించుకోలేదు. విశేషం ఏమిటంటే ఆయన ఎమ్మెల్యే అయ్యాకే మద్యం విచ్చలవిడిగా పెరిగింది. నగరం గంజాయి వనంగా మారిందనే విమర్శలూ పెరిగాయి. నగరంలో గుట్కా, గంజాయి అమ్మకాలను కేంద్రీకృతం చేసి నెలనెలా భారీ మొత్తాలు దండుకుంటున్నారనే ఆరోపణలూ భూమన కుటుంబం ఎదుర్కోవాల్సి వచ్చింది. తులసివనంలాంటి తిరుపతి ఆధ్యాత్మికనగరంలో గంజాయి విశ్వరూపం చూసి ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

దొంగ ఓట్లు
వేళ్లన్నీ అభినయ్ వైపే

భారతదేశంలోనే అతి పెద్ద దొంగ ఓట్ల కుంభకోణం తిరుపతిలో జరిగింది. లోక్‌సభ ఉప ఎన్నికల్లో 34వేల ఫేక్ ఎపిక్ కార్డులను ఏకంగా ఎన్నికల వెబ్‌సైట్‌లోకే లాగిన్ అయ్యి డౌన్‌లోడ్ చేసుకున్నారని కేంద్ర ఎన్నికల సంఘమే ప్రకటించింది. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లూ బలవుతున్న ఈ కేసులో అసలు సూత్రధారి భూమన కుమారుడు అభినయరెడ్డి అని విపక్షాలు ఆరోపణ చేస్తున్నాయి. తిరుపతి ప్రతిష్ఠను తీవ్రంగా మంటగలిపిన ఉదంతంగా ఇది చరిత్రలో మిగిలిపోనుంది.

నిర్లక్ష్యం
గంగమ్మకే అపచారం

తిరుపతి ప్రజల విశ్వాసాలను కూడా గత ఐదేళ్లుగా కాలరాశారనే విమర్శలు పెరిగాయి. తిరుపతి గంగమ్మగుడి పునరుద్ధరణ పేరుతో మొత్తం గర్భగుడి సహా కూలగొట్టేసి, మూలవిరాట్‌ను గుడ్డలో చుట్టి ఆఫీసు భవనంలో పెట్టేసిన తీరు గంగమ్మ భక్తులను ఆవేదనకు గురిచేసింది. గంగ జాతర సంప్రదాయాలను కూడా మార్చేశారు. ఏ విషయంలోనూ స్థానికులను సంప్రదించలేదు. రాష్ట్ర పండుగ అంటూ జాతర నిర్వహణకు నిధులు ప్రభుత్వం నుంచి రాబట్టలేకపోయిన నాయకులు, స్థానిక వ్యాపారులను బాదేశారనే ఆరోపణలు వచ్చాయి. ఈ ఏడాది ఎన్నికల పేరులో ఏకంగా గంగజాతరనే వారం వెనక్కి నెట్టేశారు. అధికార నేతల దౌర్జన్యాలకు భయపడిన స్థానికులు ఈ అపచారాలన్నింటికీ గంగమ్మ లెక్కతేలుస్తుందని అంటుంటారు.

ఈ ప్రశ్నలకు బదులేది?

? 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సుగుణమ్మ 842 ఓట్లతో విజయం సాధించారని మీడియాలో వచ్చిన తర్వాత ఏం జరిగింది. 708 ఓట్లతో ఎలా గెలిచారు.

? కార్పొరేషన్ ఎన్నికల్లో ఏకగ్రీవాల వెనుక మీ బెదిరింపులు నిజం కాదా.

?టీటీడీ, కార్పొరేషన్ పనుల్లో పదిశాతం కమిషన్ నిజం కాదా.

? మేయర్ పదవిని బీసీలకు ఎరజూపి, డిప్యూటీ మేయర్ ముసుగులో కార్పొరేషన్‌ను గుప్పెట్లో పెట్టుకోవడం నిజం కాదా.

?టీడీపీ హయాంలో మొదలైన గరుడ వారధి పనులను కమీషన్‌ల కోసం నిలిపివేసింది నిజం కాదా.

? వీధి వీధిలో గంజాయి బ్యాచ్‌లను ప్రోత్సహిస్తున్నది వైసీపీ నాయకులు కాదా?

?2009, 2014 ఎన్నికల్లో కడప నుంచి రౌడీలను తెప్పించి అరాచకాలను సృష్టించింది భూమన కాదా.

మాస్టర్ ప్లాన్ రోడ్లు
టీడీఆర్ బాండ్ల పేరుతో కోట్ల కుంభకోణం

మాస్టర్‌ప్లాన్ రోడ్లంటూ నగర శివార్లలో నివాసాలు కూడా లేని ప్రాంతంలో విశాలమైన రోడ్లు వేశారు. ఆగమేఘాల మీద సాగిన ఈ రోడ్ల నిర్మాణంలో టీడీఆర్ బాండ్ల పేరుతో రూ.2000 కోట్లు భూమన నొక్కేశారని ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. ఎస్వీ యూనివర్శిటీనే చీలుస్తూ మూడు రోడ్లను వేయబోయిన వీరు, నగర ప్రజల వ్యతిరేకతతో వెనక్కి తగ్గాల్సివచ్చింది. కేవలం రూ.46 కోట్ల ఖర్చుతోనే 40 మాస్టర్‌ప్లాన్ రోడ్లు వేస్తున్నామంటూ ఢంకా మోగించి చెప్పినా.. ఈ రోడ్ల భూసేకరణ పేరుతో నష్టపరిహారం కింద రూ.1013 కోట్లు టీడీఆర్ బాండ్లుగా చెల్లించారు. తిరుపతి వైసీపీ అభ్యర్థి అభినయరెడ్డి మానస పుత్రికగా ప్రకటించిన ఈ మాస్టర్‌ప్లాన్ రోడ్ల వెనుక వేల కోట్ల కుంభకోణం ఉందని వెలుగు చూడడం విశేషం.

సౌమ్యుల పాలనలో రౌడీరాజ్యం

ఖాళీగా ఉంటే కబ్జా: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో తిరుపతిలో కడప భూ అక్రమణ ముఠాలు ఏవిధంగా పెచ్చుమీరిపోయాయో, అంతకుమించి జగన్‌రెడ్డి పాలనలో తిరుపతి కబ్జాకోరుల చేతుల్లోకి వెళ్లిపోయింది. ఖరీదైన స్థలాలు ఖాళీగా ఉంటే నకిలీ పత్రాలతో ఆక్రమించడం.. లబోదిబోమని అధికారపార్టీ నాయకులకు మొర పెట్టుకుంటే..'కూర్చుని మాట్లాడుకోండి' అని సలహాలివ్వడం.. కూర్చుంటే కోట్లు డిమాండ్ చేయడం..ఇలా తిరుపతి కబ్జాకోరల్లో విలవిలలాడుతోంది. మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ సైనికులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, ప్రవాసాంధ్రుల స్థలాలను కూడా వీరు వదిలిపెట్టలేదు. వీళ్లు ఇంకో ఐదేళ్లు అధికారంలో ఉంటే తిరుపతిలో ఎవరి ఆస్తులూ దక్కవనే భయాందోళనలు పెరిగిపోయాయి.

ముఠా మినిస్ట్రీ: నగరంలో డివిజన్‌ల వారీగా రౌడీ ముఠాలు తయారయ్యాయి. వీరికి యువనేత సారథి అని ఆరోపణలున్నాయి. తన ముఠాలో ఒక్కొక్కరికీ ఒక్కో ప్రభుత్వ విభాగాన్ని కేటాయించి అక్కడ ఏ పనులు కావాలన్నా వారి ద్వారానే జరగాలనే ఆదేశాలు అమలయ్యేలా చూస్తున్నారు. కమిషనర్ అయినా, కార్పొరేటర్లైనా, రెవెన్యూ అధికారులైనా, పోలీసులైనా వీరు చెప్పిందే జరగాలి. దీనికి యువరాజుగారి మంత్రివర్గం అనే పేరు కూడా వాడుకలోకి వచ్చేసింది.

22ఏ బాగోతం: తిరుపతిలో ఎడా పెడా భూములన్నీ హఠాత్తుగా 22ఏ నిషేధిత జాబితాలోకి వెళ్లిపోయాయి. శరణు శరణంటూ వెళ్లడమో లేదా ముడుపులతో సంతృప్తి పరచడమో చేస్తే మాత్రం ఒక్కటొక్కటిగా 22ఏ నుంచి మినహాయించారు. ఇదే తీరులో ఆర్టీసీ బస్టాండు, చింతల చేను, పెద్దకాపు వీధి ఉన్న దాదాపు 188 ఎకరాలు టీటీడీ భూములను నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. కొన్నిచోట్ల 22ఏ నిషేధం తొలగించి.. అంతా తమ దయతోనే జరిగిందని గొప్పలు చెప్పుకుంటున్నారు. భయపెట్టి, బెదిరించి, లొంగదీసుకునే విచిత్ర వ్యూహాన్ని అధికార పార్టీ నేతలు అవలంభిస్తున్నారు.

అలిపిరి కొండవాలునా అవినీతి: అలిపిరి నుంచి జూ పార్కు వరకు ఉన్న 2000 ఎకరాల విలువైన టీటీడీ భూముల మీద కూడా కన్నుపడింది. ఇక్కడ దేవలోక్‌కు కేటాయించిన భూమిని స్టార్ హోటల్ నిర్మాణానికి కట్టబెట్టేశారు. ఆ స్టార్ హోటల్ కోసమే యూనివర్శిటీలో అడ్డంగా రోడ్లు వేయాలనుకున్నారనే ఆరోపణలు వచ్చాయి.

బాబోయ్ ఎన్నికలా!: ప్రశాంత తిరుపతిని ప్రతి ఎన్నికల్లోనూ అశాంతిమయం చేశారు. కార్పొరేషన్ ఎన్నికలు, లోక్‌సభ ఉప ఎన్నిక, టౌన్‌బ్యాంకు, ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన తీరే ఇందుకు ఉదాహరణ. అధికారపార్టీ రౌడీరాజ్యం తిరుపతిలో ఎలా ఉందో నిరూపణ అయ్యింది. నామినేషన్లే వేయనివ్వకుండా బెదిరించడం, వినకపోతే కొట్టడం, నామినేషన్ కాగితాలు చించేయడం, ఆస్తులమీద దాడులు చేయడం.. వంటివి యథేచ్ఛగా జరిగాయి.

స్థానికులపై పగ
పెదకాపు లేఅవుట్‌లో రోడ్డు తవ్వేశారు

తిరుపతి నగరంలో గుండెవంటి ప్రాంతాలైన పెద్దకాపు లేఅవుట్, పెద్దకాపు వీధులపై భూమన కుటుంబం పగ పట్టిందనే నిందను వారు మోయాల్సి వస్తోంది. వారధి నిర్మాణం పేరుతో ఈ ప్రాంతంలోని హోటల్స్, లాడ్జీలకు దారి లేకుండా తవ్వేశారు. వారు ఇదేమి అన్యాయం అని ప్రశ్నిస్తే గత ఎన్నికల్లో తమకు ఓట్లు వేయనందుకే అని తేల్చి చెప్పారని ప్రచారం జరిగింది. కోరినంత ముడుపులిస్తే తప్ప దారి ఉండదని చెప్పడంతో ఆ ప్రాంత వాసులు ఆగ్రహాన్ని కడుపులో దాచుకుని ఉన్నారు. స్థానిక రెడ్డి సామాజికవర్గం పట్ల భూమన కుటుంబానికి కక్ష అనేందుకు ఇదే సాక్ష్యమని ప్రతిపక్ష నేతలు ఆరోపణలు చేస్తున్నారు.

ఈ ఆస్తులు ఎలా వచ్చాయి?

ఏ వ్యాపారాలూ చేయని, వ్యవసాయం చేయని భూమన కరుణాకరరెడ్డి కుటుంబం ఆస్తుల మీద కూడా ఆరోపణలున్నాయి. కేవలం ఒక జిరాక్స్ కేంద్రంలో భాగస్వామిగా ఉండే కరుణాకరరెడ్డి వందల కోట్ల ఆస్తిపరుడు ఎలా అయ్యాడని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తూ ఉంటాయి. ఆయన అధికారం అడ్డం పెట్టుకుని ఆస్తులు సంపాదించాడంటూ, అందుకు సాక్ష్యంగా కొన్ని ఉదంతాలు చూపిస్తుంటాయి.

- కరుణాకర రెడ్డి తుడా ఛైర్మన్‌గా ఉన్న సమయంలో (2005-06) అభినయ్ రెడ్డి పేరిట 21 సార్లు ఆస్తులు కొనుగోలు జరిగాయి. వడమాల పేట మండలం ఎస్వీపురం వద్ద 5.84 ఎకరాలు (ప్రస్తుతం టీటీడీ ఉద్యోగులకు ఇంటిస్థలాలు ఇచ్చిన ప్రాంతం), సూరప్పకశం టౌన్‌షిప్ సమీపంలోని గాజులమండ్యంలో 13.82 ఎకరాలు కలిపి మొత్తంగా 19.66 ఎకరాల భూమిని తుడా ఛైర్మన్‌గా ఉన్నప్పుడే కుమారుడు అభినయరెడ్డి పేరిట ఆస్తులు కొనుగోలు జరిగింది.
- టీటీడీ ఛైర్మన్ అయ్యాక (2007-08)లో మూడు కొనుగోళ్లు జరిగాయి. 2008లో తిరుపతి రూరల్ కొత్తూరు దగ్గర 1.37 ఎకరాల స్థలం అభినయ్ పేరిట కొనుగోలు జరిగింది. తిరుచానూరు గ్రామ లెక్కదాఖలాలో రెండు ఎకరాలు (సర్వే 473/4) 2021లో కరోనా సమయంలో సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే నివాసం ఉంటున్న పద్మావతిపురంలో 2011లోనే నాలుగు చోట్ల రెసిడెన్షియల్ ఆస్తులను కొనుగోలు చేశారు. 2008లో హైదరాబాదులో 2225 చ.అడుగులు కలిగిన ఓ రెసిడెన్షియల్ బిల్డింగ్ అభినయ్ ఆస్తుల ఖాతాలో ఉంది. ఇక భార్య పేరిట 2011లో (సెజ్ సమీపంలో) వరదయ్యపాళెం, పాండూరు దగ్గర- 28 ఎకరాల భూమి గిఫ్ట్ డీడ్ వచ్చింది.




రోజమ్మ కలిపింది అందరినీ...

నగరి నియోజకవర్గంలో నాయకులంతా ఏకమవుతున్నారు. ఇదేదో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రోజా రాజకీయ చతురత, నాయకత్వ పటిమతోనే సాధ్యమైందనుకుంటే పొరబడినట్టే. దశాబ్దాలుగా రాజకీయ ప్రత్యర్థి వర్గాలుగా కొనసాగుతున్న నేతలంతా ఇప్పుడు రోజా ఓటమి కోసం చెట్టాపట్టాలేసుకుంటున్నారు. నింద్ర మండలంలో రెడ్డివారి కుటుంబం ఏళ్ల తరబడి టీడీపీతో పోరాటం చేసింది. ఐదేళ్లుగా రోజా వ్యవహారశైలితో విసుగు చెందిన శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మాజీ ఛైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. విజయపురం లక్ష్మీపతిరాజు ఇదే తీరున టీడీపీ గూటికి చేరారు. పుత్తూరులో డీఎన్ ఏలుమలై కుటుంబం టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీతో హోరాహోరీగా తలపడినా రోజా తీరు నచ్చక గత నెలలో టీడీపీలో చేరారు. వడమాలపేట జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి 2014,2019లో వైసీపీకి బలంగా పనిచేశారు. టీడీపీతో ఢీ అంటే ఢీ అనే స్థాయిలో రాజకీయాలు నెరిపారు. వైసీపీలో ఉక్కబోతను భరించలేక టీడీపీ కండువా కప్పుకున్నారు. కొసమెరుపు ఏంటంటే చాన్నాళ్లుగా వైరి వర్గాలుగా వ్యవహరించిన ఈ నాయకులంతా కొద్దిరోజులుగా సహాయ సహకారాలు అందించుకుంటున్నారు. గాలి భానుప్రకాష్ గెలుపు కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. రోజా ఓటమే సింగిల్ పాయింట్ ఎజెండాగా వీరు పనిచేస్తున్నారు. - పుత్తూరు అర్బన్

'ఫ్యాను' ప్లాను బెడిసికొడుతోంది...

తమ వ్యూహాలు ప్రత్యర్థి పార్టీ వారికి తెలిసిపోతున్నాయని మండల వైసీపీ శిబిరం కలవరపడుతోంది. తామేం చేయబోతున్నామో టీడీపీ వారు ముందుగా పసిగట్టేస్తున్నారని తలపట్టుకుంటోంది. ఐదేళ్లక్రితం ముఖ్య ప్రజాప్రతినిధి విజయానికి వైసీపీలో చాలామంది నాయకులు,కార్యకర్తలు చెమటోడ్చి పనిచేశారు. పార్టీయే సర్వస్వమని భావించి జెండా మోశారు. అధికారం వచ్చాక సదరు ముఖ్య ప్రతినిధి వీరందరినీ పట్టించుకోవడం మానేశారు. తనకు నచ్చిన వారితో కోటరీ ఏర్పరుచుకున్నారు. పార్టీ కోసం కష్టించి పనిచేసిన వారిలో సింహభాగం వైసీపీకి గుడ్ బై చెప్పేశారు. టీడీపీలో చేరిపోయిన వీరంతా ఇప్పుడు అక్కడ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ పరిణామం వైసీపీ నాయకుల్లో గుబులు రేపుతోంది. వార్డుల్లో తామేం చేయబోతున్నామో టీడీపీ నేతలకు తెలిసిపోతోందని ఆందోళన చెందుతున్నారు. పార్టీ వీడిన వారి వల్లే ఇలా జరుగుతోందని భావిస్తున్నారు. తమ అనుపానుల గురించి బాగా తెలియడంతో వ్యూహాలు లీక్ అవుతున్నాయని గ్రహించారు. ఎన్నికల్లో డబ్బుల పంపిణీ,పోల్ మేనేజిమెంట్ లాంటి కీలక పద్ధతులు కూడా ఎలా జరుగుతాయో టీడీపీ శిబిరానికి తెలుస్తుండటంతో వైసీపీ ముఖ్య నాయకులకు ఏం చేయాలో పాలుపోవడంలేదు. - రేణిగుంట



మందుబాబుల అల్టిమేటం



డబ్బులిచ్చినా.. మందు పోయిస్తేనే ప్రచారానికి వస్తామని కొందరు తెగేసి చెబుతుంటే వారికి నచ్చజెప్పడానికి పార్టీల నాయకులు నానాతంటాలు పడుతున్నారు. ఒక అడుగు ముందుకేసి మద్యం లేకుంటే తమను ప్రచారానికి పిలవద్దంటూ అల్టిమేటం జారీ చేస్తున్నారు. అడిగినంత మందు దొరకడంలేదబ్బా....ఎక్కడ నుంచి తీసుకొచ్చి ఇవ్వాలంటూ సర్దిచెబుతున్నా మందుబాబులు వినడంలేదు. వీరి మొండిపట్టుతో తిరుపతిలోని పార్టీల వార్డు బాధ్యులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. శనివారం వరకూ వీరిని కాపాడుకునేందుకు కాళ్లావేళ్లాపడి బతిమలాడుకుంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక మద్యం అమ్మకాలపై ఆంక్షలు విధించడం సమస్యగా మారింది. ఏదోలా మద్యం దుకాణాలను మేనేజ్ చేద్దామన్నా కుదరడం లేదు. పరిమితికి మించి అమ్మితే ఫ్లయింగ్ స్క్వాడ్ కేసులు పెడుతోందని షాపుల వారు జంకుతున్నారు. ఇప్పటికే 12 మందిని తీసేశారు..ఎక్కువ మందు ఇవ్వడం తమవల్ల కాదంటున్నారు. చేసేదిలేక తమిళనాడు నుంచి చీఫ్ లిక్కర్ తీసుకొచ్చి అడ్డదారుల్లో పంపిణీ చేస్తున్నారు. తిరుపతి నగరంలోని చాలా వార్డుల్లో ఈ తలనొప్పి సన్నివేశాలు కనిపిస్తున్నాయి.

-తిరుపతి(నేరవిభాగం)

క్యాంపస్ సెలక్షన్లు కనుమరుగు

నేను సైతం



మాది ఏర్పేడు మండలం కొత్త కాల్వ గ్రామం. నాన్న నాదముని రెడ్డి సన్నకారు రైతు. ఆ రోజుల్లో రాష్ట్రంలో చదువుకున్న యువతకు ఉద్యోగాలు వచ్చేవి కావు. 1999లో చంద్రబాబు నాయుడు సీఎం అయ్యారు. ఆయన ముందు చూపుతో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేయడానికి చాలా కృషి చేశారు. చంద్రబాబు చొరవతో ఆ రంగం వేళ్లూనుకుని చాలా మందికి బతుకు దారి చూపించింది. ఆయన సమర్థ నాయకత్వంపై నమ్మకంతో మానాన్న నన్ను 2001లో ఇంజినీరింగ్ చదివించారు. చెన్నైలో నెలకు రూ.1.5 లక్షల జీతం వస్తోంది. ఆనాడు చంద్రబాబు చేసిన అభివృద్ధి ఫలితంగా నా కుటుంబం పేదరికాన్ని జయించింది. అయితే గడచిన ఐదేళ్లుగా వైసీపీ పాలనలో శ్రీకాళహస్తితోపాటు రాష్ట్రం పరిస్థితి దారుణంగా మారిపోయింది. చదువుకున్న యువత ఉద్యోగాలు లేక దారి తప్పుతున్నారు. స్కూల్ పిల్లల సైతం మద్యం తాగుతున్నారని తెలుసుకుంటే బాధ, భవిష్యత్ మీద ఆందోళన కలుగుతున్నాయి. గంజాయి, డ్రగ్స్ వినియోగం పెరిగిపోయింది. ఐదేళ్ల నుంచి పేరున్న కాలేజీల్లో సైతం క్యాంపస్ సెలక్షన్లు నిలిచిపోయాయి. ఎంపికకు రావడానికి కంపెనీలు భయపడిపోతున్నాయి. నాణ్యమైన సాంకేతిక విద్య కోసం విద్యార్థులు పక్క రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారు. ఇలాంటి పరిస్థితులు గాడిన పడాలంటే చంద్రబాబును మళ్లీ గెలిపించుకోవాలి. ఆయన సీఎం అయితే తప్ప రాష్ట్రం బాగుపడదు.. అందుకే సెలవు పెట్టి వచ్చి ప్రచారంలో పాల్గొంటున్నాను. టీడీపీ అధికారంలోకి రావలసిన అవసరం గురించి వివరిస్తున్నాను.

- లోకేష్ కుమార్

-శ్రీకాళహస్తి

నమ్మకస్తుల కోసం వేట

ఎన్నికలు దగ్గరకొచ్చేశాయి. ప్రచారం గడువూ ముగిసిపోతోంది. దీంతో నగదు పంపిణీపై కీలక నాయకులు దృష్టి పెట్టారు. ఇందులో పాత్ర పోషించే అత్యంత నమ్మకమైన వారి కోసం నాయకులు ఆరా తీస్తున్నారు. గత ఎన్నికల్లో పనిచేసిన వారి గుణగణాలను తెలుసుకుంటున్నారు. డబ్బులు నొక్కేస్తారనుకున్నవారిని దూరం పెడుతున్నారు. ప్రాంతాల వారీగా పంపిణీ చేయాల్సిన మొత్తంపై లెక్కలేయడంలో తలమునకలై ఉన్నారు. ఓటర్లందరికీ ఒకే తీరుగా కాకుండా కేటగిరీలుగా విభజించి పంచాలని వీరు భావిస్తున్నట్లు సమాచారం. ఖచ్చితంగా తమకు అనుకూలంగా వేసేవారు, డబ్బులిస్తేనే ఓటేస్తారనుకునేవారు, ఇచ్చినా ప్రత్యర్థి పార్టీ అభ్యర్థికి ఓటేస్తారనుకునేవారు.. ఇలా కేటగిరిల వారీగా ఎవరెవరు ఎంతమంది ఉంటారనే కోణంలో అభ్యర్థులు లెక్కలతో కుస్తీ పడుతున్నారు. కొందరు చోటామోటా నాయకులు ఇప్పటికే అభ్యర్థుల సన్నిహితులను సంప్రదించడం మొదలెట్టారు. తమ చేతిలో ఇన్ని ఓట్లున్నాయంటూ బేరాలకు దిగుతున్నారు. వీరిలో ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో ముఖ్యనేతలు తెలియక తలపట్టుకుంటున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ తరహా సంఘటనలు జరుగుతున్నాయని సమాచారం. గెలుపు ఓటములను ప్రభావితం చేసే నగదు పంపిణీ విషయంలో నేతలు ఆచితూచి వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది.

-తిరుపతి(ఆంధ్రజ్యోతి)



ఆ వాహనమే గెలిపిస్తోందా...

సెంటిమెంట్

రాజకీయ నాయకుల్లో చాలామంది సెంట్‌మెంట్లను గట్టిగా నమ్ముతారు. కొందరికి ముహూర్తాలు, మరికొందరు దైవ దర్శనం .. ఇలా రకరకాల సెంట్‌మెంట్లను పాటిస్తుంటారు. మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు పరసారత్నం తాను మొదట పోటీ చేసిన సమయంలో ఉపయోగించిన అంబాసిడర్ కారునే ఎన్నో ఎన్నికలకు వాడారు. ఆ వాహనం నంబరు 1234. కార్లు మారినా ఆ నంబరును మాత్రం ఆయన వదులుకోడానికి ఇష్టపడరు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్యకు కూడా వాహన నంబరు సెంటిమెంటెక్కువే. 9వ నంబరు ప్లేటుండే కారునే వాడుతుంటారు. రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి ఈ నంబరున్న బ్లాక్ కలర్ ఇన్నోవాలోనే వెళ్లి నామినేషన్ దాఖలు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఖచ్చితంగా ఈ వాహనంలోనే ప్రయాణిస్తారు. ఈసారీ అదే సెంటిమెంట్ ఫాలో అవుతున్నారు. - తడ



మాజీ మంత్రి పరసారత్నం వాడుతున్న ఇన్నోవా

ప్రశాంతంగా ముగిసిన పోస్టల్ బ్యాలెట్

గూడూరు అర్బన్/సూళ్లూరుపేట, మే 9: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ఐదో రోజు ప్రశాంతంగా ముగిసింది. గూడూరు జడ్పీబాలుర ఉన్నత పాఠశాల ఫెసిలిటేసన్ సెంటర్‌లో మొత్తం 2627 ఓట్లు ఉండగా గురువారం అదనంగా 12 ఓట్లు నమోదు చేసుకున్నారు. దీంతో మొత్తం 2,639 ఓట్లుకాగా పోలింగ్ ముగిసే సమయానికి 2431 పోలవడంతో 92.11 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. సూళ్లూరుపేట వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలలో పోస్టల్ బ్యాలెట్ కోసం ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో ఉద్యోగులు ఐదో రోజు కూడా ఓటు హక్కు వినియోగించుకొన్నారు. మొత్తం 1924 ఓటర్లకు గాను 1842 మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకొన్నారు. ఐదు రోజులు ఓటింగ్ 95.74 శాతంగా నమోదైంది.

ఎన్‌బీకేఆర్‌లో నేదురుమల్లి వర్ధంతి

కోట, మే 9: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం మాజీ సీఎం స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన రెడ్డి 10వ వర్ధంతి జరిగింది. ఆయన చిత్రపటానికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎన్‌బీకెఆర్ విద్యా సంస్థల అభివృద్ధిలో జనార్దన రెడ్డి సేవ, కృషిని డైరెక్టర్, విభాగాధిపతులు కొనియాడారు.

షార్‌లో అగ్నిమాపక వారోత్సవాలు

సూళ్లూరుపేట, మే 9: సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో గురువారం జాతీయ అగ్నిమాక వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక వ్యవస్థ, సిబ్బంది సేవలను వివరించారు. ముఖ్యఅతిథి ఐవోసీఎల్ మాజీ ఈడీ సంజయ్ కుమార్ వర్ధన్ సిబ్బందికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం అక్కడే పనిచేసే ఉద్యోగుల కుటుంబ సభ్యులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసులు రెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ హమ్మద్, షార్ ఉద్యోగులు సుబ్బనాథం, పి.వెంకటరెడ్డి, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.




వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న షార్ డైరెక్టర్ తదితరులు

కలగా ముఖద్వారాల పూడికతీత

కోట, మే 9: సముద్రతీరం ముఖద్వారాల పూడికతీత పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఈ పనులు చేపడితే తమ బతుకులు మారిపోతాయన్న మత్స్యకారుల ఆశలు నెరవేరలేదు. కోట మండలం గోవిందపల్లిపాళెం, వాకాడు మండలం కొండూరుపాళెం, తూపిలిపాళెం, రాయదొరువు గ్రామాల్లో సముద్రం ముఖద్వారాల వద్ద శాశ్వతపూడికతీత పనులు చేపట్టాలని ఆయా గ్రామాల మత్స్యకారులు చాలాకాలంగా కోరుతున్నారు. జగన్ పాదయాత్ర చేసినప్పుడు కూడా అర్జీలు ఇచ్చినా ఫలితం లేకపోయిందని వీరు ఆవేదక వ్యక్తం చేస్తున్నారు.

చేపలవేట సాగేదెలా..

సమీప ఉప్పుటేరుల నుంచి పడవలు ప్రవేశించే మార్గాలను సముద్ర ముఖద్వారాలు అంటారు. బకింగ్‌హాం కెనాల్ ఉప్పుటేరుల మీదుగా మత్స్యకారులు నేరుగా సముద్రంలోకి వేటకు వెళ్లాల్సి ఉంటుంది. సముద్రానికి, ఉప్పుటేరులకు వారధిలా ఉండే ముఖద్వారాలు ఏటా ఇసుకమేటలతో నిండిపోతున్నాయి. ముఖద్వారాలు పూడిపోయినప్పుడు పడవల ద్వారా వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గం ఉండదు. అలాంటి పరిస్థితుల్లో చేపల వేటకు వెళ్లాలంటే చాలా కష్టం. రెక్కాడితేగాని డొక్కాడని మత్స్యకార కుటుంబాలు చేపల వేటే జీవనాధారం. ముఖద్వారాల వద్ద శాశ్వత ప్రాతిపదికన పూడిక తీస్తేనే వీరి కష్టాలు తీరతాయి. కానీ వైసీపీ నాయకులు ఐదేళ్లుగా ఇదిగో అదిగో అంటూ హామీలిచ్చి కాలయాపన చేశారని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గోవిందపల్లిపాళెం ముఖద్వారం వద్ద ఇసుకమేటలు

టీడీపీ రోడ్‌షో



కోట, మే 9: పట్టణంలో టీడీపీ నేతలు రోడ్‌షో నిర్వహించారు. సెంట్రల్ బ్యాంక్ వైస్ చైర్మన్ ఎన్.జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీబొమ్మ సెంటర్ నుంచి క్రాస్‌రోడ్డు వరకు రోడ్‌షో నిర్వహించారు.జరుగుమల్లి, కొత్తపాళెం, వీవీ అగ్రహారం, దళిత గిరిజనవాడల్లో కూటమి అభ్యర్థిలు పాశిం, ప్రసాదరావును గెలిపించాలని అభ్యర్థించారు.

'వేద విజ్ఞాన వేదిక' కందనూరు మధుకు పితృవియోగం


సీతారామయ్య (ఫైల్‌ఫొటో)

చెన్నై, మే 9 (ఆంధ్రజ్యోతి): 'వేద విజ్ఞాన వేదిక' ప్రధాన కార్యదర్శి, తెలుగు ప్రముఖుడు కందనూరు మధుకు పితృవియోగం కలిగింది.కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తండ్రి డాక్టర్ కందనూరు సీతారామయ్య (90) చెన్నై నగరంలో కన్నుమూశారు. సీతారామయ్యకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె వుండగా, వారిలో రెండో కుమారుడే మధు. 2019 నుంచి పక్షవాతంతో బాధపడుతున్న సీతారామయ్య.. వీల్‌చైర్‌కే పరిమితమయ్యారు. మెహతానగర్‌లోని తన చిన్న కుమారుడైన డాక్టర్ శ్రీరాం వద్ద వుంటున్న ఆయన.. బుధవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. గురువారం ఆయన భౌతికకాయానికి నుంగంబాక్కంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి. నెల్లూరు జిల్లా లేబూరుకు చెందిన సీతారామయ్య.. 1950వ దశంలో మద్రాస్ నగరంలోనే వైద్య విద్యాభ్యాసం చేశారు. అనంతరం నెల్లూరు, గూడూరుల్లో వైద్య వృత్తి సాగించారు. గూడూరులో నాలుగున్నర దశాబ్దాల పాటు వైద్యసేవలందించారు. 1951-52 ప్రాంతంలో పొట్టి శ్రీరాములు దీక్ష, ఆ తరువాత ఆత్మార్పణ జరిగాక, మద్రాసుతో గూడిన ఆంధ్రరాష్ట్రం కావాలన్న నినాదంతో జరిగిన ఆందోళనల్లోనూ సీతారామయ్య పాల్గొన్నారు. ఈ ఆందోళనలకు నేతృత్వం వహించిన 'చెన్నపురి ఆంధ్ర విద్యార్థి సమితి'లో సీతారామయ్య క్రియాశీలక కార్యకర్తగా వ్యవహరించారు. హేమాహేమీలైన ప్రకాశం పంతులు, తెన్నేటి విశ్వనాధం, బెజవాడ గోపాలరెడ్డి, స్వామి సీతారాం, నీలం సంజీవరెడ్డి, కడప కోటిరెడ్డి, తరిమెల నాగిరెడ్డి లాంటి గొప్ప నేతల్ని, వారి పని తీరు దగ్గరి నుంచి గమనించినవారిలో ఆయన ఒకరు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు సమయాన మద్రాస్ నగరంలో ఏర్పడిన ఘటనలకు ఆయన ప్రత్యక్ష సాక్షి. 1964 నుంచి రోటరీ క్లబ్ సభ్యుడిగా వ్యవహరించిన ఆయన.. వివిధ దేశాల్లో పర్యటించి మన దేశ సంస్కృతీ సంప్రదాయాలపై ఉపన్యసించారు. 2007లో ఆయన సతీమణి శ్రీలక్ష్మి కన్ను మూయడంతో తీవ్ర మనోవేదనకు గురైన సీతారామయ్య.. అప్పటి నుంచి వైద్య సేవలకూ విరామం ప్రకటించారు. ఇదిలా వుండగా సీతారామయ్య మృతి పట్ల నగరంలోని పలువురు తెలుగు ప్రముఖులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

చంద్రబాబు పాలనలోనే రాష్ట్రం సుభిక్షం: నెలవల



పుదూరు ప్రచారంలో నెలవల, పరసా, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు - అన్నమేడులో పరసా, నెలవల, విజయభాస్కర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డికి గజమాల సత్కారం

నాయుడుపేట, మే 9: టీడీపీ అధినేత చంద్రబాబు పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పుదూరులో మాజీమంత్రి పరసారత్నం, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కె.అశోక్‌రెడ్డి, పి.రత్నం, బీజేపీ నాయకుడు ఆర్.కృష్ణయ్య తదితరులతో కలసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. చంద్రబాబు పాలనలో విద్యుత్తు, బస్సు చార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు పెరిగేవి కాదని, వైసీపీ పాలనలో ధరలు ఆకాశాన్నంటాయన్నారు. టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీని, తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌ను గెలిపించాలని కోరారు.

టీడీపీ గెలుపు ప్రగతికి మలుపు: విజయశ్రీ

టీడీపీ గెలుపుతో రాష్ట్ర ప్రజల ప్రగతికి తొలి మలుపు అవుతుందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ అభ్యరి విజయశ్రీ అన్నారు. మర్లపల్లిలో విజయశ్రీకి, టీడీపీ నాయకురాలు దుప్పల మంజులమ్మ ఆధ్వర్యంలో క్రేన్‌తో భారీ పూలమాల వేశారు. మాజీ మంత్రి డాక్టర్ పరసారత్నం, ఎస్.విజయ భాస్కర్‌రెడ్డి, కె.అశోక్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, ఎ.రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నమేడు, కాలువగట్టుల్లో ఇంటింటా ప్రచారం చేపట్టారు. సూపర్ సిక్స్‌తో ప్రతి కుటుంబీకుడు లబ్ధిపొందుతారన్నారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీరాం ప్రసాద్, డి.రాజేంద్ర, సిద్ధవరం వర్మ, కుబేరు మణి, డి.రవీంద్ర, చిన్నస్వామి, చంద్రశేఖర్, శ్రీనివాసులు, బీజేపీ నాయకులు మధురెడ్డి, రవి పాల్గొన్నారు.

కూటమితోనే అసలైన సంక్షేమం: వాకాటి

టీడీపీ, బీజేపీ, జనసేన కూటమితో రాష్ట్రంలో అసలైన సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి అన్నారు. నాయుడుపేట విజయగణపతి దేవస్థానం నుంచి ఎస్.విజయ భాస్కర్‌రెడ్డి, జి.ప్రభావతమ్మ, కె.కృష్ణారెడ్డి, ఎం.శోభారాణి, ఉయ్యాల ప్రవీణ్ తదితరుల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అడుగడుగున ర్యాలీకి ప్రజలు నీరాజనాలు పలికారు. ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, ఎం.రాజ శేఖర్, చంద్రారెడ్డి, గంగాప్రసాద్, చెంగయ్య, పూనాటి తిరుమలనాయుడు, డి.ప్రభాకర్‌నాయుడు, జీ.వీ.ఆర్.నాయుడు, జి.రాజేష్‌నాయుడు, సుధీర్‌రెడ్డి, ధనంజయ, కిషోర్, సుజాతమ్మ, రేవతి, బీజేపీ నాయకులు మాల్యాద్రి నాయుడు, రాజశేఖర్‌రెడ్డి, సురేంద్ర, జనసేన నాయకుడు జి.సతీష్ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.


నాయుడుపేట ర్యాలీలో వాకాటి, విజయభాస్కర్‌రెడ్డి, ప్రభావతమ్మ

వైసీపీని సాగనంపుదాం: కురుగొండ్ల పిలుపు



జయంపు ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కురుగొండ్ల రామకృష్ణ - కురుగొండ్ల రామకృష్ణను గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు

వెంకటగిరి/ డక్కిలి, మే 9: ఐదేళ్ల ప్రజలకు నరకం చూపించిన వైసీపీని తరిమేయాలని టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం బాలాయపల్లి మండలం అలిమిలి, జయంపు, గొట్టికాడు గ్రామాల్లో ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జయంపు జనసంద్రంగా మారింది. గ్రామంలోకి రాగానే జనం ఆయనకు గజమాల వేసి సత్కరించారు. మహిళలు కర్పూర హారతలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ... వైసీపీ పాలనపై ప్రజలు కసితో ఉన్నారని మే 13న జరిగే ఎన్నికల్లో ఓటుతో వైసీపీని తరిమేస్తారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అభివృద్ధి, సంక్షేమం అందరికీ అందిస్తామని చెప్పారు. వెంకటగిరిలో మంచి మెజార్టీతో తాను విజయం సాధించబోతున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో స్థానికేతరులకు ఓటు వేస్తే నియోజకవర్గంలో అభివృద్ధి జరగదన్నారు. స్థానికేతురులకు ఓటు వేస్తే మీకు ఏం పని కావాలన్నా వాకాడు, చెన్నై, హైదరాబాదుకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. స్థానికుడినైనా తనను గెలిపిస్తే ఇక్కడే ప్రజల మధ్య ఉంటానని చెప్పారు. రాయి మస్తాన్‌నాయుడు, భాస్కరరావు, సత్యం నాయుడు, కూన శ్రీహరి, దాసరి ప్రభాకరనాయుడు, రాజగోపాల్ నాయుడు, రఘురామిరెడ్డి, మురళీమోహన్ రెడ్డి, గోపికృష్ణ, ఎ.రమణమ్మ, మీరారెడ్డి, రాంబాబురెడ్డి, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు. గొట్టికాడులో చీళ్ల జపణ్య అనే వాలంటీర్ కురుగొండ్ల సమక్షంలో టీడీపీలో చేరారు.

వైసీపీ పాలనలో యువత భవిష్యత్తు నాశనం

వైసీపీ పాలనలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత భవిష్యత్తు నాశనమైందని కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె లక్ష్మీసాయిప్రియ అన్నారు. గురువారం వెంకటగిరి పట్టణంలోని 9వ వార్డు ఉపాధ్యాయకాలనీలో ఆమె తన తండ్రి కురుగొండ్ల రామకృష్ణను గెలిపించాలంటూ ఇటింటికీ వెళ్లి ఓటర్లుకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ అరాచక పాలన వల్ల రాష్ట్రానికి పరిశ్రమలు రాకపోగా జే ట్యాక్సు కట్టలేక ఉన్న పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు పారిపోవడంతో యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోయిందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే వెంకటగిరి నియోజకవర్గంలోని యువతకు తాను అండగా నిలిచి వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చేలా బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలో ఎంతో మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. యువత నష్టపోయిందల్లా గడిచిన ఐదేళ్లలోనే నని చెప్పారు. ఇక రైతుల భూములు తాకట్టు పెట్టేందుకు ల్యాడ్ టైటలింగ్ చట్టాన్ని తీసుకువచ్చారని దీని వల్ల భూమిపై సర్వ హక్కులు కోల్పోతారని వివరించారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఆ చట్టాన్ని పూర్తిగా రద్దుచేస్తామని నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చి ఉన్నట్లు గుర్తుచేశారు. పి. రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్, బీ.రాజేశ్వరరావు, శ్రీరాంబాబు, జె.మురళి, ఆమల చలపతి, భాస్కరరెడ్డి తదితరులు ఉన్నారు.


9వ వార్డులో లక్ష్మీసాయిప్రియ ఎన్నికల ప్రచారం

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం: వరప్రసాద్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వెలగపల్లి వరప్రసాద రావు - తిరుపతిలో ప్రచారం నిర్వహిస్తున్న కొల్లూరి లక్ష్మి, స్ఫూర్తి తదితరులు

తిరుపతి, (ఉపాధ్యాయనగర్) మే 9: బీజేపీ అవలంబిస్తున్న విధానంతోనే దేశం సుస్థిర భారతదేశంగా అవతరిస్తోందని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు అన్నారు. గురువారం ఓ ప్రైవేట్ హోటల్‌లో గాండ్ల కుల మనః కలయిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వరప్రసాద రావు మాట్లాడుతూ... ఎన్డీఏ కూటమికి బీసీలే వెన్నముకలాంటివారని కొనియాడారు. వైసీపీ ప్రభు త్వం కులాల వారీగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందేగానీ వాటి అభి వృద్ధికి నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేసిందని ధ్వజమెత్తారు. అరాచకం, అప్పులే జగన్ ప్రభుత్వ వైఖరిగా మారిందని కనీసం ఎటువంటి అభివృద్ధి జరగలేదని వాపోయారు. ఇటువంటి ప్రభుత్వం మనకు అవసరమా అని ప్రశ్నించారు. గతంలో తాను ఎంపీగా పని చేసినప్పుడు అభివృద్ధికి బీజేపీ సహకారం అందించిందని గుర్తుచేశారు. ఈ ప్రభుత్వానికి బుద్ధిచెప్పేలా ఎన్డీఏ కూటమికి ఓట్లువేసి గెలిపిం చాలని కోరారు. తాను ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో గాండ్లకుల నాయకులతోపాటు బీజేపీ నాయకులు విష్ణుకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో విస్తృతంగా ప్రచారం...

తిరుపతిలో బీజేపీ తరపున విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు జరిగాయి.ఇందిరానగర్, టౌన్‌క్లబ్, ఐఎస్‌మహల్‌రోడ్డు, బైరాగిపట్టెడ, ఎస్టీవీ నగర్, ఎయిర్ బైపాస్‌రోడ్డు, అంబేద్కర్ కాలనీల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ప్రచారంలో తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు సతీమణి కొల్లూరి లక్ష్మి, కుమార్తె డాక్టర్ స్ఫూర్తి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి బీజేపీ, టీడీపీ, జనసేన అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలంటూ అభ్యర్థించారు. ప్రచారం చేస్తున్న తమను స్థానికులు ఎంతో ప్రేమాభిమానాలతో ఆదరిస్తున్నారని వారి ఆదరాభిమానాలు చూస్తుంటే తమ విజయం ఖాయమని అనిపిస్తుందని వారు అన్నారు.

కామిరెడ్డీ... మా కార్యకర్తల జోలికి రావొద్దు: టీడీపీ

పెళ్లకూరు, మే 9: టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఫోన్లు చేసి బెదిరించడం... ప్రలోభాలకు గురి చేస్తున్న నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డికి తగదని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వి.మురళీకృష్ణారెడ్డి, ఆ పార్టీ సీనియర్ నేత పి.రమేష్ నాయుడు హితువు పలికారు. చిల్లకూరులో ఇంటింటా ప్రచారం సందర్భంగా వారు మాట్లాడుతూ... గౌరవనీయ పదవిలో ఉన్న కామిరెడ్డి హుందాగా వ్యవహరించకుండా ఇష్టాను సారంగా మాట్లాడడం తగదన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, పేరం మధుసూదననాయుడు, శేఖర్‌నాయుడు, రాజగోపాల్‌రెడ్డి, చైతన్యకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

బెయిల్‌పై ఉన్న వ్యక్తి రాష్ట్రాన్ని పాలించడం దురదృష్టం

తిరుపతి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చింతామోహన్

సూళ్లూరుపేట, మే 9: బెయిల్‌పై ఉన్న వ్యక్తి రాష్ట్రాన్ని పాలించడం దురదుష్టకరమని తిరుపతి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చింతా మోహన్ అన్నారు. గురువారం ఆయన ఎమ్మెల్యే అభ్యర్థి చందనమూడి శివతో కలిసి ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ... సీఎం జగన్ పలు కేసుల్లో అరెస్టయ్యి బెయిల్‌పై రాష్ట్రాన్ని పాలిస్తున్నాడంటే ఇంతకన్నా దౌర్భాగ్యం ఏముందన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు బెయిల్ రాకుండా బీజేపీ అడ్డుకుంటోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కేజ్రీవాల్ విషయంలో ఒకలా జగన్ విషయంలో మరోలా వ్యవహరిస్తోందన్నారు. ఈ సారి జగన్‌కు 30 సీట్లు కంటే ఎక్కువ రావన్నారు. కేంద్రంలో కూడా బీజేపీకి ఎదురుదెబ్బ తగలడం ఖాయమన్నారు. కె. హరికృష్ణ, రాజేంద్ర, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో చింతా తదితరులు

టీడీపీని గెలిపించుకుందాం: పాశిం

గూడూరు, మే 9: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకుందామని టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ కోరారు. గురువారం 7వ వార్డులో ఇంటింటి ప్రచారం సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూటమి మేనిఫెస్టో అమలు జరగాలంటే ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలన్నారు. మహిళలకు, యువతకు, రైతులకు, బీసీలకు, మైనార్టీలకు, ఎస్సీ, ఎస్టీలకు అధికారంలోకి రాగానే అభివృద్ధి ఫలాలను అందిస్తామన్నారు. ప్రచారంలో శ్రీనివాసులు, రవి, పార్థసారధి, సునీల్, వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.



సైకో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించుదాం: పాశిం సునీల్‌కుమార్



వల్లిపేడులో వైసీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న పాశిం సునీల్‌కుమార్ - గూడూరులో బ్యాలెట్ నమూనాపై అవగాహన కల్పిస్తున్న పాశిం

చిల్లకూరు, మే 9: రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తున్న సైకో వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దెదించేందుకు అందరం కలిసికట్టుగా పని చేద్దామని టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. వల్లిపేడులో తానంకి నానాజీ సమక్షంలో గ్రామానికి చెందిన నందకుమార్‌తోపాటు పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పాశిం మాట్లాడుతూ... ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను ధ్వంసం చేసిందన్నారు. వైసీపీ పాలనను తట్టుకోలేక ఆ పార్టీకి చెందిన వారే స్వచ్ఛందంగా రాష్ట్రాభివృద్ధిని కాంక్షించి టీడీపీలోకి చేరుతున్నారన్నారు. ఎన్నికలకు సమయం తక్కువగా ఉండడంతో అందరం ఐకమత్యంతో కలిసికట్టుగా పనిచేసి చంద్రబాబును సీఎంగా గెలిపించుకుందామన్నారు. ఎస్సీ వెంకటరమణారెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, నాగరాజు, చంద్రశేఖర్, అంకయ్య, శ్రీనివాసులు, పుట్టయ్య, వరప్రసాద్, రవీంద్ర, కృష్ణయ్య, శివయ్య, కస్తూరయ్య, మురళి, రాజశేఖర్‌రెడ్డి, లింగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, భారతి పాల్గొన్నారు.

ఈవీఎంలో 3వ నెంబరుపై ఓటు వేయాలి

గూడూరు, మే 9: రానున్న ఎన్నికల్లో అసెంబ్లీ స్థానానికి సంబంధించి ఈవీఎంలో 3వ నెంబరుపై సైకిల్‌గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పట్టణ పరిధిలో పలువురు ఎరుకుల కుటుంబాలకు చెందినవారు టీడీపీలోకి చేరడంతో వారిని పార్టీలోకి ఆహ్వానించి ఈవీఎం బ్యాలెట్ నమూనాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. శీనయ్య, మణి, సుబ్రమణ్యం, శ్రీనివాసులు, చెంగయ్య, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు కృషి

రాష్ట్రాభివృద్ధిని ఆలోచించి డాక్టర్లందరూ టీడీపీకి ఓటువేసి గెలుపునకు సహకరించాలని టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ తనయుడు డాక్టర్ జశ్వంత్ కుమార్ కోరారు. పట్టణంలోని పలు ప్రైవేటు వైద్యశాలల్లో డాక్టర్లను కలిసి ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మునిగిరీష్, రవి, శ్రీకాంత్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.


టీడీపీకి ఓటు వేయాలని వైద్యుడిని కోరుతున్న జశ్వంత్‌కుమార్